


అది 1770 వ సంవత్సరం అప్పటికి రెండేళ్ళుగా వంగదేశాన్ని కరువు కాటకాలు పట్టి పీడిస్తున్నవి. 1768 వ సంవత్సరంలో పంటలు బాగా పండకపోవటంతో ధాన్యం ధర విపరీతంగా పెరిగిపోయింది. సామాన్యప్రజలు నానా యిక్కట్లకూ గురికాసాగారు. కాని, నవాబు మాత్రం గోళ్ళూడకొట్టి పన్నులు వసూలు చేశాడు.

1769 వ సంవత్సరంలో తొలకరిన మంచివర్షాలు పడినై. ప్రజల ఆనందాని కంతు లేదు. హఠాత్తుగా ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో వర్షాభావం కలిగింది. ఎదిగివచ్చిన పైర్లు భూమి బెట్టతీయటంతో నిలువునా ఎండిపోయినై. ఎక్కడైనా కొంచెం చెదురు మదురుగా ధాన్యం పండితే, దాన్ని సైనికులకోసం నవాబుఉద్యోగులు కొనివేశారు.

ఆ తరువాత భయంకరమైన కాటకం ప్రారంభమైంది. 1770 వ సంవత్సరంలో అసలు వర్షాలే పడలేదు. కాయకష్టం చేసి బతికే పేదాబిక్కీ బిచ్చమెత్తసాగారు కాని, వారికి బిచ్చం పెట్టే నాథుడులేడు అంతో యింతో షావసతి వున్న రైతులే, తమ పశుగణాన్నీ, వ్యవసాయ పరికరాలనూ అమ్మి. కొన్నాళ్ళపాటు అర్ధాకలితో బతికి, యిక చేసేదిలేక అడవిలో దొరికే దుంపలూ ఆకలములూ తినసాగారు. అవీ దొరకనిదశ రాగానే, చావసిద్ధంగా వున్న కుక్కల్నీ, పిల్లుల్నీ పట్టుకుని తిన సాగారు. కొందరు ఒక సోలెడుగింజలకు తమ పిల్లల్ని బానిసలుగా అమ్మేశారు

ఈ భయంకర వాతావరణంలో అంటురోగాలు చెలరేగినై. విషజ్వరం, కలరా, క్షయ, మసూచికలతో జనులు దిక్కులెని చావులకు గురికాసాగారు ఏ కొంపలోనైనా ఒకరికి కలరాగాని, మసూచిగాని సోకిందో – ఆ వెంటనే రోగిని అక్కడే వదిలి బంధుగణం దూరంగా ఏ అడవికో పారిపోసాగారు. వంగదేశంలోని ప్రతి గ్రామం, పల్లెకూడా యిలాంటి దుర్భర దారుణ పరిస్థితుల్లో చిక్కి, ప్రజలు నరక యాతనలు అనుభవిస్తున్నారు.

అది నడివేసవి. మిట్టమధ్యాహ్నంవేళ సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. పదచిహ్నమనే గ్రామంలోని వీధులూ, ఇళ్ళూ ఆ వేడిమికి పొగలూ, సెగలూ వెలార్చుతున్నవి గ్రామంమధ్య ఒకే ఒక రెండంతస్తులమేడ వున్నది. తక్కిన వన్నీ పూరి ఇళ్ళు. ఆ మేడకూ, ఆ గ్రామంచుట్టూ వున్న ఎక్కువభాగం భూములకూ యజమాని మహేంద్రసింహుడు. మహేంద్రసింహుడంతటి ధనికుడు ఆ చుట్టుపక్కల గ్రామాలలోకూడా మరెవ్వరూ లేరు.

కరువుధాటికి తట్టుకోలేక పదచిహ్నగ్రామస్తు లందరూ ఏనాడో గ్రామం విడిచి తలాఒక దిక్కుకూ పారిపోయారు. పోగా, గ్రామంలో వున్న ఆ మేడలో మిగిలినది మహేంద్రసింహుడూ, ఆయనభార్య కళ్యాణీ, వారి సంతానం రెండేళ్ళ శిశువు సుకుమారీమాత్రమే.

మహేంద్రుడూ, అతడిభార్యా ఉపవాసాలతో సగం అయారు. సుకుమారికి పాలిచ్చే ఆవు మేతలేక చావ సిద్ధంగా వున్నది. ఈ దుర్భర పరిస్థితుల్లో తా మిక గ్రామంలో వుండటం క్షేమం కాదని ఆ భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు.

మర్నాడు ఉదయం మహేంద్రుడు కొంతధనం మూటగట్టుకుని, ఇంటికి తాళాలు వేసి భార్యా బిడ్డతో రాజధాని నగరానికి ప్రయాణ మయ్యాడు. అతడు ఇంటి ప్రాంగణం దాటి వీధిలోకి వస్తూనే ఆగి, వెన్నంటివస్తున్న భార్యతో, "మనం రాజధానిపట్టణం చేరేలోపల కొండలూ, అడవులూకూడా దాటవలసి వుంటుంది. రోజులు బాగాలేవు. ఎక్కడ చూసినా దారిదోపిడిగాళ్లు విచ్చలవిడిగా తిరుగుతున్నట్టు వార్తలు వింటున్నాం. ఎందుకైనా మంచిది, తుపాకీ తెస్తాను," అంటూ తిరిగి ఇంటిలోకి వెళ్ళి, తుపాకీ కొన్ని తూటాలూ తీసుకుని బయటికి వచ్చాడు.

కళ్యాణికూడా భర్తను అనుసరించి ఇంటి ముఖద్వారం దగ్గరకు వెళ్ళి, అతడు బయటికివచ్చి, తలుపులకు తాళం వేయబోయేంతలో, "ఆగండి! ఆత్మరక్షణకు నాకు ఉపయోగించేఅస్త్రం నేను తెచ్చుకుంటాను," అంటూ లోపలికి వెళ్ళి, ఒకచిన్న విషపు భరిణను భద్రంగా పమిటచెంగుకు కట్టుకుని బయటికి వచ్చింది.

జ్యేష్ఠమాసపు మండు ఎండలో పడి మహేంద్రసింహుడు రాజధాని పట్టణం కేసి ప్రయాణ మయ్యాడు. దారిలో వారికి తగిలిన చెరువులూ, గుంటలూ అన్నీ ఎండి పోయి వున్నవి. దాహబాధకు ఓర్చలేనప్పుడు ఎక్కడైనా చెరువులో కొద్దిగా మిగిలివున్న మురికి నీటినే తాగి దాహశాంతి చేసుకుంటూ, చీకటి పడేవేళకు వారొక మజిలీ చేరారు. అది ఒక చిన్న సత్రము ఆ సత్రంలో మనుషు లెవరూ లేరు. చుట్టుప్రక్కల వున్న ఇళ్ళల్లో గృహస్థు లున్న సూచన లేమీ కనిపించలేదు. మహేంద్రుడు తన భార్యనూ, బిడ్డనూ సత్రం లోపల ఒక గదిలో కూర్చోపెట్టి, అక్కడ గోడకు ఆనించి వున్న, కుండపిడతల్లోనుంచి ఒక పిడత తీసుకుని, "సుకుమారికి ఎక్కడైనా పాలు దొరికే అవకాశం వున్నదేమో చూస్తాను. నువ్వు ఒంటరితనాని కేమీ భయపడకు. నే నిప్పుడే తిరిగివస్తాను. ఆ శ్రీకృష్ణుని దయ వల్ల, యీ ఇళ్ళల్లో పాడిఆవు వున్నవా ళ్ళెవరైనా వుండవచ్చు," అంటూ సత్రంలోనుంచి వీధిలోకి వెళ్లాడు.

క్రమంగా చీకటి కమ్ముకుంటున్న సత్రంలోపలి మూలగదిలో కళ్యాణి, తన బిడ్డను ఒడిలో పరుండ బెట్టుకుని బిక్కుబిక్కు మంటూ కూచున్నది. పావుగంట గడిచింది. మహేంద్రుడు తిరిగివస్తున్న జాడ లేదు. దూరంగా వున్న శ్మశానంలో నుంచి కుక్కలూ, నక్కలూ వికృతంగా అరిచే అరుపులు వినవస్తున్నవి

ఉన్నట్టుండి కల్యాణి కూచున్న చోటుకు కొంచెం పక్కగా వున్న ఒక తలుపు కిర్రు మన్నది ఉలిక్కిపడి కల్యాణి అటుకేసి చూసింది. నల్లని నీడలా, ఎండి

వడిలిపోయిన ప్రేతంలా ఒక ఆకారం, కొంచెంగా తెరుచుకున్న తలుపును ఆసరాగా పట్టుకుని ఆమెకేసే చూస్తున్నది.

కల్యాణి బిడ్డను భుజంమీదికి ఎత్తుకుని గదిలోనుంచి బయటికి పారిపోయేందుకు లేవబోయింది. కాని భయంవల్ల ఆమె కాళ్ళు గజగజలాడిపోతున్నవి. లేచేందుకు ఆమె వృధాప్రయత్నం చేసి నిస్పృహగా కూలబడిపోయింది.

తలుపు నానుకుని నిలబడిన నల్లని ఆకారం వెనుదిరిగి చేయి వూపింది. ఆ వెంటనే ఒకటి...రెండు—అంతులేనన్ని వికృత మానవాకారాలు నిశ్శబ్దంగా గదిలో ప్రవేశించి, కళ్యాణిని చుట్టుముట్టినై. కళ్యాణి కుమార్తెను గట్టిగా హృదయానికి హత్తుకుని పెద్దగా అరవబోయింది. కాని ఆమె గొంతు పెగలలేదు. ఇంతలో ఒక ప్రేతమూర్తి ఆమెకేసి చేయి వూపుతూ, తన వెంట వున్న జీర్ణరూపాల కేదో సంజ్ఞ చేసింది. కళ్యాణికి స్పృహ తప్పింది. మరుక్షణం ఆ వికృతాకారాలు, కళ్యాణినీ, సుకుమారినీ చేతుల్లోకి ఎత్తుకుని, పొలాలూ, గుట్టలూ దాటి, ఒకానొక భయంకరారణ్యం ప్రవేశించాయి.

అరణ్యమంతా అంధకారమయంగా వున్నది. కళ్యాణినీ, ఆమె కుమార్తె సుకుమారినీ ఎత్తుకునిపోయిన మురా, ఆ చీకట్లో నిశ్శబ్దంగా వా రిద్దరినీ కొంతదూరం మోసుకుపోయి, సమతలంగా వున్న ఒక ప్రాంతాన కిందికి దించింది. ఆ వెంటనే చెట్లచాటునుంచీ, పొదలమాటునుంచీ బిలబిలమంటూ మరికొన్ని కంకాళమూర్తులు బయటికి వచ్చి, వారిని చుట్టుముట్టినై. కళ్యాణిని అపహరించుకుపోయినవాళ్ళు, ఆ కొత్తవాళ్ళను అటకాయిస్తూ, "గుప్పెడు బియ్యంగాని, జొన్నలుగాని యివ్వండి. ఈ ఇద్దరి వంటిమీద వున్న నగలన్నీ మీ కిచ్చేస్తాం," అన్నారు.

ఆ మాటలకు కొత్తగా వచ్చిన జీర్ణదేహులు వికటంగా నవ్వుతూ, "బంగారం, వెండీ ఎవడిక్కావాలి! మీ రేమైనా గ్రామాన్నుంచి ధాన్యం తెచ్చారేమో అని వచ్చాం. ఎక్కడ దాచారు?" అంటూ వాళ్ళమీద కలియబడ్డారు.

ఆ గుద్దులాటలో ఒకడు కీచుమంటూ అరిచి కిందపడి ప్రాణాలు వదిలాడు. తమలో ఒకడు అవిధంగా చావటం చూస్తూనే. ఆ వికృతరూపులు పోట్లాట మాని, చచ్చిన వాడికేసి ఆశ్చర్యంగా చూడసాగారు. అప్పుడు వాళ్లల్లో ఒకడు, "అలా చూస్తూ వూరుకుంటారేం? మనం యింతకాలంగా నక్కల్నీ, కుక్కల్నీ తిని ప్రాణాలు నిలబెట్టుకున్నాం. ఇప్పుడు అవీ దొరకటంలేదు. ఎలానూ చచ్చాడు గనక, వీణ్ణి కాల్చుకు తిందాం," అన్నాడు.

ఆ వెంటనే చకుముకిరాయి కొట్టి నిప్పు చేసి, దానిమీద ఎండుటాకులూ, పుల్లలూ



వేసి కొందురు మంట చేయసాగారు. కొందరు తినటాని కేదో దొరికిందన్న సంతో షంలో కీచుమంటూ గంతులు వేయసాగారు.

నిప్పు బాగా రాజి మంట లేవగానే ఇద్దరు ముగ్గురు శవాన్ని సమీపించి కాళ్ళూ, భుజాలూ పట్టుకుని దాన్ని మంటకేసి లాగసాగారు. అంతలో ఒకడు పెద్దగా అరుస్తూ ముందుకు వచ్చి, "మనం మనిషిమాంసమే తినదలిస్తే, ఈ ఎండి వడిలిన శవా న్నెందుకు తినాలి? మనం పట్టుకొచ్చిన ఆడమనిషీ, ఆ చిన్నపిల్లా సంగతే మరిచి పోయారా? వాళ్ళను గొంతు పిసికి, యీ మంటల్లో పేల్చండి. అందరం తృప్తిగా తినవచ్చు," అన్నాడు.

అప్పటివరకూ కళ్యాణినీ, ఆమె శిశువునూ మరిచిపోయి, తగువులూ, తైతక్కల్లో కాలంగడిపిన నికృష్టపు మూక అంతా ఒక్కసారిగా, కళ్యాణినీ ఆమె బిడ్డనూ పడవేసిన చెట్టుకేసి తిరిగి, "ఎత్తుకురండి, మంటల్లో పడవేసి కాల్చండి!" అంటూ బయలుదేరారు కాని కళ్యాణి అప్పటికే సుకుమారితో అడవిలోపలికి పారిపోయింది.

"ఆ ఆడదీ, పిల్లా తప్పించుకుపోయారు. అడవిలో ఎంతోదూరం పోయివుండదు. నలుగురూ నాలుగు వైపులకూ పరిగెత్తి, వెతకండి!" అంటూ ఇద్దరుముగ్గురు పెద్దగా అరిచారు. ఆ వెంటనే మూక మూకంతా అన్నిదిక్కులకూ పరిగెత్తింది.

# 2

కళ్యాణి తనబిడ్డను గుండెలకు గట్టిగా హత్తుకుని, చీకటిలో దారీతెన్నూ కనిపించని అరణ్యంలో పరిగెత్తసాగింది. ఆమె వుద్దేశం తనను పట్టితెచ్చిన దుష్టులనుంచి సాధ్యమైనంతదూరం పారిపోవటం, వాళ్లు తనకోసం అడవి గాలిస్తున్నారన్న సూచనగా వాళ్ళకేకలు ఆమెకు వినిపిస్తున్నవి.

కళ్యాణి లేని ఓపిక తెచ్చుకుని మరింత వడిగా అరణ్యంలోకి పరిగెత్తసాగింది. ఆమె పాదాలకు చెట్ల మోడులూ, ముళ్ళూ గుచ్చుకుని గాయాలయినై. శరీరాన్ని అడవిలతలూ, కొమ్మలూ తాకి బాధపెట్టసాగినై. అయినా ఆమె మొండిగా పరిగెత్తుతూనే వున్నది. క్రమంగా ఆమెకు తనను వెతికి పట్టుకోచూస్తున్న దుష్టుల కేకలూ, అరుపులూ దూరం కాసాగినై. ఆసరికి ఆమె బాగా అలిసిపోయింది. ఇక పరిగెత్తే శక్తిగాని, ఆఖరుకు నడిచే ఓపికగాని లేక ఆమె ఒక చెట్టుకింద సొమ్మసిల్లి పడిపోయింది.

ఒక అరగంట కాలం గడిచింది. చంద్రుడు అడవిచెట్లశిఖరాలను తెల్లగా మెరిపిస్తున్నాడు. చెట్లు అంత దట్టంగా లేని ప్రాంతాల చంద్రకిరణాలు నేలను తాకి గడ్డి గాదరను ప్రకాశవంతం చేస్తున్నది. కళ్యాణి తన కుమార్తెతోపాటు చెట్టుకింద నిశ్చేతనంగా పడివున్నది. ఆమెపై చల్లని చంద్రకిరణాలు ప్రసరిస్తున్నవి.

ఉన్నట్టుండి కళ్యాణి కొద్దిగా కదిలింది. అర్ధచైతన్యావస్థలో వున్న ఆమెకు మృదుమధుర స్వరంలో ఒక పాట వినిపించసాగింది.

హరే మురారే మధుకైటభారే
గోపాల గోవింద ముకుంద శౌరే
హరే మురారే మధుకైటభారే

కళ్యాణి కళ్ళు తెరిచింది. దగ్గిరలో ఎక్కడా మనిషి వున్న జాడలేదు. కాని పాట అంతకంతకూ దగ్గరగా, స్పష్టంగా వినబడుతున్నది. కళ్యాణి ఆశ్చర్య సంభ్రమాలతో లేచి కూర్చోబోయింది. కాని ఆకలిదప్పులవలనా, నరమాంసభక్షకులనుంచి పారిపోయే ప్రయత్నంలో పడ్డ ప్రయసవల్లా, ఆమె లేచేందుకు శక్తిహీనురాలయింది.

కల్యాణి ఆ పాట వస్తున్నవైపుకు తలతిప్పి చూస్తూ, నిశ్చేతనంగా వుండిపోయింది. హఠాత్తుగా గుబురుచెట్ల చాటునుంచి, చంద్రకాంతిలో తెల్లగా మెరిసిపోతూ, కాషాయాంబరాలు ధరించిన ఋషిలాంటి అజానుబాహు డొకడు ఆమె

ముందుకు వచ్చి నిలబడ్డాడు. కళ్యాణి లేచి అతడికి ప్రణామం చేయబోయి, నీర సంగా ప్రక్కకు ఒరిగిపోయింది.

కళ్యాణికి తిరిగి స్పృహకలిగి కళ్ళు తెరిచి చూసేసరికి, ఆమె ఒకానొక దేవీ మందిరంలో వున్నది. ఆ మందిరం అడవి మధ్య వున్న ఒక గొప్ప హిందూ మఠంలోని చిన్న భాగం. ఈ హిందూమఠం ఒకప్పుడు పేరు ప్రఖ్యాతులు గల బౌద్ధ విహారంగా వుండేదని చరిత్ర నెరిగినవా రెవరైనా తేలికగా గుర్తించగలరు. బౌద్ధం క్రమంగా క్షీణించిన తరవాత, ఆ విహారం అడవి చెట్లచేత ఆక్ర మించబడి, జనబాహుళ్యానికి, ఆ కీకారణ్యం మధ్య అలాంటి కట్టడం వున్నదన్న సంగతే తెలియకుండాపోయింది.

కళ్యాణి ఆశ్చర్యంగా తన పరిసరాలను పరికిస్తున్నంతలో, అడవిలో దొంగల బారినుండి, ఆమెను కాపాడిన తాపసి ఆమె దగ్గరకు వచ్చి, "అమ్మా, నీ కొచ్చిన భయం ఏమీలేదు. ఇది దేవతామందిరం ఆకలి దప్పులతో శోషిల్లి వున్నావు. అవిగో, అక్కడ ఒక పాత్రలో పాలున్నవి. అవి నీకూ, నీబిడ్డకూ ఆకలి తీర్చ గలవు. సంకోచించక తాగండి," అన్నాడు.

కళ్యాణికి యీ మాటలతో ప్రాణం లేచివచ్చినట్టయింది. ఆమె లేని వోపిక తెచ్చుకుని లేచి నిలబడి, చీరచెంగును కంఠానికి చుట్టుకుని, ఆ తాపసికి నమస్కరిం చింది. ఆయన ఆమెను 'దీర్ఘ సుమంగళీభవ' అని దీవించి, అక్కడే పాలతో వున్న ఒక మట్టిపాత్రను తెచ్చి ఆమె ముందు పెట్టాడు.

కళ్యాణి ఆ పాత్రలోవున్న పాలను తన బిడ్డ సుకుమారికి కొంచెం తాగించి, మిగి లినవాటిని దూరంగా పెట్టింది. తాపసి ఆమెకేసి ప్రశ్నార్థకంగా చూస్తూ, "అమ్మా ఆ మిగిలిన పాలు తాగకుండా దూరంగా పెట్టావేం?" అని అడిగాడు.

కళ్యాణి ఆ తాపసికి మరొకసారి తలవంచి నమస్కరిస్తూ, "స్వామీ, నన్ను క్షమించి, పాలు తాగమని ఆజ్ఞాపించకండి. నేను మానసికంగా చాలా వ్యథపడు తున్నాను," అన్నది.

"అలా అయితే, ఆ సంగతేదో చెప్పు. నా చేతనైన సహాయం చెయ్యగలను. నేను అరణ్యవాసంలో కాలంగడిపే బ్రహ్మచారిని, సన్యాసిని. నువ్వు నా కుమార్తె లాంటిదానివి," అన్నాడు తాపసి.

కళ్యాణి కన్నులలో అశ్రువులు కదులుతుండగా, గద్గదస్వరంతో, "స్వామీ, మీరు దైవసమానులు. నేను నా భర్తనుంచి కొందరు దుష్టుల కారణంగా యీ

అరణ్యం చేరటం జరిగింది. నా భర్త జాడలు తెలియకుండా, ఆయన భుజించారో లేదో తెలుసుకోకుండా, నే నెలా పాలు తాగగలను?" అన్నది.

తాపసి కళ్యాణిని ప్రశ్నించి ఆమె సత్రంలోనుంచి, ఎలా అపహరించబడిందో తెలుసుకున్నాడు. ఆమె తన భర్త పేరు చెప్పగూడదు గనక, ఆమె నివసించే గ్రామం, అక్కడ భర్త అంతస్థూ విచారించి, ఆఖరుకు, "నువ్వు మహేంద్ర సింహుని పత్నివా?" అనడిగాడు. కళ్యాణి అవు నన్నట్టు తల వూపింది. ఆ వెంటనే తాపసి, దేవీమందిరం నుంచి బయటికి పోతూ, "అమ్మా, నువ్విక్కడ నిర్భయంగా వుండవచ్చు. నేను నీ భర్తను వెతికేందుకు వెళుతున్నాను," అని చెప్పాడు.

తాపసి మఠం వదిలి అరణ్యంలో ప్రవేశించాడు. అప్పటికి రాత్రి రెండవ జాము జరుగుతున్నది. చంద్రుడు ఆకాశంమధ్య దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు. ఆకాశాన్నంటే మహావృక్షాలతో, వాటి నల్లుకుని వున్న అడవితీగలతో చుట్టబడి వున్నందువల్ల మఠం వున్న ప్రదేశంమాత్రం నల్లని కారుచీకటిముసుగుతో కప్పబడివున్నది.

తాపసి అరణ్యంలో కొంతదూరం నడిచి ఒకచిన్న పర్వతప్రాంతాన్ని చేరాడు. ఆ పర్వతాన్ని ఆనుకునే, ముర్షిదాబాదునుంచి కలకత్తాకు పోయే రాజమార్గం వున్నది. తాపసి కొండమీదికి ఎక్కి చుట్టూ ఓమారు కలయచూచి, తృప్తిగా తలాడించి, కిందికి దిగివచ్చాడు. రాజమార్గాని కానుకుని ఒకచోట మరింతదట్టమైన చెట్లగుంపు వున్నది. తాపసి సూటిగా అక్కడి కెళ్లాడు.

ఆయుధాలు ధరించివున్న దాదాపు రెండు వందలమంది యోధులు, చెట్లకింద కూచునివున్నారు. అంతా నిశ్శబ్దం. ఎవరూ మాటాడటంలేదు. తాపసి, అయోధుల్లో ప్రతిఒక్కరినీ పరిశీలనగా చూస్తూ ముందుకు సాగి, ఒకచోట ఆగి ఒకయోధుణ్ణి పరీక్షగా చూసి, సంజ్ఞచేశాడు. వెంటనే నవయవ్వనుడైన ఒకయువకుడు లేచినిలబడి, తాపసి వెనుకగా బయలుదేరాడు. ఇద్దరూ చెట్లగుంపులోనుంచి బయిటికి వచ్చి రాజమార్గం పక్కగా నిలబడ్డారు.

తాపసి రాజమార్గంకేసి ఓక్షణకాలంచూసి, తరవాత తనవెంటవచ్చిన యువకుడితో, "భవానంద్ ! మహేంద్రసింహు డేమైందీ, నీ కేమన్నా తెలుసా?" అని అడిగాడు.

"మహేంద్రసింహుడు నేటి ఉదయం, భార్యనూ, బిడ్డనూ వెంటబెట్టుకుని, పదచిహ్నగ్రామం వదిలి, రాజధానికేసి బయలుదేరాడు. కాని, సంధ్యాసమయంలో అతడు బసచేసిన సత్రంలో........."

భవానందు డిలా చెపుతూండగానే, తాపసి అతడి మాటలకు అడ్డుతగిలి, "సత్రంలో ఆ దుండగం చేసినవా శ్శెవరో కనుక్కున్నావా?" అని ప్రశ్నించాడు.



''ఆ దుండగానికి కారకులు ఆ గ్రామం రైతులే. వాళ్ళు ఆకలితో నకనకలాడుతూ దావులనే వున్న అరణ్యంలో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. వాళ్ళు దొంగలుగా మారి పోయారు. అయినా, యీ కాటకపు రోజుల్లో దొంగ కానివా డెవడు. మేమూ యీ రోజు కొత్వాలుతాలూకు రెండు బస్తాల బియ్యం దారి అటకాయించి పట్టుకుని వైష్ణవుల తృప్తికి కైంకర్యం చేశాం,'' అన్నాడు భవానందుడు.

ఆ మాటలకు తావసి చిరునవ్వు నవ్వి, ''మహేంద్రుడి భార్యనూ, బిడ్డనూ, దొంగల బారినుంచి నేనే రక్షించాను. వాళ్ళిప్పుడు మఠంలో వున్నారు. నీవు వెంటనే బయలుదేరి వెళ్ళి, ఆ మహేంద్రసింహుణ్ణి వెతికి తేవాలి. ఇక్కడి నాయకత్వ బాధ్యత జీవానందుడు నిర్వహిస్తాడు,'' అన్నాడు.

# 3

సత్రంలో భార్యనూ, బిడ్డనూ వదిలి పాలకోసం గ్రామంలోకి వెళ్ళిన మహేంద్రుడు ఒకగంటకాలంతరవాత- పిడతతో పాయి తీసుకుని అక్కడికి తిరిగివచ్చాడు. కాని అతడికి భార్యా బిడ్డా కనిపించలేదు. అతడు వారికోసం సత్రం గదులన్నీ వెతికాడు. గొంతెత్తి బిగ్గరగా పిలిచాడు. అంతా వ్యర్థం.

మహేంద్రుడు యిక ఆ ప్రాంతాల కాలయాపనచేయటం వ్యర్థం అని గ్రహించాడు. పట్టణానికి పోయి, అక్కడి ప్రభుత్వోద్యోగుల సాయంతో తన భార్యా బిడ్డలను వెత కటం ఒక్కటే మార్గమని నిశ్చయించుకున్నాడు. అతడు తుపాకిని భుజాన పెట్టుకుని రాజమార్గంమీద కొంతదూరం ప్రయాణించేసరికి, ఎదురుగా కొన్ని ఎడ్లబళ్ళూ, వాటిని కాపలా కాస్తూ, కొందరు ఇంగ్లీషు కంపెనీవాళ్ళ సిపాయిలూ ఎదురైయ్యారు.

1770 నాటికి వంగదేశంమీద ఆంగ్లేయులకు పూర్తి శాసనాధికారంలేదు. వాళ్ళకు అప్పట్లో పన్నులు వసూలు చేసే దివానీగిరిమాత్రమే వుండేది. శాసనాధికారం, పరి పాలనాబాధ్యత – అంతా నవాబు మీర్జాఫర్ చేతిలో వుండేది. అతను తాగుబోతు, విషయలోలుడు – మిదుమిక్కిలి విశ్వాసఘాతకుడు.

నవాబు మీర్జాఫర్ అసమర్థుడవటం ఆంగ్లేయులకు బాగా ఉపకరించింది. వాళ్ళు యిష్టమొచ్చినచోటు, యిష్టమొచ్చినంత పన్ను వసూలు చేసేవాళ్ళు. మీర్జాఫర్ వాళ్ళు పెట్టమన్నచోట రసీదుపైన సంతకాలు పెట్టేవాడు. బెంగాలీలు పన్నులభారంతో కృంగిపోతుండేవాళ్ళు. కాని వాళ్ళ మొర వినే నాథుడే లేడు.

వంగదేశం యావత్తూ కరువుకాటకాలతో సర్వనాశనం అయిపోతున్న దశలో కూడా, ఇంగ్లీషువాళ్లు నియమించిన కలెక్టర్లు ప్రజలగూబలు పిండి పన్నులు వసూలు చేస్తూనే వున్నారు. తిండిలేక మరణించే వేలాదిజనుల దురవస్థ వాళ్ళు ఏమాత్రం పట్టించుకోలేదు. తాము పన్నులరూపంలో వసూలు చేసిన డబ్బంతా పెట్టెల్లో పెట్టి, ఆ ఎడ్లబళ్ళమీద ఎక్కించి, సిపాయిల కాపలాతో కలకత్తాకు పంపేవాళ్ళు.

ఇలాంటి సిపాయిల దండొకటి రాజమార్గంమీద మహేంద్రుడి కెదురైంది. చంద్ర కాంతిలో బళ్ళకు వెనకా ముందూ తుపాకులు ధరించి నడుస్తున్న సిపాయిలను చూస్తూనే, మహేంద్రుడు మార్గం దిగి, పక్కనేవున్న చెట్లలోకి పోయేందుకు ప్రయ త్నించాడు. ఎందుకంటే, ఆ రోజుల్లో దారిదోపుడులు తరచుగా జరుగుతూండేవి. సిపాయిలు తనను దోపిడిగాడుగా భావించి పట్టుకోవచ్చు.

మహేంద్రుడు రాజమార్గంనుంచి పక్కకు దిగి చెట్లకేసి కొంచెందూరం నడిచేం తలో, దండులోనుంచి యిద్దరు సిపాయిలు విడివడి, "దొంగ! దొంగ!" అంటూ పరిగెత్తుకుంటూవచ్చి అతణ్ణి పట్టుకున్నారు. ఈ సమయంలో తుపాకీ ప్రయోగించ టమా మానటమా? అని మహేంద్రుడు తటపటాయించేంతలో, సిపాయిలు అతడి చేతినుంచి తుపాకీ వూడబెరుక్కుని, "నడూ, దొంగవెధవా!" అంటూ మహేంద్రుణ్ణి రాజమార్గంమీదికి లాక్కుపోయారు.

దండుముందు ఏదో గలాటా జరుగుతున్నట్టు విన్న హవల్దారు, దండుమధ్యనుంచి ముందుకు వచ్చి, "ఏమిటది ? ఎందు కాగోల ?" అంటూ సిపాయి లిద్దర్నీ కోపంగా ప్రశ్నించాడు.

"హవల్దార్‌సాబ్! మే మీ దొంగను పట్టుకున్నాం. చేతిలో తుపాకీకూడా వున్నది. వీడు దొంగల నాయకుడై వుంటాడు. దొరగారిదగ్గరకు తీసుకుపొమ్మన్నారా ?'' అని అడిగా డొకసిపాయి.

హవల్దారు, మహేంద్రుణ్ణి గుచ్చిగుచ్చి ఓమారు పరీక్షగా చూసి, తలాడిస్తూ "దొరగారు కాస్త జల్సాలో వున్నారు. ఇప్పు డాయన్ని పలకరించి లాభంలేదు. వీణ్ణి కాళ్ళూ చేతులూ కట్టి బండిమీద పడవెయ్యండి, తరవాత చూద్దాం," అన్నాడు.

సిపాయిలు మహేంద్రుణ్ణి కాళ్ళూచేతులూ కట్టి ఒకబండిమీద పడవేశారు. దండు ముందుకుసాగింది. తాపసిచేత, మహేంద్రుణ్ణి వెతికేందుకు పంపబడ్డ భవానందుడు రాజమార్గానికి ఎగువ నున్న ఒక గుట్టపక్కన వుండి, జరిగిన యీ గందరగోళమంతా విన్నాడు. అతడికి ఎవరో ఒకవ్యక్తి తుపాకీతోకూడా సిపాయీలకు దొరికిపోయా డనితప్ప, ఆ వ్యక్తి తను వెతుకుతున్న మహేంద్రసింహు డని తెలియలేదు.

ఇప్పు డేమి చేయటమా అని భవానందుడు ఆలోచిస్తున్నంతలో దండు అతణ్ణి సమీపించింది. మహేంద్రుణ్ణి పట్టుకున్న సిపాయీలలో ఒకడు భవానందుణ్ణి అంత దూరాన చూస్తూనే, "అడుగో, ఇంకొకదొంగ ! పట్టుకోండి !'' అంటూ ముందుకు పరిగెత్తాడు.

భవానందుణ్ణి నలుగురైదుగురు సిపాయిలు చుట్టుముట్టారు. భవానందుడు ఏమాత్రం తొణకకుండా, "మీ కేంకావాలి ? నన్నెందుకు చుట్టుముట్టారు ?'' అని అడిగాడు.

"మా క్కావలసిం దేమిటో చెపుతాం; ముందు హవల్దారువద్దకు పద దొంగ వెధవా," అంటూ ఒకసిపాయి భవానందుడి చేయి పట్టుకుని ముందుకు లాగాడు.

"నేను దొంగలా వున్నానా ? నా కాషాయవస్త్రాలు చూశారా ? నేను అడవిలో తపస్సు చేసుకునే బ్రహ్మచారిని," అన్నాడు భవానందుడు.

భవానందు డిలా అనగానే సిపాయిలు బిగ్గరగా నవ్వుతూ, "దొంగతనాలు చేసేందుకు యిదొక దొంగవేషం. బ్రహ్మచారులూ, సన్యాసులే యీ రోజుల్లో మరింత పెద్దదొంగతనాలు చేస్తున్నారు,'' అన్నారు. ఆ తరవాత వాళ్ళు భవానందుణ్ణి యీడ్చుకుంటూ హవల్దారుదగ్గరకు తీసుకోపోయారు. ఇదీ ఒకందుకు మేలే కావచ్చు అనుకున్నాడు భవానందుడు. సిపాయిలచేత యింతకుముందు పట్టుకోబడ్డ వ్యక్తి ఎవరైనదీ తెలుసుకోవచ్చు. ఒకవేళ అతడు మహేంద్రసింహుడైతే మరీమంచిది,

అలా కాకపోతే ఏ క్షణానయినా తను, యీ పనికిమాలిన సిపాయిల గుంపునుంచి పారిపోగలడు.

హవాల్దారు భవానందుణ్ణి చూసి కళ్ళెర్రజేశాడు. "వీడు గజదొంగలా వున్నాడు. ఆ కాషాయగుడ్డలూ, కండలు దిరిగిన శరీరం చూస్తే, యీకరువురోజుల్లో దార్లు కొట్టుకుతినే మురాలకు వీడే నాయకుడులా కనిపిస్తున్నాడు. తెల్లవారి చూద్దాం, వీణ్ణి కూడా ఆ మొదటిదొంగ వున్న బండిమీదే, కాళ్ళూచేతులూ కట్టి పడవెయ్యండి," అన్నాడు.

భవానందుడి కాళ్ళూ చేతులూ తాళ్ళతో బాగా బిగకట్టబడి, మహేంద్రు డున్న బండి మీదికి చాపచుట్టలా విసిరివేయబడ్డాడు. మహేంద్రుడు బ్రహ్మచారివేషంలో వున్న యీ కొత్తదొంగను చూసి ఆశ్చర్యపడేంతలో, భవానందుడు చిన్నగొంతుతో, "మెల్లిగా మాట్లాడు. నువ్వు మహేంద్రసింహుడి వవునా ?" అని అడిగాడు. మహేంద్ర సింహుడు కొంచెం ఆశ్చర్యపడి, "అవును, నేను మహేంద్రసిహుంణ్ణే. మీ రెలా గుర్తించారు ?" అని ప్రశ్నించాడు.

"నేను నిన్ను గుర్తించలేదు. ఇంతకుముందు జరిగిన సంగతి సందర్భాలనుబట్టి వూహించాను. సరే మంచిది. మన యిద్దరం కలిసి ఒక ముఖ్యప్రదేశానికి వెళ్ళవలసి వున్నది. ముందు నీచేతికట్లనూ, కాలికట్లనూ తెంచుకో. ఆ బండిచక్రానికి ఆ కట్లున్న చోటు తాకించావంటే, రాపిడికి అవే తెగిపోతవి," అన్నాడు భవానందుడు.

భవానందుడు చెప్పినట్లే చేసి, మహేంద్రుడు తనను బంధించి వున్న తాళ్ళనుంచి ముక్తుడయాడు. ఈలోపల భవానందుడుకూడా తనకట్లను తెంచుకున్నాడు.

ఒకటిరెండు నిముషాల నిశ్శబ్దం తరవాత భవానందుడు తల ఎత్తి, సిపాయిలు సమీపిస్తున్న ఒకచిన్న కొండకేసి చూస్తూ, "మహేంద్రా ! ఇక కొద్దిక్షణాల్లో నువ్వూ నేనూ స్వేచ్ఛ పొందబోతున్నాం. అంతేకాక, ఈ సిపాయిలు కరువు కాటకాలతో కృశించిపోతున్న బెంగాలీ రైతులనుంచి వసూలు చేసిన డబ్బూ దస్కమూకూడా మనది కాబోతున్నది. కొంచెం హెచ్చరికగా వుండు," అన్నాడు.

సిపాయిలదండు కొండను సమీపించేంతలో, ముందున్నవాళ్ళకు ఎదురుగా వున్న కొండపాదంలోని ఒక పెద్దరాతిమీద ఒకవ్యక్తి నిలబడివుండటం కనిపించింది. ఆ వెంటనే ముందు నడుస్తున్న సిపాయిలలో కొందరు, "అడుగో, మరొకదొంగ !" అంటూ దండు విడిచి ఆ వ్యక్తికేసి పరిగెత్తారు.

భవానందుడు బండిమీదనుంచి మోచేతులమీద కొద్దిగా లేచి అటుకేసి చూడ సాగాడు. సిపాయిలు ఒక దృఢకాయుడైన కాషాయాంబరాలు ధరించివున్న యువ



కుణ్ణి హవల్దారు దగ్గిరకు లాక్కొచ్చారు. హవల్దారు కోపంగా చేయెత్తి, "దొంగ వెధవా! అంటూ ఆ కాషాయవస్త్రధారిని ముఖంమీద కొట్టబోయేంతలో, ఢాం అంటూ పిస్టల్ మోగింది. హవల్దారు ఒక చావుకేక పెట్టి వెనక్కు పడిపోయాడు. అదే అదనుగా భవానందుడు బండిమీదినుంచి దూకి, ఒక సిపాయి చేతినుంచి కత్తి లాక్కున్నాడు మరుక్షణంలో రాజమార్గం పక్కనవున్న చెట్లగుంపులో కాషాయవస్త్రధారులైన రెండువందలమంది ఆయుధధారులు 'హరే మురారే! హరే మురారే!' అంటూ వచ్చి సిపాయిలదండుమీద పడ్డారు.

హవల్దారు మరణించటం, ఖడ్గపాణులైన యోధులు హఠాత్తుగా వచ్చి మీదపడటంతో, ధనాన్ని కావలి కాస్తూ బండ్లవెంట నడిచే సిపాయిల్లో భీతి, కలవరం ఏర్పడింది ఇదంతా చూసిన సిపాయిల కమాండరు తెల్లదొర, గుర్రాన్ని వేగంగా పరిగెత్తిస్తూ, బళ్ళముందుకు వచ్చి, "సిపాయిలంతా భయపడకుండా, యీ దొంగ వెధవల్ని ఎదిరించండి. మన తుపాకులముందు, వీళ్ళ కత్తు లేపాటి," అంటూ కేకలు పెట్టసాగాడు.

హవల్దారు పోయినా, ముఖ్యసేనాని ఇంగ్లీషుదొర బతికివుండటం, అత దన్నట్టు దొంగలచేతుల్లో కత్తులు తప్ప మరే ఆయుధం కనబడకపోవటంతో, సిపాయిలు కొంత ధైర్యం తెచ్చుకుని చతురస్రంగా నిలబడి, తమమీది కురికివస్తున్న కాషా

యాంబరధారులపైకి తుపాకు లెత్తారు. కాని, అదేసమయంలో దాడి చేస్తున్న యోధుల్లో, ఒకవ్యక్తి 'హరే మురారే!' అంటూ పెద్దగా నినాదం చేసి, గుర్రంమీద వున్న దొరను కత్తితో ఒక్కపోటు పొడిచాడు. దొర ఒక్క అరుపు అరిచి గుర్రం మీంచి తలకిందులుగా కింద పడిపోయాడు.

ఈ విధంగా తమ నాయకుడు దుర్మరణం పాలవగానే, సిపాయిలు ధైర్యం కోల్పోయి, ఎత్తిన తుపాకీలు దించి, వెనుదిరిగి రాజమార్గంవెంట పారిపోసాగారు కాషాయాంబరధారులు, అలా పారిపోయేవారిలో దొరికినవారిని చంపి, ఇంగ్లీషు వాళ్ళ ఖజానా అంతా వశపరుచుకున్నారు.

మొదటిసారి సిపాయ్ పేల్చి హవల్దారును చంపిన యోధుడు తన అనుచరులకు బండ్లమీద వున్న ధనపుపెట్టెలను దించవలసిందిగా ఆజ్ఞ యిచ్చాడు. ఆ వెంటనే యోధులు పెట్టెలను దించి వాటిని మోసుకుంటూ అడవికేసి వెళ్ళిపోయారు. ఆ సమయంలో రక్తశిక్తమైన కత్తిని చేతబట్టుకుని భవానందుడు ఆజ్ఞనిస్తున్న యోధుని ముందుకు వచ్చాడు భవానందుడ్ని చూస్తూనే, ఆ యోధుడు ఆతడి భుజం పట్టుకుని ఉత్సాహంగా వూపుతూ, 'భవానంద్ సోదరా! మనం అనుకున్న దానికంటె తేలిగ్గానే మ్లేచ్ఛుల మద మణచాం ఈ దోపిడీ ధనాన్ని మన రహస్యప్రదేశానికి చేరుస్తాను. నీ ప్రయాణం ఎటు?" అని ప్రశ్నించాడు.

భవానందుడు ఆ ప్రశ్నకు వెంటనే జవా బివ్వకుండా చుట్టూ కలయచూశాడు. అత రాజమార్గం దిగువను ఒకచెట్టునీడలో ఒక ఆకారం కనిపించింది. భవానం దుడు అతడెవరైనదీ గ్రహించినవాడిలా తల పంకించి, "జీవానంద్ సోదరా! నువ్వు ముందు బయలుదేరు. నేను ఒకటి రెండు నిమిషాల్లో నిన్ను అనుసరిస్తాను," అంటూ ఆ ఆకారం నిలబడివున్న చెట్టుకేసి బయలుదేరాడు.

వెన్నెలకాంతిలో గుబురుచెట్టు చాయలో కత్తి చేబూని నిలబడివున్న వ్యక్తి మహేంద్రసింహుడు. అతడు కాషాయవస్త్రధారులైన యోధులు సిపాయీల మీద చేసిన పోరులో తటస్థంగా వుండిపోయాడు. ఇంగ్లీషువాళ్ళు బళ్ళమీద ఎక్కించుకు పోతున్న ధనం బెంగాలీలైతుల్ని పీడించి బలవంతంగా వసూలుచేసినదే కావచ్చు కాని, దానిని దోచుకునేందుకు వచ్చిన దొంగలకు తోడ్పడి తన హృదయా న్నెం దుకు మలినం చేసుకోవాలి? దొంగలకు సహాయపడేవాడు, దొంగే అవుతాడు. ఇలా ఆలోచించి మహేంద్రుడు, ఒక సిపాయినుంచి కత్తి లాక్కునికూడా, దూరంగా చూస్తూ నిలబడిపోయాడు

భవానందుడు చకచక నడుస్తూ, మహేంద్రుణ్ణి సమీపించేంతలో అతడు కటువుగా, "మీ పేరు ?" అని ప్రశ్నించాడు.

భవానందుడుకూడా అంత కంఠస్వరంతోనే, "నే పేరో తెలుకోవలసిన అవసరం నీ కేంకలిగింది ?" అని మారు ప్రశ్నవేశాడు.

భవానందుడి కంఠస్వరంలోని కాఠిన్యత గమనిస్తూనే మహేంద్రుడు కొంచెంగా ఆశ్చర్యపడి, "మీ పేరో తెలుసుకోవలసినఅవసరం నాకున్నది ఇంతకుముందు మీరు నా కెంతో గొప్పసహాయం చేశారు. నన్ను బంధవిముక్తుడ్ని చేసిన మీకు కృతజ్ఞుడ్ని," అన్నాడు

ఆ మాటలకు భవానందుడు అవహేళనగా నవ్వుతూ, "అలాంటి కృతజ్ఞత మీకున్నట్టు రుజువేం కాలేదు. మీ జమీందార్లు ఎంత పిరికిపందలో యింతకుముందే గ్రహించాను. కత్తి చేతబట్టికూడా అలా స్థాణువులా నిలబడిపోవటం, నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది." అన్నాడు.

"నేను దొంగతనం చేసేవారికి సాయపడి పాపం ఎందుకుకట్టుకోవాలి ?" అన్నాడు మహేంద్రుడు.

భవానందుడు ఆమాటలకు నవ్వి, "సరే, అలాంటి దొంగలనుంచే, నీవు కావాలనుకుంటే మరింతసహాయం పొందగలవు. నా వెంట రాగలవా ? నీ భార్యా, కుమార్తె వున్నచోటు చూపుతాను," అన్నాడు

మహేంద్రుడీ మాటలకు ఎక్కడలేని ఆశ్చర్యం కనబరుస్తూ, "మీరు నా భార్యా, కుమార్తె వున్నచోటు చూపెడతారా ? ఆశ్చర్యంగా వుందే. వా శ్కెక్కడున్నారో కెలా తెలుసు ?" అన్నాడు.

"సరే, ఆశ్చర్యపడుతూ యాచెట్టుకిందే వుండదలిస్తే, నా అభ్యంతరంలేదు. కాని, ఒకవేళ నీ భార్యనూ, బిడ్డనూ చూడదలిస్తే మాత్రం, నావెంట రా," అంటూ భవానందుడు అడవికేసి బయలుదేరాడు. మహేంద్రసింహుడు మారుమాటాడకుండా అతణ్ణి అనుసరించాడు.

# 4

భవానందుడు అడవిలో ప్రవేశించి ఒక కాలిబాటవెంట నడవసాగాడు. మహేంద్రుడి కతణ్ణి, తన భార్యాబిడ్డలను గురించి ఏవేవో ప్రశ్నలు వేయాలని కోర్కెగలిగింది కాని నిశ్శబ్దంగా తలవంచుకు నడుస్తున్న ఆ బ్రహ్మచారిని ప్రశ్నించే ధైర్యం అతడికి లేకపోయింది. ఉన్నట్టుండి భవానందుడు తలఎత్తి చంద్రకాంతిలో

మిలమిల మెరుస్తున్న వృక్ష శిఖరాగ్రాలకేసి ఓమారు చూసి, గొంతెత్తి పాడసాగాడు :

వందే మాతరమ్

సుజలాం సుఫలాం మలయజశీతలాం

సస్య శ్యామలాం మాతరమ్.

మహేంద్రుడి కా పాట ఆశ్చర్యం కలిగించింది. పేరూ వూరూలేని యీ మాత ఎవరు ? అనుకున్నా డతను. వెంటనే అతడు భవానందుణ్ణి, "బ్రహ్మచారీ! ఎవ రీ మాత ?" అని ప్రశ్నించాడు. కాని, భవానందుడు జవా బివ్వక పాడుకుపోతున్నాడు.

శుభ్రజోత్స్న పులకిత యామినీమ్

ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్

సుహాసినీమ్ సుమధుర భాషిణీమ్

సుఖదాం వరదాం మాతరమ్.

భవానందుడు అంతవరకు పాడగానే, మహేంద్రుడు చిరునవ్వు నవ్వుతూ, "మీరు పాడే పాటలో కనిపించేది దేశం; తల్లి కాదు," అన్నాడు.

"అవును, దేశమే! మేమీ దేశమాతను తప్ప మరొకరిని ప్రేమించం. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' మేము జన్మభూమినే తల్లిగా భావిస్తాం. అది తప్ప మాకు యింకో తల్లి లేదు, తండ్రిలేడు–భార్య బిడ్డలు, ఇల్లు వాకిలి ఏమీలేదు." అన్నడు భవానందుడు గంభీరంగా

"అయితే ఏదీ, ఆ పాట మరోసారి పాడండి! "అన్నాడు మహేంద్రుడు.

వందేమాతరమ్

సుజలాం సుఫలాం మలయజ శీతలాం

సస్య శ్యామలాం మాతరమ్

సుభ్రజ్యోత్స్న పులకిత యామినీమ్

ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్

సుహాసినీం సుమధురభాషిణీమ్

సుఖదాం వరదాం మాతరమ్

సప్తకోటి కంఠ కలకల నినాదకరాళే

ద్విసప్తకోటి భుజై ర్ధృత ఖరకరవాలే

అబలాకే నమాఎతవాలే

బహుబుధారిణీ నమామి తారిణీమ్

రిపు దళవారిణీమ్ మాతరమ్
తుమి విద్యా తుమిధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వంహి ప్రాణాః శరీరే
బాహుతేతు మిమాశక్తి
హృది తుమి మాభక్తి
తోమరాయి ప్రతిమాగాడి మందిరే మందిరే
త్వంహి దుర్గాదశ ప్రహరణ ధారిణీ
కమలా కమల దళవిహారిణీ
వాణీ విద్యాదాయినీ నమామిత్వాం
నమామి కమలా మమలా మతులాం
సుజలాం సుఫలాం మాతరమ్
వందే మాతరమ్
శ్యామలాం సరళాం సుస్మితాం భూషితామ్
ధరణీం భరణీం మాతరమ్.

భావానందుడు యిలా పాడుతూ పాడుతూ దుఃఖంతో వివశుడై పోయాడు. మహేంద్రు డా పాటకు తన్మయుడై, "మీరు అడవిలో తపస్సు చేసుకునే బ్రహ్మ చారుల్లా కనిపించటం లేదు. నిజం చెప్పండి, మీ రెవరు?" అని అడిగాడు.

"మేము సంతానులం!" అన్నాడు భవానందుడు.

"సంతానులు! అంటే ఎవరి సంతానం?" అన్నాడు మహేంద్రుడు.

"దేశమాత సంతానం."

"మీరు దేశమాత సంతానమా;" అంటూ మహేంద్రుడు కొంచెం యీసడింపుగా అని, "అయితే దేశమాత మిమ్మల్ని దొంగతనాలు చేసి బ్రతకమన్న దన్నమాట. మీ రేదో ఒక రోజున సిపాయీల ఫిరంగి మూతులకు కట్టబడి, తునాతునియలు చేయబడతారు. రాజుగారి ధనం దోపిడీ చేసినవా రెవరూ బతికి బయటపడలేదు." అన్నాడు.

"మేము దోచింది రాజధనం కాదు. పాలనచేయనివాడు రాజు కాడు. దేశంలో ప్రజలు తిన తిండిలేక, ఆకలములు తిని ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్ని స్తూంటే, మనకు పాలకుణ్ణని చెప్పుకునే నవాబు మీర్జాఫర్ ఏంచేస్తున్నాడు? అతడి నౌకరీలో ఉన్న ముస్లింసైనికులు గ్రామాలమీద పడి, దోపిడులు, మానభంగాలు

చేస్తూంటే అతడు తెలిసే, ఆ కిరాతకృత్యాలను ఆపేందుకు ప్రయత్నం చేయదేం?" అని భవానందుడు క్రోధంవుట్టిపడే గొంతుతో ప్రశ్నించాడు.

మహేంద్రు డీ ప్రశ్నకు కలవంపడుతూ," నిజమే, యీ ముస్లిం పరిపాలనలో యిలాంటి రాక్షసకృత్యా లన్నీ జరుగుతున్నవి. కాని వాళ్ళను గద్దె దించటం ఎలా సాధ్యం? మీ కొద్దిమంది సంతానులచేత అదెలా సాధ్య మవుతుంది?" అన్నాడు.

"ప్లాసీయుద్ధంలో ఆంగ్లేయ సేన ఎంత? నవాబు సేన ఎంత?'' అని ప్రశ్నించాడు భవానందుడు.

"ఆంగ్లేయులూ, మన బెంగాలీలం సమానమా?'' అన్నాడు మహేంద్రుడు.

"సమాన మయేందుకే ప్రయత్నిస్తాం. ప్లాసీలో అంత చిన్న సేనతో ఆంగ్లేయులు ముస్లిం సేనావాహినిని ఎందువల్ల ఓడించగలిగారు? వాళ్ళకున్న ధైర్య సాహసాలే అందుక్కారణం. మహమ్మదీయుల్లో అవిలేవు. కాస్త శరీరం చెమట పట్టగానే యుద్ధ రంగం విడిచిపారిపోతారు. షర్బత్ ఎక్కడ దొరుకుతుందా అని తిరుగుతారు. వాళ్ళల్లో ధైర్యం లేదు, పట్టుదలా లేదు. ఒకఫిరంగిగుండు ఒక స్థానంలోనే గాని పది స్థళాల్లో పడదు. అందువల్ల' ఒక్క ఫిరంగిగుండు చూసి పదిమంది పారిపో నవసరం లేదు. మహమ్మదీయ సైనికుడు ఒకగుండు చూస్తే చాలు గుండెపగిలినంత పనై పారిపోతారు. ఆంగ్లేయ సైనికు డెన్నిగుండ్లను చూసినా యుద్ధరంగం వదిలి పారిపోడు,'' అన్నాడు భవానందుడు.

''మీ సంతానులకు, ఆంగ్ల సైనికుల కున్నంత గుండెధైర్యం వున్న దని నన్ను నమ్మమంటారా?'' అని ప్రశ్నించాడు మహేంద్రుడు.


'ప్రస్తుతం లేకపోవచ్చు. అలాంటి ధైర్యసాహసాలు చెట్టునుంచి రాలేవి కావు. అభ్యసించి అలవరచుకోవలసిన గుణం అది. మేం సన్యాసులం; మా కార్యం పూర్తయే వరకూ, మేం మా భార్యా పిల్లల ముఖం చూడం. కావాలనుకుంటే నువ్వూ సంతానుడవు కావచ్చు!'' అన్నాడు భవానందుడు.

''భార్యా బిడ్డలను పరిత్యజించ నవసరం లేకపోతే, నేనూ మీ సంతానుల వ్రతం స్వీకరిస్తాను,'' అన్నాడు మహేంద్రుడు.

''వారిని వదలనిదే, నువ్వీ సంతానవ్రతగ్రహణం చేయలేవు," అంటూ భవానందుడు వేగంగా నడవసాగాడు.

# 5

భవానందుడు మహేంద్రుణ్ణి వెంటపెట్టుకుని ఆనందమఠం చేరేసరికి సూర్యోదయ మయింది. వా రిద్దరూ మఠంలోని పూజామందిరద్వారం సమీపించేంతలో



తాపసి - సత్యానందస్వామి, అప్పుడే ప్రాతఃకాల పూజ ముగించి, జీవానందుడితో ఏదో మాట్లాడుతున్నాడు.

మహేంద్రుణ్ణి చూస్తూనే, సత్యానందస్వామి ముందుకు వచ్చి, భవానందుణ్ణి భుజం పట్టుకుని, పూజామందిరానికి పక్కనే వున్న మరొకగదిలోకి తీసుకుపోయి, కొద్ది నిమిషాల తర్వాత, తిరిగి పూజామందిరంలోకి వచ్చాడు. ఈసారి మహేంద్రుడు ముందుకు రెండడుగులు వేసి సత్యానందస్వామికి నమస్కరించాడు. సత్యానందుడు అతణ్ణి దీవించి, "మహేంద్రసింహా! నీ కకలిగిన ఆపద మమ్మల్నందర్నీ కలత పరిచింది. నేనే నీ భార్యనూ, బిడ్డనూ అడవిలో దొంగలనుంచి కాపాడి, ఇక్కడికి తెచ్చాను. రా, వారున్నచోటుకు తీసుకుపోతాను," అంటూ బయలుదేరాడు.

సత్యానందస్వామి, మహేంద్రుణ్ణి వెంటపెట్టుకుని, చీకటిమయంగా వున్న నాలుగైదు గదుల్లోనుంచి నడిచి, కొంచెం వెలుగువున్న ఒక పెద్దగదిలో ప్రవేశించాడు. అక్కడ ఒక చతుర్భుజమూర్తి విగ్రహం మహేంద్రుడికి కనిపించింది. శంఖచక్రగదాపద్మధారియై వక్షస్థలంమీద కౌస్తుభమణి ప్రకాశిస్తున్న ఆ విగ్రహాన్ని చూచి మహేంద్రుడు దిగ్భ్రమ చెందాడు. ఆ మూర్తి పాదపద్మాలముందు మధుకైటభ రక్కసుల శిరస్సులు మొండెంనుండి వేరై పడివున్నవి.

"ఈ మూర్తిని చూశావా, మహేంద్రసింహా?" అని అడిగాడు సత్యానంద స్వామి. మహేంద్రసింహుడు తల ఊపాడు.

"ఆ విష్ణుమూర్తి అంకమున వున్న దేవిని గుర్తించావా ?" అన్నాడు సత్యానంద స్వామి.

''లేదు స్వామీ; ఎవ రామె ?" అని అడిగాడు మహేంద్రుడు.

"మాత ! మన మందరమూ ఆమె సంతానమే. చెప్పు, వందేమాతరమ్ !" అని హెచ్చరించాడు సత్యానందుడు. మహేంద్రుడు తల వంచి వందేమాతరమ్ అన్నాడు.

సత్యానందుడు, మహేంద్రుణ్ణి మరొక గదిలోకి తీసుకుపోయాడు. అక్కడ అష్టభుజాతో, సమస్తాలంకారాలతో శోభిల్లుతున్న జగద్ధాత్రీమూర్తి మహేంద్రుడికి కనిపించింది.

"ఈమాత పేరేమిటి ?'' అని అడిగాడు మహేంద్రుడు.

"సింహ, వ్యాఘ్ర, గజ, భల్లూకాది వన్యమృగాలను తన పాదాలతో నేల మట్టగించి, అక్కడ పద్మాసనం ప్రతిష్టించి కూర్చున్న, సమైశ్వర్య స్వరూపిణి. ఈమెకు నమస్కరించు,'' అని ఆజ్ఞాపించాడు సత్యానందుడు. మహేంద్రుడు నమస్కరించాడు.

సత్యానందస్వామి, మహేంద్రుణ్ణి మరొకగదిలోకి నడిపాడు. ఆగది చీకటి వెలుగుల మయంగా వుంది. అక్కడ ప్రతిష్ఠితమైన భీకరకాళీమూర్తిని చూసి మహేంద్రుడు కొంచెం భయపడ్డాడు. సత్యానందుడు, మహేంద్రుని ముఖకవళికల్లో భయచిహ్నాలను గ్రహించినవాడిలా ముఖంపెట్టి, ''ఈమె కాళీమాత ! నేడు దేశం సర్వనాశనమై వున్నది. అందువల్లనే కాళీమాత కంకాళమాలలు ధరించివున్నది. ఆమె తన శివుణ్ణే తన పాదాలతో మర్దించుతున్నది. హా, మాతా !'' అంటూ సత్యానందుడు కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. అతడిగొంతు రుద్ధమైపోయింది.

''స్వామీ, ఆమె చేతుల్లో కత్తి, కపాలమూ ఏమిటి ?'' అని అడిగాడు మహేంద్రుడు భక్తి భయాలతో వణికిపోతూ.

"మే మంతా ఆమె సంతానమే. ఆమె తన చేతగల కత్తినే మాకు అనుగ్రహించింది. చెప్పు, వందేమాతరమ్ !'' అన్నాడు సత్యానందస్వామి. 'వందేమాతరమ్' అంటూ మహేంద్రుడు కాళీమూర్తికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

సత్యానందస్వామి ఆ గదిలోనుంచి బయటికి పోబోయేంతలో, మహేంద్రుడాయనతో, ''స్వామీ ! ఒక్కమనవి. నన్ను నా భార్యనూ, పుత్రికనూ ఒక్కసారి చూడనివ్వండి. తరవాత వారిని పంపివేసి, నేనూ మీ సంతానుల వ్రతగ్రహణం చేస్తాను,'' అన్నాడు.

''నీ భార్యా పుత్రికలను ఎక్కడకు పంపుతావు ?'' అని సత్యానందు డడిగాడు.



ఆ పశ్న తలెత్తిన తరవాత గాని మహేంద్రుడికి, తన భార్యా పుత్రికలను పంపేందుకు ఎక్కడా చోటు లేదనే సంగతి స్ఫురణకు రాలేదు.

''పదచిహ్న గ్రామంలోని నా ఇంటిలో ఎవరూ లేరు. మహమ్మారి లాంటి యీ కరువు కాటకాల మధ్య ఆమె నెక్కడికి పంపినా, ఎవ రాదరిస్తారు?'' అన్నాడు మహేంద్రుడు దీనంగా

సత్యానందస్వామి ఆ ప్రశ్నకు జవా బేమీ చెప్పకుండా తల వూపి వూరుకుని, ''సరే, ఈ ద్వారం వెంట బయిటికి వెళ్ళు. అక్కడ ఆవరణలో నీ భార్యా, పుత్రికా వున్నారు,'' అంటూ మహేంద్రుడికి చెప్పి, మహేంద్రుడు బయటికి పోగానే, ఆ గదిలో వున్న ఒక రహస్య సొరంగం తెరచి, దాని మెట్లమీదుగా భూగృహంలోకి దిగిపోయాడు.

ఆ భూగృహంలో, జీవానందుడూ, భవానందుడూ రాత్రి దోచుకు వచ్చిన అంగ్లేయుల ఖజానా పెట్టెలు బద్దలుకొట్టి, అందులో వున్న రూపాయలు రాసులుగా పోసి లెక్క పెడుతున్నారు. సత్యానందుడు వారితో," మహేంద్రుడు తిరిగి మన దగ్గిరకు వస్తాడు. అతడివల్ల మన సంతానులకు గొప్పమేలు జరుగుతుంది. ఇక్కడ మీ పని పూర్తి కాగానే, అడవిలో భార్యా బిడ్డలతో పోయే మహేంద్రుడి వెంటనంటి

వుండండి. ఆ సమయం రాగానే అతణ్ణి మన మఠంలోని విష్ణు మంటపానికి తీసుకు రండి :'' అని చెప్పి, ఘాగృహంనుంచి మెట్లెక్కి పైకి వెళ్ళిపోయాడు.

# 6

మహేంద్రుడు గదిలోనుంచి బయిటికి వస్తూనే, ఒక విశాలమైన మంటపంలో సుకుమారిని ఒడిలో పెట్టుకుని తలవంచుకు కూర్చున్న భార్యను చూశాడు. ఆమెను చూస్తూనే అతడికి దుఃఖం ఆగిందికాదు. కళ్యాణి అడుగుల చప్పుడు విని తల ఎత్తి భర్తకేసి చూస్తూనే, ఆనందం దుఃఖం ఒకేసారి హృదయాన్ని పెనగొనగా లేచి నిలబడి జలజల కన్నీళ్లు కార్చింది. భార్యాభర్తలిద్దరూ కొంతసేపు మాట్లాడలేక ఒకరి నొకరు చూచుకుంటూ మూగ బాధను అనుభవించారు. తరువాత కళ్యాణి సత్రంలో తన అపహరణ సంగతి చెప్పింది. మహేంద్రుడు తన అనుభవాలు చెప్పాడు.

ఈవిధంగా ఒక అరగంటకాలం గడిచిపోయింది. మహేంద్రుడు తన భార్యతో, "ఇక మనం ప్రయాణమై పోవటమే మంచిది; ఈ పవిత్రస్థలం సంసార లంపటాలలో చిక్కుకుని అలమటించే మనలాంటి పామరులకు వాసస్థానంకాదు," అన్నాడు.

మహేంద్రుడు కూతురును చంక నెత్తుకుని ఆవరణలో నుంచి కదలబోయేంతలో అతడికి ఎదురుగా ఒకతిన్నెమీద రెండు టేకుఆకులలో భోజనపదార్థాలు కనిపించినై. అవి ఎప్పు డెవ రక్కడ పెట్టారో తెలియదు మహేంద్రుడు వాటిని భార్యకు చూపించాడు.

"ఇవి మనకోసమే. ముందు మీరు తినండి," అన్నది కళ్యాణి. మహేంద్రుడు ఝారు మాటాడకుండా తిన్నెమీద కూర్చుని ఆకలి తీరేవరకు భుజించాడు. మిగిలిన పదార్థాలను కళ్యాణి భుజించింది. అక్కడే పెట్టివున్న ఒక ముంతలోని పాలను సుకుమారికి తాగించింది. తరవాత వారు మఠంఆవరణ దాటి అరణ్యంలో ప్రవేశించారు.

పదచిహ్న గ్రామం ఎటువున్నదో మహేంద్రుడు తనకు తెలుసుననుకున్నాడు. ఒకసారి అరణ్యంనుంచి బయటపడి, రాజమార్గం చేరితే ప్రయాణం సుఖంగా సాగుతుందని అతడు ఆశించాడు. అతడి ప్రయత్నం చీకటిపడేలోగా తన స్వగ్రామం చేరాలని.

కాని, మహేంద్రుడు అరణ్యంలో గంట ప్రయాణించినా, అతడికి దానిలోని ఆదిఅంతాలు తెలియరాలేదు. ఎంతదూరంపోయినా మహారణ్యమే. దానిలోనుంచి బయటపడటం ఎలాగో అతడికి అర్థంకాలేదు. పైగా అతడికి తన స్వగ్రామం వున్న దిక్కుకూడా తెలియకుండా పోయినట్టయింది.

అలాటి సంకట సమయంలో ఒక వైష్ణవ బ్రహ్మచారి అతడికి ఎదురయ్యాడు. అతడి పెదాలమీద చిరునవ్వు తాండవిస్తోంది. అతణ్ణి చూస్తూనే మహేంద్రుడికి ప్రాణం లేచివచ్చినట్టయింది.

''గోసాయీజీ · మీ రీ ప్రాంతాలు బాగా తెలివారులా వున్నారు. మమ్మల్ని ఈ అరణ్యం దాటించి, రాజమార్గం చేర్చగలరా ?'' అన్నాడు మహేంద్రుడు.

గోసాయి మారు మాటాడకుండా వెనుదిరిసి బయలుదేరాడు. మహేంద్రుడు అతణ్ణి అనుసరించి నడిచాడు. ఓ పావుగంట తరవాత వాళ్ళు అరణ్యం దాటి ఒక కాలవ ఒడ్డుకు వచ్చారు. అల్లంతదూరంలో రాజమార్గం కనిపిస్తున్నది.

"అవసరం అనుకుంటే యిక్కడ కొంచెం సేపు విశ్రాంతి తీసుకుని, ఆ కనిపించే మార్గంవెంట తూర్పుగా వెళితే, నువ్వు పదచిహ్నగ్రామం చేరగలవు." అని చెప్పి గోసాయి తిరిగి అరణ్యంలో ప్రవేశించాడు

మహేంద్రుడు భార్యతో, కుమార్తెతో కలిసి కాలవ ఒడ్డునేవున్న ఒక చెట్టుకింద కూచున్నాడు. ఒకటి రెండు నిమిషాలవరకూ ఎవరూ మాటాడలేదు. కళ్యాణి భర్త ముఖంకేసి చూసింది. అత దేదో దీర్ఘాలోచనలో వున్నట్టు కనిపించాడు.

మరంలో కలుసుకున్నప్పటించీగి చూస్తూన్నాను; మీ రేదో మనసులో బాధపడు తున్నట్టు కనిపిస్తున్నారు. ఆ సంగ తేమిటో నాకు చెప్పగూడదా?" అన్నది కళ్యాణి.

మహేంద్రు డా ప్రశ్నకు ఒకనిట్టూర్పు విడిచి, ''నా మనసులో అంత పెద్ద బాధేమీ లేదు. సత్యానందస్వామి నన్ను సంతానధర్మం స్వీకరించమన్నారు. నేను నిరాక రించాను. ఆవిషయమే మనసులో మెదులుతున్నది. అంతకన్న మరేంలేదు,'' అన్నాడు.

''అవును, మీ రెందుకు సంతానధర్మం స్వీకరించగూడదు? రాత్రి నే నొక కల గన్నాను. ఆ కలలో మీరు కాషాయ వస్త్రాలు ధరించి, వందేమాతరమ్ అని నినా దాలు చేస్తూ, యితర సంతానులతో కలిసి మ్లేచ్ఛులతో యుద్ధం చేయటం చూశాను,'' అన్నది కళ్యాణి.

అది కలే, వాస్తవం కాదు. సంతానధర్మం స్వీకరించివాడు భార్యా బిడ్డల ముఖం చూడగూడదు. ఆసంగతి నీకు తెలియదా'' అన్నాడు మహేంద్రుడు.

ఆ నియమానికి అంగీకరించి, ఆ వ్రతం పూనండి. దేశమాత సేవకు నే నెందుకు అడ్డువస్తాను? ఇదిగో, మీకు నా ఆటంకం తొలిగే మార్గం. ఇద్దరం ఏదో ఒకనాడు ఆ స్వర్గంలో కలుసుకుందాం,'' అంటూ కళ్యాణి చీరచెంగుకు కట్టుకున్న విషపుడబ్బాను వూడదీసింది.

ఆ విషభరిణను చూస్తూనే మహేంద్రుడు నిలువెల్లా కంపించిపోయి, దానిని ఆమె చేతిలోనుంచి తీసుకోబోయాడు. అది జారి కిందబడింది.

"కళ్యాణీ, నువ్వంత సాహసాని కొడగట్టకు. కావాలంటే నిన్నూ, సుకుమారినీ ఎవరి యింటనైనా దిగవిడిచి, నేను యీ సంతానుల్లో కలవగలను. మాతకార్యం పూర్తవగానే తిరిగి నిన్ను కలుసుకోగలను," అన్నాడు మహేంద్రుడు.

కళ్యాణి ఏదో జవాబు చెప్పబోయేంతలో సుకుమారి కీచుమని అరిచింది. ఆ భార్యాభర్త లిద్దరూ ఒకేసారి కుమార్తెకేసి చూశారు. విషపుడబ్బా మూత వూడదీసి ఉన్నది. అందులో విషగుళిక లేదు. సుకుమారి బాధతో తన్నుకుంటున్నది.

కళ్యాణి పిచ్చిదానిలా ఒక్క కేక వేసి, సుకుమారి నోట్లో వేళ్ళుపెట్టి సగం కరిగిపోయిన విషగుళికను బయిటికి తీసింది. ఆఖరికి సుకుమారి తన్నుకోవటం మాని, కళ్ళు తేలవేసి సొమ్మసిల్లి పడిపోయింది. కళ్యాణి కూతురును పైకెత్తి హృదయానికి హత్తుకుంటూ, "చూశారా, ఆ శ్రీకృష్ణుడే మీకు ధర్మమార్గం చూపించాడు. ఇక మా బంధం మిమ్మల్ని బాధించదు. స్వేచ్ఛగా దేశమాతను సేవించండి," అంటూ మిగిలివున్న విషగుళికను చప్పున నోట్లో వేసుకుని మింగింది.

ఈ దృశ్యం చూసి మహేంద్రుడు నిశ్చేష్టుడై పోయాడు. అతడికి కాళ్ళూ చేతులూ ఆడలేదు. అంతలో ఎక్కడినుంచో ఒకపాట వినబడసాగింది.

హరే మురారే మధుకైటభారే
గోపాల గోవింద ముకుంద శౌరే

ఆ పాట వస్తున్న దిక్కుకేసి మహేంద్రుడు తల తిప్పాడు. కాని అక్కడ ఎవరూ లేరు. అతడు భార్యా పుత్రికలకేసి చూశాడు. ఇద్దరూ నేలమీద నిశ్చలంగా పడివున్నారు. మహేంద్రుడు పెద్దగా ఒక్క శోకంపెట్టి వారిమీద వాలిపోయాడు. అంతలో అతడి భుజాన్ని ఎవరో తాకినట్టయింది. మహేంద్రుడు తలఎత్తి చూశాడు. ఎదురుగా సత్యానందస్వామి.

సత్యానందస్వామిని చూస్తూనే మహేంద్రుడు లేచి కూచున్నాడు. అతడి కళ్ళ నుంచి అశ్రువులు ధారగా ప్రవహిస్తున్నవి. సత్యానందుడు అతడి భుజంమీద చేయి వేసి అనునయించాడు. మహేంద్రుడు కొంచెం ఉపశమనం పొంది లేచి నిలబడబోయేంతలో ఇద్దరు సిపాయిలు అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. వారిలో ఒకడు జమేదారు. అతడు మహేంద్రుడి మెడ పట్టుకుని గుంజుతూ, "రాత్రి బళ్ళను అటకాయించి ధనాన్ని దోచుకున్న సన్యాసుల్లో వీడూ తప్పక ఉండివుంటాడు.

మన కనుగప్పేందుకు ఆ దుస్తులు తీసివేసి, సామాన్యపౌరుడిలా వేషం ధరించాడు." అన్నాడు.

జమేదారు మెడ పట్టుకోగానె, మహేంద్రుడు కాలసర్పంలా బుసలుకొట్టుతూ అతడి కేసి చూశాడు. జమేదారు వెంటవున్న సిపాయి మహేంద్రుడి చేతులకు బేడీలు బిగించబోయాడు. అది చూస్తూనే మహేంద్రుడు సిపాయిని లాగి ఒక్క తన్ను తన్నాడు. వాడు అరుస్తూ కిందపడిపోయాడు. జమేదారు ఉగ్రుడై మీదికి రాబోయేసరికి, మహేంద్రుడతన్ని నడుం పట్టుకుని దూరంగా విసిరివేశాడు.

జమేదారు కత్తి దూస్తూ పడ్డచోటునుంచి లేచి నిలబడబోయేంతలో అరణ్యంలో నుంచి అయిదుగురు సిపాయిలు పరిగెత్తుకుంటూ వచ్చి మహేంద్రుణ్ణీ, సత్యానందుణ్ణీ చుట్టుముట్టారు. మహేంద్రుడు వాళ్ళమీద కలియబడబోయేంతలో, సత్యానందస్వామి అతడి భుజం పట్టుకుని వారిస్తూ, "ఇది సమయం కాదు, ఆగు!" అన్నాడు ఆజ్ఞాపిస్తున్న కంఠంతో.

మహేంద్రుడి చేతులకు సంకెళ్లు తగిలించబడినై. సత్యానందస్వామి కూడా ఒక సిపాయి, సంకెలలు వేయబోయేంతలో, జమేదారు అతణ్ణి వారిస్తూ, "ఆ వృద్ధుడి కెందుకు సంకెళ్లు? ఆయన చాలా సాత్వికుడిలా వున్నాడు. మనవెంట నగరానికి తీసుకుపోదాం," అంటూ మహేంద్రుడికేసి కళ్ళెర్రచేసి చూస్తూ "ఈ బద్మాష్ మాత్రం పారిపోకుండా చూడండి. వీడికి ఉరి తప్పదు. బహూశా, ఈ వృద్ధసన్యాసి క్షేమంగా విడుదల కావచ్చు," అన్నాడు.

సత్యానందుడూ, మహేంద్రుడూ సెలయేటి ఒడ్డున పడివున్న కళ్యాణీ, ఆమె పుత్రికల నిశ్చల శరీరాలకేసి ఓమారు చూసి, తల వంచుకుని సిపాయిలవెంట బయలు దేరారు. "నా భార్యా బిడ్డల శవాలుకూడా దహనక్రియలు జరిపే శక్తి నాకు లేదు. ఆ శవాలను ఏ అడవిమృగాలో పీక్కుతినటం జరుగుతుంది," అనుకున్నాడు మహేంద్రుడు.

రాజమార్గంవెంట పట్టణంకేసి సిపాయిల వెంట కొంతదూరం నడిచిన తరవాత సత్యానందస్వామి జమేదారుతో, "అయ్యా, నేను హరినామస్మరణ చేసుకోవచ్చునా?" అని అడిగాడు.

"నిరభ్యంతరంగా చేసుకోండి. నగరంలో కొత్వాలు తమను తప్పక విడుదల చేస్తాడు. ఈ బద్మాష్‌కు మాత్రం తప్పక ఉరిశిక్ష పడితీరుతుంది," అన్నాడు జమేదారు.

సత్యానందస్వామి గొంతెత్తి పాడసాగాడు.

ధీరసమీరే తటి నీతీరే వసతివనే వరనారీ

నకురో దనుధర గమనవిలంబన మతివిధురా సుకుమారీ.

# 7

మహేంద్రుణ్ణీ, అతడి భార్యా బిడ్డలనూ అరణ్యం దాటేవరకూ ఒకకంట కనిపెట్టి వుండవలసిందిగా సత్యానందస్వామి జీవానందుడికి ఆజ్ఞ యిచ్చాడు. కాని అరణ్యంలో జీవానందుడు ఆకలిచే శోషవచ్చి పడిపోయిన ఒక స్త్రీకి సేవచేస్తూ, దాదాపు ఒక గంటకాలం వుండిపోయాడు. తరవాత అతడు మహేంద్రుడి జాడలకోసం అన్వేషిస్తూ అరణ్యందరికి చేరేసరికి, సత్యానందుణ్ణీ, మహేంద్రుణ్ణీ ముస్లిం సిపాయిలు పట్టుకుపోతూండటం అతడికంట బడింది. ఇప్పు డేమిచేయటమా అని అత డాలోచించేంతలో సత్యానందుడి పాట అతడి చెవుల బడింది.

ధీరసమీరే తటినీ తీరే వసతివనే వరనారీ

సత్యానందస్వామియొక్క సంకేతభావం జీవానందుడికి బాగా తెలుసు. ఆయన సంకేతాని కర్థం, నదీతీరంలో ఒక స్త్రీ పడివున్నదని. బహుశా, ఆకలిచే శోషగొన్న మరొకస్త్రీ అయివుంటుం దామె. తను ఆమె రక్షణకు వెళ్ళటం ముఖ్యమా ? లేక సత్యానందస్వామిని ముస్లింసిపాయిల బారినుంచి రక్షించటం ముఖ్యమా ? అన్న సమస్య ఓ క్షణకాలం జీవానందుణ్ణి ఎదుర్కొన్నది. తమ గురువు ప్రాణంకన్న, ఆయన ఆజ్ఞ గొప్పదని జీవానందుడు నిర్ణయించుకున్నాడు.

జీవానందుడు అరణ్యంనుంచి బయిటికి వచ్చి, సెలయేటి వెంటబడి కొంతదూరం వెళ్ళేసరికి, అక్కడ ఒక చెట్టుకింద నిశ్చేతనంగా పడివున్న ఒక స్త్రీ అమెపైని పాకుతూ ఏడుస్తూన్న ఒకబాలికా కనిపించారు. వా ళ్ళిద్దరూ మహేంద్రుడి భార్యా పుత్రికలని జీవానందుడికి తెలియదు కాని జరిగిన సంగతి సందార్భాలనుబట్టి, వారు మహేంద్రుడి భార్యాపుత్రికలై వుంటారని అతడు వూహించాడు

జీవానందుడు బాలికను చేతుల్లోకి తీసుకొని, కళ్యాణికేసి పరీక్షగా చూశాడు. ఆమెలో ప్రాణం వున్న సూచన లేమీ అతడికి కనిపించలేదు. "సరే, తల్లి చనిపోయింది. ఈ అనాధబాలికను రక్షించవలసిన బాధ్యత నాది," అనుకుంటూ జీవానందుడు అక్కణ్ణించి బయలుదేరి, కొంత సేపటికి అడవి అంచునవున్న భైరవీపురం అనే గ్రామాన్ని చేరాడు

ఈ భైరవీపురంలో జీవానందుడిభార్యా, వివాహితురాలైన చెల్లెలూ వున్నారు. జీవానందుడు, సుకుమారితో సరాసరి తన చెల్లెలిఇంటికి వెళ్ళాడు. ఆ సమయంలో

అతడి చెల్లెలునిమాయి ఇంట్లోనే వున్నది. జీవానందుడు బయట వసారాలోవున్న రాట్నాల్లో ఒకదాన్ని క్రమనేలా తిప్పుతూ, ''నిమ్మీ !" అంటూ కేకపెట్టాడు.

ఆ కేక వింటూనే నిమాయి లోపలినుంచి వసారాలోకి వచ్చి, తన అన్ననూ, అతడి చంకలోవున్న సుకుమారినీ చూసి, ఆశ్చర్యపడి, ''ఏం, అన్నయ్యా ! ఎవరో పిల్ల ? మళ్ళీ పెళ్ళేమయినా చేసుకున్నావా ఏం ?'' అని అడిగింది.

"మళ్ళీపెళ్ళా ! మీ వదిన్నేం చేసేట్టు ? ఆ కబుర్లకేంగాని, ముందు ఇన్నిపాలు కాచుకురా, పాప కివ్వాలి,''అన్నాడు జీవానందుడు

నిమాయి ఇంట్లోకి పోయి పావుగంటతరవాత ఒక పాత్రనిండుగా పాలు తీసుకు వచ్చింది. జీవానందుడు సుకుమారిని చెల్లెలిచేతి కిచ్చాడు. నిమాయి ఆమెను కాళ్ళ మీద పడుకోపెట్టుకుని చంచాతో పాలు పోయసాగింది. ఉన్నట్టుండి నిమాయి కళ్ళు అశ్రుపూరితా లయాయి త నిప్పుడు పిల్లకు పాలుపడుతున్న చెంచా, చనిపోయిన తన కొడుకుకు వుపయోగించింది.

"అన్నా, ఈ పాపను పెంచుకునేందుకు నా కిస్తావా ?'' అన్నది నిమాయి.

''ఇస్తానే అనుకో, ఏం చేసుకుంటావు ?'' అన్నాడు జీవానందుడు.

''ఇలాగే పాలు పడతాను; ఒడిలో కూచోబెట్టుకుని ఆడిస్తాను; పెంచి పెద్దదాన్ని చేస్తాను,'' అన్నది నిమాయి ఎంతో అప్యాయంగా.

"నీకూ కొడుకులూ, కూతుళ్ళూ కలుగుతారు. అప్పుడీ పాపను ఏం చేస్తావు ?'' అని ప్రశ్నించాడు జీవానందుడు.

"కలగనీ. దీన్నీ వాళ్ళతోపాటు నా బిడ్డగానే చూసుకుంటాను,'' అన్నది నిమాయి.

"అయితే, తీసుకో. అప్పుడప్పుడూ వచ్చి చూసిపోతుంటాను. సరే, బావ ఎక్కడ ?'' అన్నాడు జీవానందుడు

''ఆయన రెండుమూడుసేర్ల బియ్యం తీసుకుని ఎక్కడికో వెళ్ళారు. పక్క గ్రామంలో ఎవరో ఆకటితో మలమల మాడిపోతున్నారట," అన్నది నిమాయి.

జీవానందుడు తన చెల్లెలికేసి ఆశ్చర్యంగా చూస్తూ, "అయితే, ఈ గ్రామాన్ని కరువుపిశాచి వదిలిపోయిందన్నమాట ! ఏమి టా రహస్యం ?'' అన్నాడు.

"సాధ్యమైనంతవరకూ అడవిలో దొరికేదుంపలూ, కాయలూ తిని, పండిన కొద్ది పంట జాగ్రత్తగా దాస్తూవస్తున్నా. భోజనానికి పద, ఇటొచ్చి చాలారోజులైంది," అన్నది నిమాయి.

జీవానందుడు చెల్లెలిచేత అన్నం కూరలూ ఒకటి రెండుసార్లు అడిగిపెట్టించుకుని భోజనం పూర్తిచేసి, చేతులు కడుక్కొంటూవుండగా, నిమాయి అతణ్ణి సమీపించి

చిన్నగొంతుతో, "అన్నయ్యా, ఇంతదూరం రానేవచ్చావు వదెన్ని ఒకసారి చూసి మరీపో," అన్నది.

చెల్లె లిలా అనగానే జీవానందుడు ఉగ్రుడైపోతూ, "వదెన్ని చూసిపోవాలా ? సంతానుల్లో చేరేటప్పుడు, నే చేసిన ప్రతిజ్ఞ మాటేమిటి ?" అన్నాడు.

"గ్రామంలోకి రావటానికి అడ్డురాని ప్రతిజ్ఞ, భార్యముఖం చూసిపోవటానికి అడ్డొస్తుందా ? ఎవరైనా నవ్విపోగలరు," అన్నది నిమాయి. జీవానందుడు మెత్తబడిపోయాడు.

నిమాయి నిద్రమత్తుతో జోగుతున్న సుకుమారిని మంచంమీద పడుకోబెట్టి తుర్రుమంటూ ఇంటినుంచి బయటికిపోయి, సమీపంలోవున్న ఒక మామిడిలోపులోని పూరిపాకను ప్రవేశించింది.

ఆ పాకవసారాలో ఒక పాతికేళ్ళయువతి రాట్నం వడుకుతున్నది. నిమాయి ఆవిణ్ణి సమీపిస్తూనే భుజం పట్టుకుని గుంజుతూ, "రా వదినా, రా !" అన్నది.

"ఎందుకూ ?" అన్న దా యువతి, ఏడుకుతున్న దారాన్ని నిర్లక్ష్యంగా వదిలివేస్తూ.

"అన్నయ్యొచ్చాడు."

"చూశాను," అన్న దా యువతి.

"ఆహాఁ, చూశావా ! ఇంకేం, రమ్మంటున్నాడు రా. పెట్టెలోంచి మంచిచీర తీసి కట్టుకో," అంటూ నిమాయి తొందర చేసింది.

"ఈ చీరె బాగానేవుందిలే పద, వెళదాం," అంటూ ఆ యువతి రాట్నంముందు నుంచి లేచి, నిమాయివెంట బయలుదేరింది. నిమాయి తిరిగి ఇంటికి వచ్చేసరికి జీవానందుడు వసారాలో లేడు. ఆమె లోపలికి తొంగిచూసి, తన అన్న పెరటిదొడ్డిలోని మామిడిచెట్టుకింద నిలబడివుండటం గమనించి, "పో, అన్నయ్య పెరట్లో వున్నాడు నీ అతుకులచీరా, చింపిరితలా చూస్తాడు. తన్నులు తప్పవు," అంటూ వదినెను గడపదాటించి ముందుకు నెట్టింది.

తనను సమీపిస్తున్న భార్యకేసి జీవానందుడు ఓ క్షణకాలం పరీక్షగా చూశాడు. అతడి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగినై. తైలసంస్కారంలేని తలా, మాసికల చీరా, రవికా ధరించివున్నా ఆమె పెదాలమీద చిరునవ్వు కదులుతున్నది.

"శాంతీ, యిలా అయిపోయావేం ? అంత కటికి దరిద్రురాలుగా బతకవలసిన అవస్థ నీకెందుక్కలిగింది ?" అంటూ జీవానందుడు భార్యకేసి రెండడుగులు వేశాడు.

శాంతి భర్తకళ్ళల్లోకి చూస్తూ, "మీరు కళ్ళనీళ్ళు పెట్టుకోకండి. నే నేమీ కష్టాలనుభవించటంలేదు. మీ త్యాగంముందు నా దేపాటి ? మీ రిచ్చిపోయిన ధనంతోపాటు,

మరికొంత కలిపివుంచాను; అవసరం అనుకుంటే దాన్ని దేశంకోసం వినియోగించండి,'' అన్నది.

జీవానందుడు ఎక్కడలేని ఆవేశంతో భార్యను గట్టిగా కౌగలించుకున్నాడు. శాంతి అతడి భుజంమీద తలపెట్టి గాద్గదికస్వరంతో, "మీరు వ్రతభంగం చేశారు. మీరు నన్ను చూసేందుకు రావలసిందికాదు," అన్నది.

''అవును. పొరపాటు జరిగిపోయింది. ఇందుకు నేను తప్పక ప్రాయశ్చిత్తం చేసుకోవలసివున్నది,'' అన్నాడు జీవానందుడు.

శాంతి భర్తమాటలు వింటూనే చప్పున అతడి కౌగిలినుంచి విడివడి, వంగి పాదాలు తాకుతూ, ''మీనుంచి నేనో భిక్ష వేడుకుంటున్నాను. తిరిగి మరొకసారి నన్ను కలుసుకునేవరకూ ప్రాయశ్చిత్తం చేసుకోకండి," అన్నది.

జీవానందుడు భార్యను పైకెత్తి హృదయానికి హత్తుకుంటూ. "శాంతీ, నిన్ను మళ్ళీ చూడకుండా నేను మరణించను సరే, యిక వెళతాను నాదీ ఒకకోర్కె వున్నది. నువ్వీ చిరుగులపాతలు ధరించటం మాని, మంచిదుస్తులు ధరించు. ఆరోగ్యవిషయమై శ్రద్ధతీసుకో,'' అన్నాడు.

''మీ రిప్పు డెక్కడికి వెళతారు ?'' అన్నది శాంతి.

''సత్యానందస్వామిని ముస్లింసిపాయిలు బంధించి నగరానికి తీసుకుపోతున్నారు. నేను ముందుగా ఆనందమఠానికి పోయి, ఆయన విడుదలకై చేయవలసిన పను లేమిటో, అక్కడ వున్న యితర సంతానులతో చర్చించాలి," అని చెప్పి జీవానందుడు అక్కణ్ణించి బయలుదేరి, తిరిగిచూడకుండా అరణ్యంకేసి వేగంగా నడవసాగాడు.

జీవానందుడు ఆనందమఠాన్ని చేరకపూర్వమే, మఠంలో జ్ఞానానందస్వామి అనే సత్యానందుడి ముఖ్యశిష్యుడు తమ నాయకుడికి కలిగిన ఆపదనుగురించి భవానందుడికి చెప్పాడు. భవానందుడు నగరంలో పరిస్థితి ఎలావున్నదో తెలుకువస్తానని అతడికి మఠరక్షణ ఒప్పగించి, మొగలాయీ యువకుడివేషం ధరించి గుర్రంమీద బయలు దేరాడు. అతడికి దారిలో మహేంద్రుడిభార్య కళ్యాణి చెట్టుకింద పడివుండటం కనిపించింది.

భవానందుడు గుర్రం దిగి కళ్యాణిని సమీపించి, ఆమెపక్కన పడివున్న విషపు భరిణెను చూశాడు. తరవాత ఆమె నాడిని పరీక్షించి, 'ఫరవాలేదు, ప్రయత్నిస్తే బతకవచ్చు,' అనుకుంటూ అరణ్యంలోకి పోయి, కొన్ని ఆకులు తుంచితెచ్చి, వాటిపసరును ఆమె ముక్కుపుటాల్లోనూ, పెదాలు తెరిచి ఆమె నాలుకమీదా పోశాడు. ఒకటి రెండు

నిమిషాలతర్వాత కళ్యాణిలో చలనం కనిపించింది. భవానందు డామెను గుర్రం మీద వేసుకుని నగరంకేసి వెళ్ళాడు.

భవానందుడు నగరం ప్రవేశించేలోపలే, సత్యానందస్వామి మరొక వ్యక్తితోపాటు కారాగారంలో బంధించబడ్డాడన్నవార్త తెలిసి, ఆయన నెలాగయినా బంధవిముక్తుణ్ణి చేయాలన్న పట్టుదలతో వందలకొలదీ సంతానులు ఆనందమఠందగ్గిరకు వచ్చి చేరారు. ఈటెలూ, కత్తులూ పైకెత్తి హరినామస్మరణ చేస్తూ, జయజయధ్వానాలు పలుకుతున్న ఆ సంతానసేనతో జ్ఞానానందుడు నగరంమీదికి వచ్చిపడ్డాడు. ఎదిరించిన కొద్దిమంది ముస్లింసైనికులను వధించి సంతానులు కారాగారంతలుపులు బద్దలుకొట్టి, సత్యానందస్వామినీ, మహేంద్రుణ్ణీ విడుదలచేశారు. ఆ ఉత్సాహంలో కొందరు సంతానులు ముస్లింగృహాలకు నిప్పుపెట్టి, తారసపడ్డ ముస్లింలను చంపసాగారు. సత్యానందస్వామి సంతానులు చేసే యీ అనవసరకల్లోలాన్ని ఆపేందుకు ప్రయత్నించాడు. వచ్చినకార్యం నెరవేరిందికనుక, సంతాను లందర్నీ తిరిగి ఆనందమఠానికి వెళ్ళిపోవలసినదిగా ఆయన ఆజ్ఞాపించాడు.

సంతానులు నగరం వదిలి అరణ్యం కేసి బయలుదేరేంతలో, ఒక సిపాయిదళం తుపాకులతోనూ, ఫిరంగులతోనూ వారి నెదిరించింది. కత్తులూ, ఈటెలూ లాఠీలూ మాత్రమే ఆయుధాలుగాగల సంతానులు, వాళ్ళధాటికి ఆగలేక చెల్లాచెదరై పారిపోయారు.

# 8

జీవానందుడు వెళ్ళిపోయిన తరవాత, శాంతి ఇంటివసారాలో గోడకు చేరగిలబడి కూర్చుని తన కర్తవ్యాన్నిగురించి ఆలోచించసాగింది. తన భర్త సంతానుల్లో కలిసేటప్పుడు చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించాడు. దానికి ఏదోఒక ప్రాయశ్చిత్తం తప్పదు. పత్నిగా ఆ ప్రాయశ్చిత్తంలో భాగంపంచుకోవటం తన విధి.

శాంతి ఇంతవరకు ఆలోచించిన తరవాత, ఇక కాలయాపన లేకుండా ఒక దృఢ నిశ్చయానికి వచ్చింది. బాల్యంలో ఆమె ఉపాధ్యాయవృత్తిలో వుండే తన తండ్రిదగ్గిర ఇతరవిద్యార్థులతోపాటు చదువుసంధ్యలు అభ్యసించి, వారివలెనే దేహపరిశ్రమ చేసి. సాముగరిడీలూ, మల్లయుద్ధాలూ నేర్చింది. పసితనంలో తల్లిని కోల్పోయిన శాంతిని తండ్రి యీవిధంగా పెంచుకుంటూవచ్చాడు. తరవాత కొన్నాళ్ళకు తండ్రి గతించటంతో, ఆమెను తండ్రివద్ద విద్యార్థిగా వున్న జీవానందుడు తనఇంటికి తీసుకుపోయాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు జీవానందుడితో ఆమె వివాహం శాస్త్రోక్తంగా జరిగిపోయింది. కాని శాంతిమాత్రం తాను మగపిల్లలమధ్య పెరిగిన అలవాట్లను మరిచి

పోలేకపోయింది. అడవికిపోయి కాయలూ, పువ్వులూతేవటం, అప్పుడప్పుడూ మగపిల్లవాడిలానే దుస్తులు ధరించి వీధుల్లో తిరగటం చూసి, ఆమె అత్తమామలు శాంతిని కట్టుబాట్లలో పెట్ట ప్రయత్నించారు. వాళ్ళ పోరు దుర్భరం కాగా శాంతి ఇంటినుంచి పారిపోయి, ఒక పుణ్యక్షేత్రాన్నుంచి మరొక పుణ్యక్షేత్రానికి తిరిగే సన్యాసులతో పురుషవేషంతో చేరి, వాళ్ళవెంట నాలుగైదు సంవత్సరాలు దేశం నలుమూలలా తిరిగి. భర్త జీవానందుడు గుర్తుకు రాగా అత్తవారింటికి తిరిగివచ్చింది.

అప్పటి కామె పూర్ణయౌవని. మామగారు గతించారు. అత్తగారు ఆమెను ఇంట్లో వుంచుకోవటానికి నిరాకరించింది. భ్రష్టువైపోయావని నానాతిట్లు తిట్టింది. కాని జీవానందుడు తల్లిచేత ఏదోవిధంగా ఒప్పించి శాంతితోపాటు, తన చెల్లెలి భర్తగారి గ్రామమైన భైరవీపురం చేరి, అక్కడ బావగారిజాగాలోనే చిన్న కుటీరం నిర్మించి కాపరం పెట్టాడు. ఆతరవాత కొద్దినెలలకే అతడు సత్యానందస్వామిచేత ఆకర్షింపబడి, సంతానులలో కలిసి, ఆనందమఠం చేరాడు.

శాంతి తన గతజీవితాన్నంతా ఒకసారి మననం చేసుకున్నది. "సన్యాసుల్లో కలిసి సన్యాసిగా నాలుగైదేళ్ళు జీవించాను. నన్నెవరూ స్త్రీ అని అనుమానించలేదు. ఇప్పు డావేషం ధరిస్తేమాత్రం ఎవరు గుర్తించగలరు?" అనుకున్న దామె. ఆవెంటనే ఆమె వసారాలోనుంచి లేచి వంటగదిలోకి పోయి, నిప్పులతో కణకణలాడుతున్న పొయ్యిలో యిన్ని నీళ్ళు పోసి చల్లార్పేసింది. తరవాత ఇంతకాలంగా తాను భద్రంగా దాచుకున్న సన్యాసిఉడుపులనూ, గడ్డం మీసాలనూ పెట్టెలోంచి తీసి, దులిపి, ఒక్కొక్కటే జాగ్రత్తగా ధరించి అద్దంలో చూసుకుని తృప్తిగా ఒకచిరునవ్వు నవ్వుకున్నది.

శాంతి యీవిధంగా సన్యాసివేషధారణ పూర్తి చేసేసరికి సూర్యాస్తమయ మయింది. ఆమె మెల్లిగా తలుపు తెరిచి నిమాయిఇంటికేసి చూసింది. నిమాయిభర్త అప్పుడే పొరుగు గ్రామంనుంచి తిరిగివచ్చినట్టుంది. నిమాయి, భర్తవెంట ఇంటిలోకి పోతున్నది ఇదే మంచి అదనుకుని శాంతి ఇంటితలుపులకు తాళంపెట్టి, ఇంటిచుట్టూ వున్న మామిడిచెట్లచాటున నక్కి నడుస్తూ, ఆవరణ దాటగానే ఛెంగున లేడిపిల్లలా ఎగిరి, అరణ్యంకేసి పరుగులుతీసింది.

ఆమెకు అరణ్యంలో ఆనందమఠం వున్న ప్రదేశం ఎక్కడో తెలియదు. మఠాన్ని వెతుక్కుంటూ చీకటిలో ఆమె అరణ్యం నలుమూలలా తిరగసాగింది. అలా తిరుగుతూ ఆమె గొంతెత్తి మృదుమధురస్వరంలో పాడసాగింది :

కహాఁ చలే ఘోడేపర్ చఢ్‌కర్
హమ్ న పైరోఁ చలే హమ్ సమర్



హర హర హరకహ సమరమే రంగే
రణతరంగేమే హమ్ కూ దేంగే
కిస్‌కే హో తుమ్ కౌను తుమ్హారా
క్యోం దేతేహో హమే సహారా
నారీకీ అబ్ చాహ్ నహీహై
గావో రణకే గీత్ ఉమడ్‌కర్
పైరోం పడూం పియారే మేరే
రహో సదా తుమ్ ముఝ్‌కో ఘేరే
బజతా హై క్యా రణకా బాజా
నాచ్ రహా తురంగ్ యహా సాజా
మేరా మన్ ఉడ్‌రహా దేఖ్‌కర్
మై నరహూంగా రహూంగా నాఘర్
నారీకీ అబ్ చాహా నహీహై
గావో రణకే గీత ఉయడ్‌కర్.

శాంతి యీ విధంగా పాడుతూ అడవిలో తిరుగుతూండగా, ఆమెకు గోవర్ధను డనే ఆనందమఠ పరిచారకు డొకడు ఎదురైయ్యాడు. ఆమె అతణ్ణి ఆనందమఠానికి దారి చూపమని అడిగింది. సన్యాసివేషంలో వున్న శాంతిని చూసి ఆ పరిచారకుడు, యిత డెవరో కొత్తగా సంతానులలో కలియవచ్చినవా డనుకుని, ఆమెను వెంటబెట్టుకుని ఆనందమఠం చేరాడు.

శాంతి ఆనందమఠం చేరే సమయానికి, బందిఖానా నుంచి విముక్తులై సత్యానందుడూ, మ ంద్రుడూ అక్కడికి వచ్చారు. వారికి కొంచెం వెనగ్గా నగరంనుంచి పారిపోయిన సంతానులూ, వారి నాయకులూ వచ్చి చేరారు. సత్యానందస్వామి తన ముఖ్యానుచరులైన భవానంద, జీవానందులతో సంతానులు ముస్లిం సైనికుల చేతిలో పొందిన ఓటమిని గురించి చర్చిస్తున్నాడు.

''మనం యింత పట్టుదలా, కార్యదీక్ష వుండీకూడా, ముసల్మానుల చేతిలో ఓడి పోయాం. భగవంతుడు మనకు అనుకూలంగా లేడని నా అనుమానం," అన్నాడు జీవానందుడు

సత్యానందస్వామి ఓ క్షణకాలం మౌనం వహించి, తరవాత జీవానందుడి ముఖం కేసి సూటిగా చూస్తూ, ''జీవానందా, నువ్వు పొరబడుతున్నావు ఈ క్షణంలో ఆ శంఖ చక్ర గదాధారి యైన మహావిష్ణువు మనమీద తన కృపా కటాక్షాలను ప్రసరింప చేస్తున్నాడని నేను నమ్ముతున్నాను. మన అపజయానికి కారణం, శత్రువుల చేతిలోని ఆధునిక ఆయుధాలు. తుపాకీ, ఫిరంగుల ముందు కత్తి, బల్లెమూ ఏపాటి? మహేంద్రుడు దీక్ష తీసుకుని మనలో కలవనున్నాడు. అతని ద్వారా మనకు గొప్ప మేలు జరుగబోతున్నది," అన్నాడు.

''మహేంద్రసింహుడు సంతానదీక్షకు అంగీకరించాడా? నేనతని కుమార్తెను కాపాడి భైరవీగ్రామంలో మా చెల్లెలియింట వుంచివచ్చాను. కాని అతడి భార్యను రక్షించే అవకాశం నాకు కలగలేదు. అప్పటికే ఆమె మరణించివున్నది." అన్నాడు జీవానందుడు.

జీవానందుడి మాటలు వింటూనే భవానందుడు ఉలిక్కిపడ్డాడు. తాను అరణ్యం అంచునగల సెలయేటి ఒడ్డున పడివున్న విషగ్రస్త అయిన స్త్రీని కాపాడాడు. ఆమె మహేంద్రసింహుడి ధర్మపత్నియా? ఆశ్చర్యం. భవానందుడు, మహేంద్రుడి భార్య మరణించలేదనీ, తా నామెను రక్షించి నగరం చేర్చాననీ చెప్పబోయి అంతలోనే మనసులో ఏదో సంశయం మెదలటంతో, మాటాడక వూరుకున్నాడు.

''భార్యాపుత్రులు మరణించారనే నమ్మకంతోనే మహేంద్రుడు మన సంతాన ధర్మం స్వీకరించటానికి అంగీకరించాడు. ఇంకొద్దిసేపట్లో అతడికీ, మరొక యువ సన్యాసికీ దీక్ష యివ్వబోతున్నాను," అంటూ సత్యానందస్వామి గొంతుస్థాయి తగ్గించి. ''ఇది చాలా గోప్యంగా వుంచవలసిన విషయం. రేపు సూర్యోదయం వేళనే, నేను బయలుదేరి సంచారయాత్ర చేయబోతున్నాను. మనమూ ఫిరంగులూ, తుపాకులూ సంపాయిస్తే తప్ప, యీ ముస్లిములను జయించలేం. వాటిని తయారు చేసి భద్రపరిచే బాధ్యత మహేంద్రుడిది. అతడి స్వగ్రామమైన పదచిహ్నంలోనే అందుకు తగిన ఏర్పాట్లు చేయిస్తాను,'' అన్నాడు

''అయితే, మహేంద్రసింహుడికి అతడి పుత్రిక బతికివున్న వార్త తెలియపరచమంటారా?'' అని అడిగాడు జీవానందుడు.

‘‘అదంతా నే చూస్తాను. అతడి పుత్రికే కాక భార్యకూడా బతికివున్నదో లేక ఇద్దరూ మరణించారో—ఆ విషయమంతా, అతడికి దీక్ష యిచ్చే సమయంలో, అతడి ధోరణీ, నిగ్రహానిగ్రహాలూ గమనించి, ఉచిత మనుకున్న రీతిగా నేను తెలియపరుస్తాను. మీ రిద్దరూ ఆ సంగతులన్నీ మరిచిపొండి,’’ అంటూ సత్యానంద స్వామి లేచి, దేవీ ఆలయంకేసి బయలుదేరాడు.

# 9

సత్యానందస్వామి ఆలయంలోకి రావటం చూస్తూనే, మహేంద్రుడూ, సన్యాస వేషంలో వున్న శాంతీ లేచి నిలబడి ఆయనకు నమస్కరించారు. సత్యానందుడు మహేంద్రుణ్ణి సమీపించి, ‘‘మహేంద్రసింహా, నీ కుమార్తె బతికేవున్నది. అయినా. సంతానదీక్ష స్వీకరించేందుకు నీవు సిద్ధమేనా ?’’ అని అడిగాడు.

కుమార్తె బతికివున్నదన్న మాట వింటూనే మహేంద్రుడు పట్టరాని ఆనందంతో ఆపాదమస్తకం చలించిపోయి, ‘‘మహరాజ్, ఎంత మంచివార్త విన్నాను. ఇక నాకు సంతానదీక్ష యిప్పించండి,’’ అన్నాడు

సత్యానందస్వామి కనుబొమలు ముడిచి, ‘‘మహేంద్రసింహా, నే చెప్పినది నీకు సరిగా అర్థమైనట్టు లేదు నీ కుమార్తె సజీవురాలు నీవు సంతానధర్మం అవలంబిస్తే ఆ తరవాత సంతానధర్మం జయించేవరకూ, నీవు ఆమెను చూసేందుకు వీలుండదు,’’ అన్నాడు.

‘‘నా కుమార్తెను నేను చూడటం వ్రతభంగ మవుతుందా?’’ అంటూ మహేంద్రుడాశ్చర్యపడ్డాడు.

‘‘దీక్ష తీసుకున్న తరవాత భార్యాపిల్లలను చూడటం ఒక రకంగా వ్రతభంగమే!’’ అన్నాడు సత్యానందస్వామి.

మహేంద్రుడు కొంచెంసేపు తలవంచుకు వూరుకుని, తరవాత చిన్న గొంతుతో, “అయితే, నా కుమార్తెను చూడను. ఎక్కడవున్నదో చెప్పండి చాలు,” అన్నాడు

సత్యానందుడు నవ్వి, ‘‘చూసే అవకాశం లేనప్పుడు ఎక్కడవున్నదో తెలిస్తే మాత్రం నీ కొరిగే దేమిటి ? ఆమె మంచి రక్షకుల చేతుల్లోనే వున్నది,’’ అన్నాడు.

“సరే, మహరాజ్ ! నాకు దీక్ష యిప్పించండి,” అంటూ మహేంద్రుడు తల వంచాడు.

సత్యానందస్వామి, శాంతికేసి తలతిప్పి, “నువ్వు చూడబోతే చాలా చిన్నవయసు వాడివిలా వున్నావు. అన్నీ ఆలోచించుకొనే యిక్కడికి వచ్చావా ? ఒకసారి సంతాన

దీక్ష తీసుకుని దీక్షాభంగం కలిగించావో, నీకు రౌరవాది నరకం తప్పదు," అన్నాడు కఠినంగా.

"మహారాజ్ ! అంతా ఆలోచించుకునే వచ్చాను. కరుణించి నాకూ దీక్ష యివ్వండి," అన్నది శాంతి నమ్రతగా తలవంచి.

సత్యానందస్వామి ఆ యిద్దరికీ ఒకేసారి సంతాన సాంప్రదాయం ప్రకారం దీక్ష యిస్తూ, ప్రమాణవచనాలు పలికించాడు. అంతా అయిన తరవాత, "ఏ కారణంచేతనైనా మీరు ప్రమాణభంగం చేస్తే, ఎలాంటి ప్రాయశ్చిత్తం అనుభవిస్తారు ?" అని అడిగాడు సత్యానందస్వామి.

ఆ ప్రశ్నకు మహేంద్రుడూ, శాంతీ ఏకకంఠంతో, "ఒకవేళ మేం ప్రమాణభంగం కలిగేలా ప్రవర్తిస్తే అందుకు ప్రాయశ్చిత్తం, మండుతున్న చితిలో పడిగాని, విషం తిని గాని మరణిస్తాం," అన్నారు.

సత్యానందుడు తృప్తిగా తలాడించి, మహేంద్రుణ్ణి భుజం పట్టుకుని దూరంగా తీసుకుపోయి, "మహేంద్రా ! నీవల్ల సంతానులకు జరగవలసిన గొప్పమేలు ఒకటున్నది. నువ్వు సూర్యోదయంతోనే బయలుదేరి నీ స్వగ్రామం పదచిహ్నకు వెళ్ళిపో. నీ భవనాన్నీ, మొత్తంగ్రామాన్నీ ఒకకోటలా తయారుచెయ్యి. చుట్టూ కందకం, ఎత్తయిన కోటగోడలూ, అందులో బురుజులూ – అన్నీ త్వరత్వరగా నిర్మింపబడేలా చూడు. ఇందుక్కావలసిన డబ్బూ, మనుష్యసహాయం – అంతా ఆనందమఠంనుంచి నీకు వస్తుంది. పదచిహ్నగ్రామం సంతానుల ధనాగారం, ఆయుధాగారం కాబోతున్నది. నేను యాత్రమీద పోతున్నాను. ఫిరంగులూ, తుపాకులూ, గుళ్ళూ, తూటాలూ – అన్నీ సమర్ధవంతంగా చేసే పనివాళ్ళను- నేను త్వరలోనే పంపుతాను; అర్థమయిందా ?" అని అడిగాడు.

సత్యానందస్వామి ఏకధాటిగా చెప్పుకుపోయిన విషయాన్నంతా ఆకలింపు చేసుకోవటానికి మహేంద్రుడికి ఒకటిరెండుక్షణాల కాలం పట్టింది. తాను నిర్వహించవలసిన పనులూ, బాధ్యతలూ సంతానుల విజయానికి ఎంత ముఖ్యమైనవో అర్థం కాగానే, అతడు భక్తితో తలవంచి, "మహారాజ్ ! నామీద మీరు చాలా పెద్దబాధ్యతలు పెడుతున్నారు. అయినా, మీ అనుగ్రహంవల్ల నేను వీటన్నిటినీ సక్రమంగా నిర్వహించగలననే ధైర్యం కలుగుతున్నది," అన్నాడు.

సత్యానందస్వామి చిరునవ్వు నవ్వుతూ మహేంద్రుణ్ణి దీవించి, వెనుదిరిగి శాంతి వున్నచోటుకు వచ్చి, ఆమెకు తన ననుసరించి రావలసిందిగా సౌంజ్ఞ చేసి. పక్కన వున్న మరొకగదిలోకి వెళ్ళాడు శాంతి ఆయన వెనకగా నడిచింది. సత్యానంద

స్వాసు గదిమధ్య నున్న ఒక లేడిచర్మంపై కూర్చుని, శాంతిని ఎదురుగా కూర్చో వలసిందిగా చెప్పి, ఆమె కూర్చోగానే, "సరే, యిప్పుడు చెప్పు, నిన్నే పేరుతో పిలవమంటావు ?" అని అడిగాడు.

"మీ యిష్టంవచ్చిన పేరుతో పిలవండి, మహరాజ్ ! నేను వైష్ణవులకు దాసాన దాసుణ్ణి !" అన్నది శాంతి.

"నీవు చాలా పిన్నవయసువాడివి. అందుచేత నిన్ను నవీనానందుడని పిలుస్తాను. ఇంతకూ నీ అసలుపే రేమిటి ?" అన్నాడు సత్యానందస్వామి.

"నా పేరు శాంతిరామదేవశర్మ."

"నీ పేరు పాపిష్టి శాంతిమణి," అంటూ సత్యానందస్వామి, శాంతి పెట్టుకున్న గడ్డాన్నీ, మీసాలనూ ఒక్కవూపున లాగివేశాడు. శాంతి భయంతో కంపించిపోతూ, కళ్ళు మూసుకుని తల దించేసుకున్నది.

"నన్నే మోసం చేయాలని యిక్కడి కొచ్చావా ? అంత చిన్న వయసు తోపింప చేసే ముఖానికి బారెడుగడ్డమూ, మీసాలూ వుంటవంటే నే నెలా నమ్ముతా నను కున్నావు ? స్త్రీలకు యీ మఠంలో స్థానంలేదు. ముస్లింసైనికులతో మరో పోరాటమే తటస్థిస్తే, నీలాటి అబలవల్ల ఏమవుతుంది ?" అన్నాడు సత్యానందస్వామి.

"అందరుస్త్రీలూ అబల లనేనా, మీ వుద్దేశం, మహరాజ్ ?" అన్నది శాంతి.

"కారని నువ్వు రుజువుచెయ్యగలవా ? ఏదీ చూతాం, ఆ ఉక్కుధనుస్సుకు, ఆ ఉక్కునారిని తగిలించు," అన్నాడు సత్యానందస్వామి.

శాంతి గోడ నానించివున్న ఉక్కుధనుస్సును చేతికి తీసుకుని, ఉక్కుతీగను నారిగా తగిలించబోతూ, "మహరాజ్ ! మీరు దీక్ష యిచ్చిన సంతాను లందరూ, యీపరీక్షలో నెగ్గినవారేనా ?" అని ప్రశ్నించింది.

"సంతాను లందరూ యీ పరీక్షలో నెగ్గితే, యిక లేని దేమిటి ? కేవలం నలుగురు మాత్రం నెగ్గారు," అన్నాడు సత్యానందస్వామి.

"వా రెవరో నే నడగవచ్చునా ?"

"నేను, జీవానందుడు, భవానందుడు, జ్ఞానానందుడు," అన్నాడు సత్యానందస్వామి.

సత్యానందుడు మాట పూర్తి చేసేలోపలే, శాంతి ధనుస్సుకు ఉక్కునారిని సునా యాసంగా తగిలించి, ఆయన కాళ్ళవద్ద పడేలా విసిరివేసింది. అది చూస్తూనే సత్యా నందస్వామి ఎక్కడలేని ఆశ్చర్యంతో, "నీ వెవరివి ? మానవివా లేక దేవీస్వరూపి ణివా ?" అన్నాడు.

శాంతి చేతులు జోడించి, ఆయనకు వంగి నమస్కరిస్తూ, "స్వామీ, నేను సాధారణ మానవిని; బ్రహ్మచారిణిని," అన్నది.

"బ్రహ్మచారిణివా ?" అంటూ సత్యానందస్వామి నవ్వి, ఇంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా శాంతి ముఖంలోకి తీక్షణంగా చూస్తూ, "ఇప్పుడు గుర్తుకొచ్చింది. జీవానందుడి భార్యపేరు శాంతి. నీ వతడి భార్యవేగదా ?" అని ప్రశ్నించాడు.

శాంతి మౌనంగా తలవంచుకు నిలబడింది.

సత్యానందస్వామి కలత పొందినవాడిలా ముఖంపెట్టి, కొద్దిసేపు మౌనంగా వూరుకుని, తరవాత శాంతిని కూర్చోవలసిందిగా సౌంజ్ఞ చేసి, "కాలం మించి పోయింది. ఇప్పుడు చేయగలిగిన దేమీలేదు. నీ ఫాలభాగం చూస్తుంటే, అగ్నిహోత్రం గుర్తుకొస్తున్నది. బహుశా, సంతాన సాంప్రదాయమే నీవల్ల భస్మం కానున్నదేమో," అంటూ ఆమె నాశీర్వదించి, ఆ రాత్రికి మఠంలోనే వుండేందుకు అనుజ్ఞ యిచ్చి, గదినుంచి బయిటికి వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిన కొద్దిసేపటికి మఠం పరిచారకుడు గోవర్ధనుడు గదిలోకి వచ్చి, శాంతిని చూస్తూనే గతుక్కుమన్నాడు. అతడు చూసినప్పుడు ఆమె గడ్డాలూ, మీసాలూ వున్న సన్యాసి. ఇంతలో అవన్నీ ఏమయిపోయినట్టు ?

గోవర్ధనుడి కంగారు గుర్తించిన శాంతి ముందుకు వచ్చి, "గోవర్ధనా, ఏదీ, నే నుండేందుకు గది చూపించు," అన్నది. గోవర్ధను డామెను వెంటబెట్టుకుని, ఒక గదినుంచి మరొకగదికి తీసుకుపోతూ, పేరుపేరునా ఆ గదుల్లో వుండేవారినిగురించి చెపుతూ, చివరకు జీవానందు డుండే గదిలోకి తీసుకుపోయాడు. ఆ గదిలో వుండేది జీవానందుడని తెలియగానే, శాంతి తనూ ఆ గదిలోనే నివాసం ఏర్పరచుకుంటా నన్నది గోవర్ధనుడితో. గోవర్ధను డందుకు అభ్యంతరం చెప్పబోయాడు. కాని శాంతి కోపదృష్టి చూసి, నోరు మెదపకుండా చల్లగా అక్కణ్ణించి జారుకున్నాడు.

శాంతి జీవానందుడు పడుకునే కృష్ణాజినంమీద కూచుని, ఆ పక్కనే వున్న పుస్తకాల్లోంచి, ఒక పుస్తకం తీసి చదవసాగింది. అంతలో జీవానందుడు గదిలోకి వచ్చి, తన భార్యను గుర్తించి, ఓ క్షణకాలం నిర్విణ్ణుడై, అంతలోనే తేరుకుని, "ఇదేమిటి, శాంతీ ?" అన్నాడు.

"శాంతి ! ఎవ రిక్కడ శాంతి ? నేను నవీనానందుణ్ణి," అన్నది శాంతి, భర్త ముఖంలోకి ఆశ్చర్యపడుతున్నట్టు చూస్తూ.

"ఏదో సర్వనాశనం అయేలావుంది. నీ వెందు కిక్కడి కొచ్చావు ?" అన్నాడు జీవానందుడు.

"ఆ సర్వనాశనం సంగ తేమిటో నాకు తెలియదు. నే నింతకుముందే సత్యానంద స్వామిచేత సంతానదీక్షితుడ నయ్యాను. మరోసారి చెపుతున్నాను; నాపేరు నవీనా నందుడు," అన్నది శాంతి.

"నువ్వు నవీనానందుడివి కావు, శాంతివి !" అంటూ జీవానందుడు ఆమెను సమీపించాడు.

శాంతి అతడికేసి చూస్తూ, "మీరు వస్తుతః దుర్మార్గులైనా అయివుండాలి, లేదా గంజాయిదమ్మయినా అధికంగా పీల్చివుండాలి. నేను స్త్రీ ననే అనుమానం కలగ గానే, మీకు మతి చలించటం ఆశ్చర్యంగావుంది. అలాంటివారు సంతానదీక్షితు లెలా అయారు ? భార్యతో ఏకాసనంమీద కూర్చోననిగదా, మీ ప్రమాణం ?" అన్నది.

జీవానందుడు భార్యకేసి చేయి చాచబోయినవాడల్లా, ఆమె ముఖంలోని నిశ్చలతా, గాంభీర్యతా చూసి, చప్పున వెనక్కు తిరిగి, గోడమూల పడివున్న కృష్ణాజినం ఒకటి తీసుకుని, దులిపి, అక్కడే పరుచుకుని, దానిమీద పడుకున్నాడు.

# 10

1768 వ సంవత్సరంలో ప్రారంభమైన వర్షాభావం మరిరెండు సంవత్సరాలు అలాగే సాగటంతో, వంగదేశంలో పంటలు పండక, లక్షలకొలది ప్రజలు కరువు కాటకాలకు గురై మరణించారు. 1771 వ సంవత్సరంలో తిరిగి వర్షాలు పడినై. చావగా మిగిలినప్రజలు పొలాలు సేద్యం చేసి పుష్కలంగా పంటలు పండించారు. కాని. యీసారి మరొకరకం రోగాలకు ప్రజలు బలి అయ్యారు. కరువుసంవత్సరాల్లో ఆకలములూ, కందమూలములూ తిని బతికినవారు, బాగా ధాన్యం పండటంతో మితిమీరి తిని రోగగ్రస్తులై మరణించారు.

దేశంలో ఎక్కడ చూసినా పాడుపడ్డ గ్రామాలూ శిధిలమైపోతున్న గృహాలూ కనబడసాగినై. దున్నేవాడు లేక వ్యవసాయయోగ్యమైన భూముల్లో అల్లీబిల్లి చెట్లు మొలిచి, పెద్దవై క్రమంగా చిట్టడవులకింద మారినై. ఒకప్పుడు సస్యశ్యామలమైన ఆ ప్రాంతాల్లో ఎలుగులూ, తోడేళ్ళూ విచ్చలవిడిగా తిరుగసాగినై.

అనావృష్టి పోవడంతో తిరిగి వంగదేశంలో అన్నిరకాల ధాన్యాలూ పండుతున్నవి. కాని జనాభా వాలాభాగం నశించటంతో వాటిని అనుభవించేవారు బహు కొద్దిమంది మాత్రమే. రైతులు పండించే ధాన్యాలను కొనేవారు లేరు. ఎంతధాన్యం యిస్తామన్నా, ఒక్కగానొక్క తెల్లరూపాయి చేతిలో పెట్టేవాడు లేడు. జమీందార్లు పన్నులు

ధనరూపంలో వసూలుచెయ్యాలని చూసి విఫలు లయ్యారు. పొలం వుండి శ్రద్ధగా సాగు చేసుకున్న రైతుదగ్గిర ధాన్యం కోకొల్లలుగా వున్నది. పొలం లేని బీదాబిక్కీ దగ్గిర డబ్బులేదు. అకారణంగా వాళ్ళు ముఠాలు కట్టి బందిపోట్లుగా తయారై, గ్రామాలమీద పడి దొరికినధాన్యం దోచుకోసాగారు.

ఆనందపురంలోని సంతాన సాంప్రదాయులకు యీ కల్లోలపరిస్థితి, నవాబు పరిపాలనమూ, ఆతడి నెత్తిన ఎక్కి కూచుని అధికారం చలాయిస్తున్న అంగ్లేయులనూ ఎదిరించటానికి మంచి అవకాశాలు కల్పించింది. వాళ్ళు భవానందుడి ఆజ్ఞ ప్రకారం గ్రామాలమీద పచ్చిపడి, ఏ గృహంలో అయినా తుపాకిగాని, పిస్తోలుగాని కనిపిస్తే వాటిని బలవంతంగా లాక్కుపోసాగారు. ఏ గృహంలోనైనా, మణులూ మాణిక్యాలూ ఒకమూలా, విరిగిపోయిన తుపాకీ ఒకమూలా పడివుంటే. ఆ మణులూ మాణిక్యాలూ వదిలి, విరిగిపోయిన తుపాకీని ముందు తీసుకురమ్మనమని భవానందుడి ఆదేశం.

సంతానులు యీ విధంగా చాలా ఆయుధాలు సంపాయించారు. గతంలోలాగా కాక, యిప్పుడు వారిలో ఎక్కువమంది తుపాకులూ, పిస్తోళ్ళూ ధరించి యుద్ధరంగానికి ఉరికేందుకు సన్నద్ధులవుతున్నారు. వారు చిన్ని చిన్న ముఠాలుగా బయలుదేరి ముస్లింలు నివసించే గ్రామాలమీద పడి, వాళ్ళ గృహాలకు నిప్పంటించి, వాళ్ళ ఆస్తిపాస్తులు సంతానధర్మాన్ని అంగీకరించిన హిందువులకు పంచసాగారు.

ఈ అరాజకాన్ని అరికట్టేందుకు నవాబు సంతానులమీదికి ముస్లిం సైనికదళాలను పంపాడు. కాని సుశిక్షితులైన సంతానులు వారిని ఓడించి, ఆయుధాలు లాక్కోసాగారు. ఈ గడ్డుపరిస్థితుల్లో ఆంగ్లేయుల అదృష్టంకొందికీ వారన్ హేస్టింగ్స్ కలకత్తాలో కంపెనీ గవర్నరయాడు.

వారన్ హేస్టింగ్స్ రాజనీతిజ్ఞుడేకాక, యుద్ధతంత్రంకూడా తెలిసినవాడు. వంగదేశమంతా కంపెనీ దివానీగిరికిందనే వున్నది. పేరు కొరకు నవాబంటూ వుండుగాక. నిజమైన అధికారం ఆంగ్లేయులదీ, కంపెనీదీ, గవర్నరైన వారన్ హేస్టింగ్స్‌దీ. 'హరేమురారే' అని నినాదాలిస్తూ సంతానులు యుద్ధరంగంలోకి దుమికేసరికే, ముస్లింసైనికులు రారెత్తి పారిపోతున్న సంగతి ఆయనకు తెలియవచ్చింది. సంతానులనూ, ఇతర బందిపోటు ముఠాలనూ అణచాలంటే, దేశీయసైన్యాలకు ఆంగ్ల సేనానుల నాయకత్వం అవసరం అని ఆయన గ్రహించాడు.

ఆరోజుల్లో ఆంగ్లేయులకు వర్తకసరుకులు నిల్వ వుంచేందుకు వంగదేశంలో చాలా చోట్ల కొటార్లు వుండేవి. వాటిచుట్టూ చిన్నచిన్న కోటలుండేవి. అలాంటి కొటార్లలో

ఒకటి శివగ్రాం అనేచోట వుండేది. దానికి రక్షకుడూ, నాయకుడూ డానివర్త్ అనే ఆంగ్లేయుడు.

ఈ డానివర్త్ తన ఆధీనంలో వున్న కోటకు చుట్టుపట్ల వున్న సంతాన సైనికులను అణిచేందుకు రెండుమూడు ప్రయత్నాలు చేసి, వాళ్ళచేత చావుదెబ్బలు తిని, కోట రక్షణలవెనుక దాగి, క్షణక్షణ గండంగా కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. ఈ శివగ్రామకొటారు పరిస్థితి కలకత్తాలో వారన్ హేస్టింగ్స్‌కు తెలిసింది. వెంటనే ఆయన కెప్టెన్ థామస్ అనేవాడి నాయకత్వంక్రింద కొంతసైన్యాన్ని డానివర్త్ రక్షణకూ, సంతానసైన్య నిర్మూలనకూ పంపాడు.

ఈ కెప్టెన్ థామస్ మహాగర్వి, పొగరుబోతు. రసాబాక్ దగ్గిర జరిగిన యుద్ధంలో తాను విజయం పొందా ననే అహంకారం యితడికుండేది. ఇతడు రెండు దేశీయ సైనిక దళాలను వెంటబెట్టుకుని శివగ్రామ కొటారుకు బయలుదేరాడు. అతడి సైన్యం వెంటవున్న బళ్ళమీద అనేకవిధములైన ఆహారపదార్థా లున్నవి. బియ్యం, గోధుమ పిండి, కోళ్ళు, సారాబుడ్లకు కొదువలేదు. సంతానులు నవాబు సైన్యాలను ఎదిరించి పారదోలటం, ముస్లిం గ్రామాలమీద పడి దోచుకోవటం చూసిన కోయ, పరదా, సవరల్లాంటి ఆటవికజాతులుకూడా ధైర్యంగా దోపిడీలూ, దార్లు కొట్టటంలాటి అరాజక కృత్యాలకు దిగారు; వాళ్ళు ఒక కొండమలుపులో థామస్ సైనికదళాలమీద హఠాత్తుగా వచ్చిపడ్డారు. కాని థామస్ సైనికుల తుపాకిదెబ్బలకు బెదిరిపోయి, గాయపడిన కొద్దిమందిని అక్కడే వదలి అడవుల్లోకి పారిపోయారు,

ఇది చాలా స్వల్పసంఘటన, కాని కెప్టెన్ థామస్ మాత్రం ఇది మహావిజయమన్నట్టు కలకత్తా గవర్నరుకు వుత్తరం రాశాడు : 'నేను 157గురు సిపాయీల దళంతో, విద్రోహులైన 3373 సంతాన సైనికులను ఎదుర్కొన్నాను. వారిలో 2143 మందిని చంపాను, 1223 మందిని గాయపరిచాను, ఏడుగురిని ఖైదీలుగా పట్టుకున్నాను.'

కొద్దిదినాల తరవాత కెప్టెన్‌థామస్ శివగ్రామ కొటారు చేరి, దానికి నాయకుడైన డానివర్త్‌ను కలుసుకున్నాడు. డానివర్త్‌కు కూడా సంతానులపై తన మహా విజయాన్ని గురించి కథలల్లి చెప్పాడు. డానివర్త్‌కు జరిగిన దేమిటో తెలుసు. థామస్ చేత దెబ్బతిని పారిపోయినవాళ్ళు విల్లంబులూ, ఈటెలూ మాత్రమే ఆయుధాలుగాగల ఆటవికులు. ఇంకా థామస్ సంతాన సైన్యాన్ని చూడనేలే దనుకున్నా డానివర్త్ యివేమీ థామస్‌తో చెప్పలేదు. అతడు బహులౌక్యుడు. మరికొద్దిరోజులు శివగ్రామ

కొటారులో వుంటే, సంతానసైన్యం బలదర్పా లేమిటో అతడికే తెలిసివస్తవని వూరుకున్నాడు.

ఒక వారంరోజులు ప్రశాంతంగా గడిచాయి. భవానందుడు తన సంతానసేనతో కెప్టెన్ థామస్‌ను ముఖాముఖి యుద్ధంలో ఎదిరించటమా, మానటమా అన్న సమస్యతో సతమత మవుతున్నాడు. సత్యానందస్వామి ఆనందమఠంలో లేడు. ఆయన పాదయాత్రమీద వెళ్ళాడు.

ఒకనాటి సాయంకాలంవేళ కెప్టెన్‌థామస్‌కు అరణ్యంలో వేటకు వెళ్ళాలనే సరదా పుట్టింది. అతడు డానివర్త్‌కు యీ సంగతి చెప్పాడు. డానివర్త్ తన చేతనైనంతలో థామస్‌కు అరణ్యంలో సంతానుల ప్రమాదం వుందని చెప్పిచూశాడు. ఆ మాటలు కెప్టెన్‌కు రుచించలేదు. ఇంకెక్కడి సంతానులు! ఆ మూకనంతా యిక్కడికి వచ్చేటప్పుడు కొండమలుపులో సర్వనాశనం చేసేశా నన్నా డతడు

ఇక చేసేది లేక డానివర్త్ కొందరు అనుచరులతో కెప్టెన్ థామస్ వెంట వేటకై అరణ్యానికి వెళ్ళాడు వేటగాళ్ళంతా ఆశ్వికులే. అరణ్యంలో కొద్ది దూరం వెళ్ళిన తరవాత వారికి వేటాడేందుకు అనేక రకాల జంతువులు కనిపించినై. లేళ్ళు, దుప్పులు, అడవి పందులు, నెమళ్ళు — యిలాంటివి ఎన్నైనా వున్నవి. కాని థామస్‌కు మాత్రం కొడితే పులినే కొట్టాలని వున్నది.

"కెప్టెన్! కొద్ది సేపట్లో చీకటిపడిపోతుంది. మనం తొందరగా అరణ్యం నుంచి బయటపడటం మంచిది," అన్నాడు డానివర్త్.

డానివర్త్ మాటలు వింటూనే కెప్టెన్ థామస్ వికవికా నవ్వి, గుర్రంమీదినుంచి ఒక్క ఎగురున కిందికి దూకి, "మీరు పోతూవుండండి. నేనీ గుర్రా న్నిక్కడ కట్టేసి, అరణ్యంలో కెళ్ళొస్తాను. పెద్దలు చెప్పినట్టు, 'తింటే టర్కీకోడినే తినాలి, కొడితే పెద్దపులినే కొట్టాలి.' అంటూ తుపాకీ భుజాన పెట్టుకుని, నేలబారుగా వున్న చెట్లకొమ్మలను తొలగదోసుకుంటూ ముందుకు వెళ్ళాడు.

దాదాపు ఒక ఫర్లాంగుదూరం వెళ్ళినతరవాత థామస్ పులికోసం ఒక చెట్టుచాటున నక్కివుండి, చుట్టూ కలయచూడసాగాడు. అతడి కెక్కడా పులిజాడ కనిపించలేదు. కాని ఒక చెట్టుపాదంలో గుట్టగా పోసినట్టు అడవిపువ్వులు పడివున్నవి. ఆశ్చర్యపోతూ థామస్ వాటికేసి పరీక్షగా చూస్తున్నంతలో, హఠాత్తుగా ఆ పూలగుట్టమాటునుంచి ఒక యువసన్యాసి ఆవులిస్తూ లేచినిలబడ్డాడు థామస్ వెంటనే అటుకేసి తుపాకీ గురిచేసి, ముందుకు నడుస్తూ, "ఏయ్ కదలకు! నువ్వు బందిపోటువు,

అవునా ?" అంటూ కేక పెట్టాడు. అతడికి రెండుమూడు దేశీయభాషలు మాట్లాడటం వచ్చును.

ఆ ప్రశ్న వింటూనే యువసన్యాసి, థామస్‌కేసి చిరునవ్వు మొహంతో చూసి "నేను బందిపోటునుకాను, సంతానుణ్ణి. నా సన్యాసిరూపం తెలియటంలేదా ?'' అని ప్రశ్నించాడు.

''నువ్వు సన్యాసివికాదు, విద్రోహివి. ఇక్కడే నిన్ను కాల్చేస్తాను," అంటూ థామస్ తుపాకీ గురిచేయసాగాడు. అదేసమయంలో యువసన్యాసి మెరుపులా ఒక్క ఎగురున థామస్‌మీదికి లంఘించి, తుపాకిని అతడిచేతిలోనుంచి దూరంగా పడేలా కొట్టాడు. ఆ ప్రయత్నంలో సన్యాసి తలనుంచి జడలుకట్టిన టోపా వూడి కింద పడింది. భుజాలవరకూ బిగించి కట్టుకున్న జింకచర్మం కిందికి దిగజారింది.

కెప్టెన్‌థామస్ తనఎదుట ఒక అపూర్వసుందరి నిలబడివుండటం చూసి నిర్విణ్ణుడై పోయాడు. అతని నోటివెంట మాట పెగలలేదు. ఆ సుందరి దూరంగా పడిన తుపాకీని చేతిలోకి తీసుకుని, థామస్‌కేసి చిరునవ్వు నవ్వుతూ, ''నేను స్త్రీని నిన్ను చంపాలని నాకులేదు. ఒక ప్రశ్న అడగదలిచాను. ఇక్కడి హిందువులం, ముస్లిములం కొట్టుకుంటున్నాం. మధ్య మీ రెందు కిక్కడికి వచ్చారు ? మీ దేశం మీరు వెళ్ళిపొండి," అన్నది

థామస్ అప్పటికి తేరుకుని, "ను వ్వెవరివి ? సంతానసైన్యంలోని వ్యక్తి వవునా, కాదా ?" అని ప్రశ్నించాడు.

"నా పేరు నవీనానందుడు. నాదీ సంతాన సాంప్రదాయమే," అన్నది శాంతి.

కెప్టెన్ థామస్ ఆమెకేసి ఆశగా చూస్తూ, "ఈ సంతానుల నందరినీ కొద్ది రోజుల్లోనే సర్వనాశనం చెయ్యబోతున్నాను. స్త్రీవి, నీ కెందు కాదుష్టులతో సాంగత్యం! నాతో రా, నిన్ను మాయింట వుంచుకుంటాను," అన్నాడు.

"ఉంపుడుకత్తెలాగానా !" అని అడిగింది శాంతి.

''ఏదో స్నేహంగా వుందాం. వివాహంమాట ఎందుకులే ?" అంటూ థామస్ నీళ్ళు నమిలాడు

శాంతి కోపంగా అతడికేసి చూస్తూ, "అల్లాఅయితే, నేనూ నిన్నొకటడుగుతాను, మా ఇంట్లో వుండే పెంపుడుకోతి చచ్చిపోయింది. అది వుండేకొట్టం ఖాళీగా వున్నది. అందులోకొచ్చి ను వ్వుంటావా, కోతిలా ?" అన్నది.

"గుడ్ గుడ్ ! నువ్వు మహాచమత్కారివి ; నువ్వు సంతానుల్ని వదిలి నాతో రా. యుద్ధంలో నీ మొగుడి కెలాగూ, నా చేతిలో చావుతప్పదు. అప్పుడు నీకు రక్షణ ఎవ రుంటారు ?" అన్నాడు థామస్.



"అలా అయితే సన్నిద్ధరం ఒక పందెం వేసుకుందాం. రెండు మూడురోజుల్లో మీకూ మాకూ ఎలానూ యుద్ధం తప్పదు. ఆ యుద్ధంలో మేం ఓడితే, నేను నీకు ఉంపుడు కత్తెగా వుంటాను. ఒకవేళ మేం జయిస్తే నువ్వు మాయింటికొచ్చి, కోతికొట్టంలో వుంటూ, నేను వేసే అరిటిపళ్ళు తింటావా ?" అని అడిగింది శాంతి.

"ఓహో, అరటిపళ్ళు మహా బావుంటాయి. నీదగ్గి రేమన్నా వున్నాయా ?" అని అడిగాడు థామస్ ముందు కొక అడుగువేస్తూ.

శాంతి తనచేతిలోని తుపాకీని దూరంగా విసిరికొడుతూ, "మీ దో అడవిజాతి ! నీతో నాకు సంభాష ణేమిటి ?" అంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

కెప్టెన్ థామస్, శాంతి వెళ్ళినవైపుకు చూస్తూ స్థాణువులా నిలబడిపోయాడు. కొద్దిక్షణాలతరవాత అతడికి మధురమైన స్త్రీ కంఠస్వరం పాడుతున్నపాట వినిపించింది.

రోకే కౌన్ జవానీ కీలహరే
హరే మురారే హరేమురారే

అంతలో ఎక్కణ్ణుంచో సారంగి ఒకటి ఆ పాటతో శ్రుతి కలిపి మోగసాగింది.

రోకే కౌన్ జవానీ కీలహరే
హరేమురారే హరేమురారే

ఉరా సమందర్ మే తుఫాన్
మేరీ నయీనావ్ బహతీహై
మాఘ్‌నే పతవార్ పకడ్‌లీ
రహా న దుఃఖకానామ్ నిశాన్
హరేమురారే హరేమురారే
దాలూకే తోడా హైబాంధ్
పూరీ కరతే మనకీ సాధ్
జ్వారీ చఢా రోకేగా కౌన్
హరేమురారే హరేమురారే

దట్టమైన ఆకులతో, కొమ్మలతో ఆకాశాన్నింటుతున్న ఒక టేకుమానుకింద నిల బడి సారంగి వాయిస్తున్న జీవానందుడు, శాంతి పాడుతూ తనను సమీపించగానే సారంగిని చెట్టుబోదెకు ఆనించిపెట్టి, "శాంతీ, చూడు, నీపాట నా హృదయాన్ని కలచివేసింది. ఒకానొకరోజున నేను వ్రతభగం చేశాను. దానికి ప్రాయశ్చిత్త మరణం తప్ప మరేమీలేదు. మనకు ఆంగ్లేయులతోనూ, వారి అనుయాయులైన నవాబు సైనికులతోనూ జరగనున్న మహాయుద్ధం సమీప మవుతున్నది. అందులో నా పాపానికి తగిన ప్రాయశ్చిత్తం చేసుకుంటాను," అన్నాడు.

శాంతి భర్త ముఖంలోకి జాలి పుట్టిపడేలా చూస్తూ, "మీ రింత నిరాశా హృద యులు కాకండి. నేను మీ ధర్మపత్నిని. మీ వెంట వుండి, మీ ధర్మనిర్వహణలో తోడ్పడేందుకే నే నీ అరణ్య వాసానికి వచ్చాను. నేనూ మీలాగే సంతానధర్మం స్వీకరించినదాన్నే. జరిగిపోయిన పొరపా టేమైనా వుండి, దానికి ప్రాయశ్చిత్త మే చేసుకోవలసివస్తే, నేనూ మీతోపాటు దానికి సిద్ధంగా వున్నాను. పరిస్థితుల ప్రభా వంవల్ల మన వివాహం యీ లోకంలో వమ్మయిపోయింది కాని ఆ పరలోకంలో మనం భార్యా భర్తలుగా సుఖజీవనం చేయగలమని నేను నమ్ముతున్నాను," అన్నది.

భార్యమాటలు జీవానందుడి కెక్కడలేని ఆనందాన్ని కలిగించినై. అతణ్ణి క్షణం వరకూ బాధించిన నిరాశా నిస్పృహలు దూరమయినై. అది గ్రహించిన శాంతి, జీవానందుడితో, "ఈ లోకంలోకూడా మన వివాహం నిష్ఫలం కాలేదని నే నిప్పుడు భావిస్తున్నాను మనం మనసారా పరస్పరం ప్రేమించుకుంటున్న భార్యాభర్తలం. ఇంక మనకు దేన్నిగురించి దిగులూ, విచారం? పాడండి వందేమాతరమ్!" అంటూ గొంతెత్తి పాడసాగింది. జీవానందుడుకూడా ఆమెతోపాటు పాడసాగాడు.

# 11

మహేంద్రసింహుడి భార్య అయిన కళ్యాణి విషం తిని మరణావస్థలో వుండగా ఆమెను భవానందుడు కాపాడి, గుర్రంమీద వేసుకుని నగరం చేర్చాడుగదా ? కాని ఆమె సజీవురాలని గాని, ఆమెను నగరంలోని ధనిక వితంతువైన గౌరీదేవి అనే ఆమె ఇంట వుంచానని గాని, భవానందుడు ఎవరితోనూ చెప్పలేదు. తనభార్య మరణించిందన్న నమ్మకంతోనే, మహేంద్రుడు సంతానధర్మం స్వీకరించాడు.

ఇది జరిగి దాదాపు నాలుగు సంవత్సరాలయింది. భవానందుడు రహస్యంగా అప్పుడప్పుడూ నగరానికి పోయి, కళ్యాణిని చూసివస్తున్నాడు. కెప్టెన్ థామస్ చేస్తున్న సైన్య సమీకరణా, యుద్ధప్రయత్నాలూ చూసిన తరవాత, సంతానులకు అతడితో యుద్ధం తప్పదన్న నమ్మకం బలపడింది. సంతానసేనల ముఖ్యనాయకుల్లో ఒకడైన భవానందుడు, యీ రానున్న యుద్ధానికి ముం దొకమారు కళ్యాణిని చూడా లనుకుని నగరం వెళ్లాడు.

భవానందుడు ఇంటికి రాగానే గౌరీదేవి అతడికి చాలామర్యాదలు చేసి, ఆనందమరం గురించిన వార్తావిశేషా లడిగింది. భవానందు డామెకు ఒకటిరెండు ముక్కలు చెప్పి, కళ్యాణి ఎలావున్నదని అడిగాడు. గౌరీదేవి అతడికి మేడమెట్లు చూపిస్తూ, "మీరు సంతాన ధర్మం స్వీకరించిన వీరవైష్ణవులు. విధవరాలిని నేను చెప్పటం ఎందుకు, వెళ్ళి చూసిరండి," అన్నది.

భవానందుడు మెట్లెక్కి మేడ పైఅంతస్థుకు పోయాడు. కళ్యాణి వుండే గది తలుపులు బార్లా తెరిచివున్నవి. అతడు గదిలో ప్రవేశించాడు. కళ్యాణి ఒక చింకిచాప మీద కూచునివున్నది. ఆమె ముందు కొన్ని పుస్తకాలూ, కాయితాలూ పడివున్నవి.

"కళ్యాణీ, ఆరోగ్యం ఎలా వుంటున్నది ? కులాసాయేగదా ?" అంటూ భవానందుడు గదిలో ప్రవేశించాడు.

కళ్యాణి అతడికేసి తలఎత్తి చూడకుండానే, "ఈ ప్రశ్న మాటిమాటికీ నన్నెందు కడుగుతున్నావో, నా కర్థం కావటంలేదు. నా శరీరారోగ్యంతో నీ కేంపని ?" అన్నది.

"నీ మృతదేహంలో జీవం పోసినవాణ్ణి, నేను. దాని మంచిచెడ్డల విషయం అడిగే హక్కు నా క్కాక మరెవరి కున్నది. ? సరే, చదు వెలా సాగుతున్నది ? వ్యాకరణ పాఠాలు ఎంతవరకు వచ్చినై ?" అన్నాడు భవానందుడు

కళ్యాణి, భవానందుడికేసి కొంత తీవ్రదృష్టితో చూస్తూ, "నేను వ్యాకరణ పాఠాలు వల్లె వేసే స్థితిలో లేను," అన్నది.

ఎందువల్ల ? మొదట్లో చదువంటె ఎంతో శ్రద్ధ చూపావుగా ! ఇప్పు డేం వచ్చింది ?" అని ప్రశ్నించాడు భవానందుడు కటువుగా.

"నీవంటి పండితుడూ, సంతానధర్మం అవలంబించినవాడుగూడా, పాపిష్టు డవుతున్నప్పుడు, నా కీ చదు వెందుకు. ? అదలా పోనీండి. నా భర్త ఎలావున్నాడు?" అన్నది కళ్యాణి.

"ఆ విషయమై ప్రశ్నించవద్దని నీకు చాలాసార్లు చెప్పాను. నీకు సంబంధించినంతవరకూ ఆయన మృతుడు తెలిసిందా ?" అన్నాడు భవానందుడు.

" నే నాయనకు మృతురాలను కావచ్చు కాని, ఆయన నాకు మృతు డెలా అవుతాడు ? ఇప్పు డాయన ఎక్క డున్నాడు ?" అన్నది కళ్యాణి.

"పదచిహ్న గ్రామంలో."

"అక్క డేం చేస్తున్నారు ?"

అక్క డాయన సంతాన సైన్యంకోసం దుర్గనిర్మాణం చేస్తు న్నాడు. తుపాకులూ, తూటాలూ తయారుచేయించి పంపుతున్నారు. ఆయన సహాయంవల్ల యీనాడు సంతాన సైన్యంలో ఎక్కువభాగం తుపాకీ దళాలుగా తయారయినై. ఆయన సంతానులలో సర్వశ్రేష్ఠుడు. మాకు కుడిభుజంవంటివాడు. నీవు విషం తిని ఆత్మహత్య చేసుకున్నావన్న నమ్మకం కలిగిన తరవాతనే, ఆయన సంతానవ్రతం స్వీకరించి, మా కీ విధంగా తోడ్పడుతున్నాడు," అన్నాడు భవానందుడు.

"కనుక, మరణం ఆయనకూ, ఆనందమఠానికూ్కడా ఎంతగానో వుపయోగించిందన్నమాట ! అయినా, నేను మరణించలేదు. నన్ను మరణావస్థనుంచి ఎందుకు కాపాడావు ?" అన్నది కళ్యాణి గాద్గదికంగా.

"నిన్ను నాకోసం కాపాడుతున్నానేమో నాకు స్పష్టంగా తెలీదు. నేను నీకు ప్రాణదానం చేసిన సమయంలో, నా హృదయాన్ని నీ పాదాలకు అంకితం చేశాను. ప్రపంచంలో నీఅంత సౌందర్యవంతురాలయిన స్త్రీ వుంటుందని నే నూహించలేక పోయాను. ఆ సంగతి తెలిసివుంటే, నేను సంతానధర్మం స్వీకరించేవాణ్ణికాదు. నీ ప్రేమాగ్నిలో నా వ్రతధర్మం కాలి బూడిద అయిపోతున్నది. నేను పరలోకంలో రౌరవాది నరకాలే అనుభవించవచ్చు. కాని, గత నాలుగేండ్లుగా నీకోసం నాహృదయం తపించిపోతున్నది. ఇంతకాలం ఆబాధ సహించాను. ఇక నావల్లకాదు. నీవు నా హృదయేశ్వరి వవుతావా ?" అంటూ భవానందుడు, కల్యాణిముందు మోకరిల్లాడు

హృదయంలో పెల్లుబికే కోపాన్ని తొక్కిపడుతూ కళ్యాణి, "ఓ దుష్టసన్యాసీ, లే ! సంతానధర్మం స్వీకరించినవాడు, ఇంద్రియాలకు వశుడైతే, అతడికి ప్రాయశ్చిత్తం మరణమే అని నేను విన్నాను; ఆ సంగతి నిజమేనా ?" అని ప్రశ్నించింది.



"అవును," అన్నాడు భవానందుడు వెలవెలపోతూ.

"నేను నీ కోర్కెను అంగీకరిస్తే, నీవా ప్రాయశ్చిత్తం చేసుకోగలవా?" అన్నది కళ్యాణి.

"తప్పక చేసుకుంటాను," అన్నాడు భవానందుడు.

"ఒకవేళ నేను నిరాకరిస్తే?"

"అప్పుడూ మృత్యువే నాకు ప్రాయశ్చిత్తం."

"అయితే, నేను నీ కోర్కెను నిరాకరిస్తున్నాను. వెళ్ళి మృత్యువాత బడు. ఆ పని ఎప్పుడు చేస్తావు?" అన్నది కళ్యాణి.

"జరగబోయే యుద్ధంలో," అంటూ భవానందుడు కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వాకిలికేసి నడవబోయాడు.

కళ్యాణి అతణ్ణాగమనిచెప్పి, "నా కుమార్తె సుకుమారిని, నా దగ్గరకు పంపగలవా? క్షేమంగా వున్నదా?" అని అడిగింది.

"జీవానందుడు ఆమె వున్న గ్రామానికి వెళ్ళి చాలారోజులైంది. ఆమెను నీ దగ్గిరకు పంపే ప్రయత్నం చేస్తాను," అంటూ భవానందుడు వాకిలివరకూ వెళ్ళి, వెనక్కు తిరిగి, "కళ్యాణీ, నేను చనిపోయినతరవాత, నీకు నా గురించిన జ్ఞాపకం వుంటుందా?" అని అడిగాడు.

"తప్పక వుంటుంది : వ్రతధర్మాన్ని భంగపరిచిన అధముణ్ణి నే నెలా మరిచిపో గలను ?" అన్నది కళ్యాణి.

భవానందుడు గబగబా వాకిలి దాటి, మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

* * *

భవానందుడు నగరం విడిచి, రాజమార్గంవెంట కొంతదూరం నడిచి, తరవాత అడ్డదారిన పోయి అరణ్యం ప్రవేశించాడు. ఆసరికి సూర్యా స్తమయమై కనుచీకటి పడింది. అరణ్యంలో కాలిబాటవెంట అనందమఠంకేసి నడుస్తున్న భవానందుడికి తనకుముందు కొద్దిదూరంలో మరొకవ్యక్తి నడిచి పోతూండటం కనిపించింది.

భవానందుడు వడివడిగా అడుగులువేస్తూ, "ఎవ రా వెళ్ళేది?" అని ప్రశ్నించాడు.

"బాటసారిని."

"వందే..." అన్నాడు భవానందుడు.

"...మాతరమ్" అన్న జవాబు వచ్చింది.

భవానందు డా వ్యక్తిని కలుసుకుని, "ఎవరు ? ధీరానందుడా ?" అన్నాడు.

"అవును, భవానంద్ !" అన్నాడు ధీరానందుడు.

"నువ్వు ఎక్కడికి కెళ్ళివస్తున్నావ్ ?"

"నిన్ను వెతకటాని కెళ్ళి..."

"నన్ను వెతికేందుకా ? ఏం పనిపడి ?" అన్నాడు భవానందుడు ఆశ్చర్యంగా.

"ఒక ముఖ్యమైనవిషయం చెప్పటానికి "

"ఏమి టది?"

"నువ్వు నగరంలో గౌరీదేవి ఇంటికి వెళ్ళావు. ఆ ఇంటి మిద్దెమీద కళ్యాణి అనే ఒ మోఘసుందరి వున్నది. ను వ్వామెను ప్రేమిస్తున్నావు. కలుసుకున్నావుకూడానా?" అన్నాడు ధీరానందుడు. రహస్యం మాట్లాడుతున్నట్టు.

"నువ్వు చెప్పినవన్నీ సత్యాలే. ఈ రహస్యం నీకేనా, మరెవరికైనా తెలుసునా ?" అని అడిగాడు భవానందుడు.

"నాకుతప్ప మ రేప్రాణికీ తెలియదు "

"అయితే, నిన్ను చంపటంవల్ల, నా కళంకాన్ని కప్పిపుచ్చుకోగలను."

"కావచ్చు."

"ఇంకేం, రా ! ఇక్కడ జనసంచారం ఏమీలేదు. మనిద్దరం కత్తులు దూసి పోరాడదాం నేను నిన్ను చంపానో, నా పాపం యీ లోకంలో బయటపడదు. ఒకవేళ

నువ్వే నన్ను చంపితే, నేను దుఃఖంనుంచి విముక్తుణ్ణవుతాను. కత్తి వున్నదా ?" అనడిగాడు భవానందుడు:

"కత్తి దగ్గిర లేకుండా, నీతో యిలాంటి సంభాషణ చేసే ధైర్య మెవరికున్నది ? సంతానుల్లో సంతానులు పోరాడుకోవటం నియమవిరుద్ధమైనా, ఆత్మరక్షణకోసం నేను నీతో పోరాడటానికి సిద్ధంగానే వున్నాను. కాని, ఇంకొక్కమాట...చాలా ముఖ్యమైంది. అదికూడా విను అవసరం అనుకుంటే, ఆ తరవాత కత్తులు దూద్దాం." అన్నాడు ధీరానందుడు.

భవానందుడు అప్పటికే ఒరనుంచి దూసినకత్తిని, ధీరానందుడి మెడమీద వుంచి, "నీవు పారిపోకుండా వుండేందుకే యీ పని చేస్తున్నాను. సరే, ఏమి టా ముఖ్య విషయం, చెప్పు," అన్నాడు.

"నీలాగే నేనూ, యీ సంతానధర్మం స్వీకరించి నానాయాతనా పడిపోతున్నాను. నువ్వు కళ్యాణిని పెళ్లాడి, ఎక్కడికైనా పారిపోయి సుఖపడు. నేనుకూడా అపనే చేయా లనుకుంటున్నాను. ఇంటికిపోయి పెళ్లాంబిడ్డలతోసుఖంగాకాలక్షేపం చేద్దామంటే, చాలాచిక్కులు వచ్చేలా వున్నవి. ఇప్పటికే సంతానుల్లో చాలామంది నన్ను ద్రోహి అని అనుమానిస్తున్నారు. నన్ను విశ్వాసఘాతకుడికింద జమకట్టి వాళ్ళు నన్ను చంప వచ్చు, కాని నీబోటివాడొకడు నాకు తోడుగా వుంటే, నాకీసంతానుల భయం వుండదు. ఏమంటావ్ ?" అన్నాడు ధీరానందుడు.

"నాకంత ప్రాముఖ్యత యిస్తున్నావేం, ధీరానంద్ ?" అన్నాడు భవానందుడు.

"ఇవ్వ కెలా తప్పుతుంది? సంతానసైన్యంలో ఎక్కువభాగం నీ ఆజ్ఞల్ని పాటిస్తారు. సత్యానందస్వామి మఠంలో లేరు. ఒకపని చేయొచ్చు. సేననంతా కూర్చుకుని, హఠాత్తుగా కెప్టెన్ థామస్‌మీద పడు. తప్పక నువ్వు జయిస్తావు. ఈ పరగణాఅంతకూ రాజుగా ప్రకటించుకో.కళ్యాణి నీకు మండోదరి అవుతుంది. నేను నీకు విశ్వాసపాత్రుడైన అనుచరుడుగా వుంటూ, నా భార్యాబిడ్డలతో సేవ చేస్తూంటాను. ఈ సంతానధర్మం వల్లకాటిపాలు కానీ ఏమంటావ్ ?" అన్నాడు ధీరానందుడు.

ఆ మాటలు వింటూనే భవానందుడు కత్తిని, ధీరానందుడి మెడమీదనుంచి తీసి, "ధీరానంద్ ! మనిద్దరం కత్తియుద్ధంలో చావో బతుకో తేల్చుకోకతప్పదు. నే నింద్రియవశుణ్ణయిపోయిన పాపి నవుగాక; సంతానధర్మ ద్రోహినిమాత్రం కాను. నువ్వు నన్ను ద్రోహినీ, విశ్వాసఘాతకుణ్ణీ కమ్మంటున్నావ్. ఇందుకు నిన్ను చంపకుండా వదలను. నువ్విప్పటికే ధర్మద్రోహివి !" అన్నాడు ఉద్రేకంగా.

ధీరానందుడు రెండడుగులు వెనక్కి వేసి, ఒరనుంచి కత్తి దూయబోయినవాడిలా నటించి, చప్పున వెనుదిరిగి పారిపోసాగాడు. భవానందుడు అతడివెంట పడబోయిన వాడల్లా ఠక్కున ఆగిపోయి, పారిపోతున్న ధీరానందుడికేసిచూస్తూ నిలబడిపోయాడు.

# 12

ఆరాత్రి భవానందుడు ఆనందమఠంలో ప్రవేశించలేదు అతడు సరాసరి మఠానికి కొంతదూరంలో దట్టమైన చెట్లమరుగున వున్న ఒక జీర్ణశిథిలాలయానికి వెళ్ళి, దాన్ని పైభాగాని కెక్కి కూచుని, తను చేసుకోవలసిన ప్రాయశ్చిత్త కర్మనుగురించి ఆలోచించసాగాడు.

ఆవిధంగా ఒడిరేయి గడిచి, వేకువజాము సమయ మయింది. భవానందు డింకా ఆలోచిస్తూనే వున్నాడు. అతడి హృదయం పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నది. శిథిలాలయ ప్రాంగణంలోనూ, దాని చుట్టూ గల దట్టమైన అరణ్యంలో మృగ, పక్షి జాతులు పరస్పరం చేసుకునే హననం, ఆకలిచేతా భయంచేతా అవి చేసే ధ్వనులూ - అత దేమీ వినిపించుకోవటంలేదు.

హఠాత్తుగా ఒక గుడ్లగూబ కర్ణకఠోరంగా అరుస్తూ భవానందుడి శిరస్సును తన్ని, వేగంగా చెట్లలోకి ఎగిరిపోయింది. ఆవెంటనే భవానందుడు తలను రెండుచేతులలోనూ పట్టుకుని, 'ఇది యమకింకరుడి హెచ్చరిక ! మృత్యువు నా కెంతో దూరంలోలేదు,' అనుకున్నాడు అదేసమయంలో ఆనందమఠం పైనుంచి మృదుమధురమైన శ్రుతిలో పాట వినిపించసాగింది ఆ కంఠస్వరం నవీనానందు డన్న పేరుతో మఠంలో నివశిస్తున్న జీవానందుడి ధర్మపత్ని శాంతిది.

జయ జగదీశ హరే
ప్రళయపయోధిజలే ధృతవానసివేదం
విహిత విచిత్ర చరిత్రమఖేదమ్
కేశవధృత మీనశరీర
జయ జగదీశహరే

శాంతి ప్రాతఃకాలసమయంలో భక్తజయదేవుని గీతాలు పాడుతున్నది

నిదశియజ్ఞ విధేరహహశ్ర్శృతిజాతం
సదయహృదయ దర్శిత పశుఘాతమ్
కేశవధృత వృద్ధశరీర
జయ జగదీశహరే

అంతలో మఠానికగొంతుక మేఘగర్జనవంటి శృతిలో యిలా పాడసాగింది,

మ్లేచ్ఛనివహ నిధనకలయసి కరవాలం
ధూమకేతు మివకిమ పికరాలం
కేశవ ధృత కల్కి-శరీర
జయ జగదీశహరే

గంభీరస్వరంలో లయబద్ధంగా పాడబడుతున్న ఆపాట వింటూనే భవానందుడు, ఆవేశపూరిత హృదయుడై లేచి నిలబడ్డాడు. ఆ కంఠస్వరం సత్యానందస్వామిది. ఆయన మఠానికి ఎప్పుడు తిరిగివచ్చారు ?

భవానందుడు త్వరత్వరగా శిధిలాలయ మూపురంమీదినుంచి దిగి, మఠంకేసి బయలుదేరాడు. మఠానికి తూర్పుదిశలో సంతానసైనికుల కవాతుకూ, ఆయుధ శిక్షణకూ ప్రత్యేకించిన మైదాన ప్రదేశంలో పదివేలమంది సంతానసైనికులు ఆయుధ ధారులై సోలుపులుగా నిలబడివున్నారు. అంతలో అక్కడికి సత్యానందస్వామి వచ్చాడు ఆయన రాక చూస్తూనే సైనికు లందరూ ముక్తకంఠంతో, "వందే మాతరమ్ !" అంటూ నినాదా లిచ్చారు.

సత్యానందస్వామి సంతాను లందరికీ కనబడేవిధంగా ఒక ఎత్తైన రాతిగుట్టమీద నిలబడి, చేతులురెండూ పైకెత్తి, "సంతాన వీరులారా, మీకు జయమగుగాక ! ఎవడు కేశి, మధు, ముర, నరకాది రాక్షస సంహారం చేశాడో, ఆ శంఖచక్ర గదాపద్మధారి వనమాలి యగు వైకుంఠనాధుడు మీకు మంగళకారి యగుగాక ! మీ బాహువుల్లో బలమూ, మనసులో భక్తీ నొసంగుగాక ! ఒకసారి మీరంతా ఏకకంఠంగా ఆయన మహిమలను ప్రస్తుతించండి !" అన్నాడు.

సంతాను లందరూ, 'జయ జగదీశహరే' అంటూ గంభీరస్వరముతో విష్ణునామ సంకీర్తన చేశారు. సత్యానందస్వామి అందరినీ మరోసారి ఆశీర్వదించి యిలా చెప్పాడు

"అందరూ శ్రద్ధగా వినండి. చాలా ముఖ్యమైనవిషయం చెప్పబోతున్నాను. ఈ మధ్య కెప్టెన్ థామస్ అనపడే విదేశీయ దుర్మార్గు డొకడు, మన సంతానుల్లో చాలా మందిని చంపాడు. సూర్యోదయం అయేందు కింకా కొద్దిఘడియల కాల మున్నది. మనం త్వరలో బయలుదేరి హఠాత్తుగా ఆ క్రూరుడిమీదపడి, వాణ్ణీ, వాడిసైన్యాన్నీ యమపురికి పంపుదాం. ఇది ఈశ్వరాజ్ఞ. కాని, ఒకసంగతి మీరు గుర్తు బాగాపెట్టు కోండి. శత్రువులకు ఫిరంగు లున్నవి. ఫిరంగులు లేకుండా మనం వాళ్ళతో యుద్ధం చేయడం అపాయకరం. పైగా యీ శత్రువులు వీరజాతికి చెందిన ఆంగ్లేయులు.

మనకు పదచిహ్నగ్రామ దుర్గంనుంచి పదిహేడు ఫిరంగులు సహాయంగా పంపబడు తున్నవి. అవి కొద్దిసేపట్లో వచ్చి చేరగలవు. అదుగో సూర్యోదయ మవుతున్నది..."

సత్యానందస్వామి మాట ముగించేలోపలే, సంతానసైన్యంమీదికి ధాం, ధఢాం అంటూ ఫిరంగిగుండ్లువచ్చి పడసాగినై. ఆ గుండ్లవర్షం కురిపించుతున్నది ఆంగ్లేయ శతఘ్నులు. సంతానసైన్యాన్నంతా ఒక్కదెబ్బతో సర్వనాశనం చేసేందుకు కెప్టెన్‌థామస్ పథకం వేసి, సూర్యోదయంవేళకు దాడి ప్రారంభించాడు.

ఈ అనుకోని పరిణామం చూస్తూనే సత్యానందస్వామి, జీవానందుణ్ణి పిలిచి, జీవానంద్, నువ్వా చెట్టెక్కి శత్రుబల మేపాటిదో చూడు." అని ఆజ్ఞాపించాడు.

జీవానందుడు అక్కడవున్న ఒక మహావృక్షంమీదికి చర్రున పాకిపోయి, "శతఘ్నులు పేల్చుతున్నది. ఆంగ్లసైనికులు. వారి వెనక కొంత ఆశ్వికదళం, కాలిబంట్లూ వున్నారు. దూరంగా నదివంతెనను దాటి కొందరు కాలిబంట్లు, ఎడమవైపు నుంచి అరణ్యంలో ప్రవేశించేందుకు పోతున్నారు," అని కేక వేశాడు.

సత్యానందస్వామి, జీవానందుణ్ణి చెట్టు దిగిరావలసిందిగా చెప్పి, సంతానసైన్యం కేసి తిరిగి, "మనం పదివేలమంది సంతానయోధులం వున్నాం. విజయం మనదే." అంటూ జీవానందుడితో, "జీవానంద్ ! శత్రువును ఎలా ఎదుర్కొని మట్టుపెట్టగలవో ఆలోచించు. నీవే యీ సంతాన సైన్యానికి సేనానివి," అన్నాడు.

అంతలో చెట్టుపైనుంచి ఒక కంఠం ఉత్సాహోద్రేకాలతో, "మహరాజ్ ; శత్రువుల ఫిరంగులు అరణ్యా న్నానుకునివున్న మైదానంలో వున్నవి," అంటూ కేక వేసింది.

సత్యానందస్వామి ఆ కేక వచ్చినవైపు తిరిగి, "నీ వెవరు ?" అని ప్రశ్నించాడు.

"నవీనానందుణ్ణి." అని జవా బిచ్చింది శాంతి.

అశ్వారోహితుడై వున్న జీవానందుడితో, సత్యానందస్వామి యిలా అన్నాడు : "జీవానంద్ ! ముందు శత్రువులనుంచి ఫిరంగులు వశపరచుకోవటం మనకు క్షేమం."

"తమ ఆజ్ఞ. నేనూ అదే ఆలోచిస్తున్నాను," అంటూ జీవానందుడు సంతానసైన్యానికి తనను అనుసరించి రావలసిందిగా ఆజ్ఞ యిచ్చాడు. ముందు గుర్రపు రౌతులూ, వెనక కాల్బలం ముందుకు కదిలింది. జీవానందుడు అరణ్యం దాటి మైదానం ప్రవేశించగానే, ఆంగ్లేయుల ఫిరంగులు మరింత తీవ్రంగా, గురిగా పేలసాగినై. సంతానుల్లో అనేకులు అరణ్యం అంచునే నేల కొరిగారు.

భవానందుడు జీవానందుడి దగ్గిరకు పరిగెత్తుకుంటూ వచ్చి, "జీవానంద్ ! మనం శత్రువులతో చేతులు కలపకుండానే సర్వనాశనం అయ్యే ప్రమాదం వున్నది.



ఈ చెట్లచాటున వుండి, శత్రువుమీద కాల్పులు సాగిద్దాం. మైదానంలో ప్రవేశించటమంటే, వాళ్ళ ఫిరంగిగుళ్ళకు ఆహుతి కావటమే," అన్నాడు.

"నీ వన్నది నిజం, కాని, సత్యానందస్వామి ఫిరంగుల్ని వశపరచుకో వలసిందిగా ఆజ్ఞాపించారు," అన్నాడు జీవానందుడు.

"అది సాధ్యమని నే ననుకోను. ఏదైనా స్వామి ఆజ్ఞ. ఆ కార్యభారం నన్ను వహించనీ. నివ్వక్కడే వుండి, చెట్లమరుగున దాగి శత్రువులను ముందుకు రాకుండా అటకాయించు," అన్నాడు భవానందుడు.

"ఆ పని నే చేయను. ఇది నా ప్రాయశ్చిత్త దినం! పోరాటంలో నేను మరణించవలసి వున్నది," అన్నాడు జీవానందుడు.

"నేనూ ప్రాయశ్చిత్తం చేసుకోబోతున్నాను. నేనూ యీ రోజునే మరణించవలసి వున్నది," అన్నాడు భవానందుడు.

"అయితే, ఇద్దరం ఒకేసారి రణరంగంలోకి పోదాం," అన్నాడు జీవానందుడు.

భవానంద, జీవానందులు 'వందేమాతరమ్!' అని నినాదం చేస్తూ మైదానం కేసి కదిలారు. వాళ్ళవెనక సంతానసేన కదిలింది. ఆంగ్లేయుల నాయకత్వంకింద వున్న తెలంగా, ముస్లిం, తెల్లసైనిక దళాలు తుపాకులు పేలుస్తూ, బాయొనెట్లు ఎత్తిపట్టుకుని సంతానులను ఎదిరించారు.

ఒకటి రెండు నిమిషాలు పోరు సాగేసరికే సంతానుల్లో చాలామంది ఫిరంగి గుండ్లకు క్షతగాత్రు లవటమో మరణించడమో జరిగింది. వారింకా ఫిరంగులకు చాలా దూరంలోనే వున్నారు. ఇది గమనించిన కెప్టెన్ థామస్ తన సైనికదళాల్లో ఒకదానిని, సంతానుల ఎడమ పార్శ్వము పైని దాడి చేయవలసిందిగా ఆజ్ఞాపించాడు.

ఈ విధంగా మొత్తం సంతానసేనను చుట్టుముట్టి దెబ్బ తీయాలనేది థామస్ ఎత్తుగడ. శత్రుదళం ఒకటి తమ ఎడమ పార్శ్వాన్ని సమీపిస్తున్న సంగతి భవానంద్ ముందుగా గుర్తించాడు. అతడికి కెప్టెన్ థామస్ పన్నాగం అర్థమయిపోయింది. ఆ విషయం జీవానందుడితో చెప్పాడు.

"అయితే, మనం అడవిలోకి తిరోగమిద్దాం," అన్నాడు జీవానందుడు.

"అది యిప్పుడు సాధ్యంకాదు. సైన్యమంతా ఒకేసారి, ఒకే వైపుకు తిరోగమించే ప్రయత్నం చేస్తే, శత్రువు మనను తేలిగ్గా చుట్టుముట్టగలడు. నా కింద కొద్దిసైన్యాన్నుంచి, నీవు నదిమీది వంతెనకేసి తిరోగమించు శత్రువు వెన్నంటకుండా నా దళంతో వారిని నేను నిలువరించగలను" అన్నాడు భవానందుడు

జీవానందుడు అందుకు అంగీకరించి ఒక సంతానదళాన్ని భవానందుడి నాయకత్వానికి ఒప్పజెప్పి, తక్కిన సేనతో నదిమీద వంతెనకేసి బయలుదేరాడు. ఈ విధంగా కెప్టెన్‌థామస్ పన్నిన చక్రబంధవ్యూహం విఫలమయింది కాని, థామస్ ఒకపట్టున ఓటమి అంగీకరించేరకంకాదు. సంతానసైన్యంలో ఎక్కువభాగం వంతెనకేసి తిరోగమించటం చూస్తూనే, అతడు కెప్టెన్‌హే అనేవాడితో, "నేను మూడు నాలుగువందలమంది సిపాయీలతో, మన ఎదుట నిలబడిన విద్రోహుల పని పడతాను. నువ్వు ఫిరంగులూ, మిగిలినవారినీ వెంటబెట్టుకుని, ఆ పారిపోజూస్తున్న విద్రోహులను వెంబడించు. వారి ఎడమపక్కకు లెఫ్టినెంట్ వాట్సన్ పోతున్నాడు. నువ్వు కుడిపక్కనుంచి ఎదిరించు. ముందుగా ఆ నదిమీది వంతెనను ఆక్రమించావంటే, ఈ విద్రోహులంతా మనకు వలలో చిక్కిన పక్షులు," అని చెప్పాడు.

'అతి దర్పేహతా లంకా' అన్నారు పెద్దలు. కెప్టెన్‌థామస్ సంతానసైన్యాన్నీ, వాళ్ళ ధైర్యసాహసాలనూ చాలా తక్కువఅంచనా వేశాడు. హే, వాట్సన్‌లు ఫిరంగులను వెంటబెట్టుకుని, జీవానందుడి సైన్యసమూహంకేసి కదలగానే, భవానందుడు 'వందేమాతరమ్!' అని నినాదా లిస్తూ, తన సహచరులతో ఉప్పెనలా వెళ్ళి కెప్టెన్ థామస్‌మీద పడ్డాడు. థామస్ వెంటవున్న కొద్ది సైన్యం ఆ తాకిడికి బదాబద లయింది. చాలామంది చచ్చారు. కొందరు గాయపడ్డారు. మిగిలినవారు

వెన్నిచ్చి పారిపోసాగారు. భవానందుడు తన గుర్రాన్ని, థామస్‌కేసి పరిగెత్తించి, అతణ్ణి గుర్రంమీదినుంచి పడదోసి, జుట్టు గుప్పెట బిగించాడు.

"కిరస్తాన్‌సాహెబ్ ! నేను నీ ప్రాణాలు తీయదలచలేదు. ఆంగ్లేయులు మాకు శత్రువులుకారు. మీరు ముస్లింలకు సహాయపడేందు కెందు కొచ్చారు ? సరే, నీకు ప్రాణదానం చేస్తాను. కాని, ప్రస్తుతం నీవు మా ఖైదీవి. ఆంగ్లేయులకు జయమగు గాక ! మీరూ, మేమూ మిత్రులం," అన్నాడు భవానందుడు.

కెప్టెన్‌థామస్‌కు రెండుమూడు దేశీయభాషలు మాట్లాడటం బాగా వచ్చును. అయినా అతడు భవానందుడి కేమీ జవాబివ్వక, అతడి పట్టునుంచి బయటపడేందుకు అటూ ఇటూ గింజుకోసాగాడు. భవానందుడు ఇద్దరుముగ్గురు సంతానసైనికులను పిలిచి, థామస్‌ను బంధించి, గుర్రంమీద పెట్టి కట్టవలసిందిగా ఆజ్ఞాపించాడు

# 13

సంతానసైన్యంలో ఎక్కువభాగాన్ని వెంటబెట్టుకుని, నదిమీది వంతెనకేసి పోయిన జీవానందుడు అక్కడ చిక్కులోపడ్డాడు. కెప్టెన్‌హే, లెఫ్టినెంట్ వాట్సన్‌లు తమ దళాలతో వంతెనకు యిరువైపులా కాల్పులు సాగించటమేగాక. ఒక ఫిరంగిని వంతెనమీదికే గురిచేశారు. ఇటువంటి ప్రమాదసమయంలో భవానందుడు తన సంతాన దళాన్ని వెంటబెట్టుకుని విజయధ్వానాలు చేస్తూ, జీవానందుడి దగ్గరకు వచ్చాడు. అక్కడ ధీరానందుడుకూడా వున్నాడు.

భవానందుణ్ణి చూస్తూనే, జీవానందుడు అతడిదగ్గరకు వచ్చి, "భవానంద్ : మనం కెప్టెన్‌థామస్ పన్నినవలలో చిక్కుకున్నామని భయంగావుంది. ఇప్పటికే మన సంతానుల్లో కొందరు భయపడి, ఆ మామిడితోటలోకి పోయి దాక్కున్నారు. మిగిలిన వాళ్ళను వంతెన దాటమని ఆజ్ఞాపించటం ప్రమాదకరమని నేను భావిస్తున్నాను. ఆ గట్టుపక్కన గుళ్లు పేలుస్తున్న ఫిరంగిని చూశావా ? అది మన సైన్యం వంతెన దాటేటప్పుడు దాన్ని కూల్చి, అందరినీ జలమరణంపాలు చేయగలదని నాకు తోస్తున్నది," అన్నాడు.

భవానందుడు, నది గట్టుపక్క నున్న ఫిరంగికేసి చూశాడు. జీవానందుడు చెప్పిన ప్రమాదం దానివల్ల వాటిల్లగలదని అతడికి నమ్మకం కలిగింది. వెంటనే అతడు కత్తి దూసి, "జీవానంద్, ధీరానంద్ ! రండి, మనం ఆ ఫిరంగిని వశపరుచుకుందాం," అంటూ అటుకేసి పరిగెత్తాడు. జీవానంద్, ధీరానందులేకాక, మరికొందరు సంతాన సైనికులుకూడా ఫిరంగిని పట్టుకునేందుకు 'వందేమాతరమ్ !' అంటూ ముందు కురికారు.

హఠాత్తుగా జరిగిన యీ దాడి చూసి, ఫిరంగిని పేల్చుతున్న కొద్దిమంది ముస్లిం సైనికులూ, వాళ్ళమీద నాయకత్వం వహించి నడుపుతున్న ఆంగ్లేయుడూ నివ్వెర పోయారు. వాళ్లు పారిపోవటమా? నిలిచి యుద్ధం చేయడమా? అన్న వూగిసలాటలో వుండగానే, భవానందుడు పులిలా వాళ్ళమీదకు లంఘించి, తుపాకీబాయొనెట్‌తో ఇద్దరు ముగ్గుర్ని పొడిచాడు. మిగిలిన శత్రువులపని, వెంటవున్న యితరసంతానులు పూర్తి చేశారు.

భవానందుడు ఫిరంగిని వంతెనకేసి లాక్కుపోవలసిందిగా సైనికులను ఆజ్ఞాపించి, అది వంతెనముఖం చేరగానే, అక్కణ్ణించి కెప్టెన్ హే నడుపుతున్న సైనికులమీద గుళ్ళవర్షం కురిపించాడు. తమ చేతుల్లో ఒక ఫిరంగి పడినదన్న సంగతి తెలియగానే, మామిడితోటలో దాక్కున్న సంతానులూ, పారిపోతున్న సంతానులూ ఒక్కుమ్మడిగా నినాదాలిస్తూ, లెఫ్టినెంట్ వాట్సన్ నడుపుతున్న ముస్లిం సైనికులమీద పడ్డారు.

యుద్ధం యీదశలో వుండగా ఒక మహాద్భుతం జరిగింది. అరణ్యంవైపునుంచి ఒకేసారిగా పదిహేడు ఫిరంగులు హే, వాట్సన్ సేనలమీద గుళ్ళు కురిపించాయి. ఆఫిరంగులు పదచిహ్నగ్రామ దుర్గంనుంచి, మహేంద్రసింహుడు స్వయంగా వెంట బెట్టుకు వచ్చినవి. వాటి నాయకుడుకూడా అతడే.

క్షణంలో యుద్ధపరిస్థితి తారుమారైంది. అరణ్యంవైపునుంచి కాల్పులు రావటం చూస్తూనే, థామస్ నాయకత్వంకింద వచ్చిన సేనలోని, జమీందారీ సైనికులు, ముస్లింసైనికులు, తెల్ల, నల్లసిపాయిలందరూ యుద్ధరంగం విడిచి పారిపోసాగారు. గాయపడినవాళ్ళు ఆర్తనాదాలు చేస్తూ విలవిల తన్నుకోసాగారు.

పరిస్థితి యిలా విషమించగానే, హే, వాట్సన్‌లు భవానందుడికి తాము ఓడుపోయామనీ, యుద్ధరంగంనుంచి సురక్షితంగా వెళ్ళిపోయేందుకు అవకాశం యివ్వవలసిందనీ వార్త పంపారు. భవానందుడు జీవానందుడి అభిప్రాయం అడిగాడు.

"మనకు నిజమైన శత్రువులు ఆంగ్లేయులుకాదు. యుద్ధవిరమణ చేసి పోదలిస్తే, వాళ్ళను పోనిద్దాం," అన్నాడు జీవానందుడు. ధీరానందుడుకూడా దాన్ని బలపరిచాడు.

యుద్ధవిరమణకు భవానందు డంగీకరించక, "శత్రువులతో ఏరకమైన రాజీకీ నే నొప్పను. ఇది నాప్రాయశ్చిత్తదినం. నేనిక్కడే మరణించవలసివున్నది. మీ రిద్దరూ చూస్తూవుండండి. అదుగో, అక్కడ ఫిరంగిచాటున నిలబడి ఆత్మరక్షణ చేసుకుంటున్న ఆంగ్లేయుల్ని చూశారుగదా? వాళ్ళందర్నీ యీకత్తికి ఎరచేస్తాను," అంటూ బయలుదేరాడు. ధీరానందుడుకూడా అత న్ననుసరించాడు.

పాతికా ముప్ఫైమంది ఆంగ్లేయులు ఒక ఫిరంగివెనక నిలబడి, కత్తులు దూసి పోరాడేందుకు సిద్ధంగా వున్నారు. కాల్చేందుకు గుండ్లు లేకపోవటంతో ఫిరంగి నిరర్థకమైంది. భవానందుడూ, ధీరానందుడూ వాళ్ళను సమీపించేంతలో, కెప్టెన్‌థామస్ బందీగా కట్టబడిన గుర్రం అటుగావచ్చింది. భవానందుడు, థామస్‌మీదికి కత్తి ఎత్తబోయినవాడల్లా ఆగి, "ధీరానంద్ ! నువ్వు నా వెంట ఎందుకు? నువ్వు ద్రోహివి, విశ్వాసఘాతకుడివి ! ఈ సంతానసైన్యం వెంట వుండి ప్రాణం పోగొట్టుకుంటావా? హాయిగా ఇంటికి పోయి భార్యాబిడ్డలతో సుఖంగా బతుకు," అన్నాడు.



"నేను ద్రోహినికాను, విశ్వాసఘాతకుణ్ణీకాను, భవానంద్ ! సత్యానందస్వామి పంపగా, నీమీద వేగు చేసేందుకు నగరం వచ్చి, నువ్వు కళ్యాణితో మాట్లాడిన సంగతు లన్నీ తెలుసుకున్నాను. ఆ తరవాత పరీక్షలో నువ్వే నెగ్గావు," అన్నాడు ధీరానందుడు.

ఆమాటలు వినగానే భవానందుడిలో ఎక్కడలేని ఆనందం కలిగింది. అతడు కత్తి పైకెత్తి, కెప్టెన్ థామస్‌కేసి పళ్ళు కొరుకుతూ చూసి, "ఈ యుద్ధాని కంతకూ కారకుడైన యీ దుర్మార్గుణ్ణి చంపి నేను చస్తాను," అన్నాడు.

కెప్టెన్‌థామస్ గుర్రంమీదినుండి పెద్దగా గొంతెత్తి, "ఆంగ్లేయులారా ! మీరు

యీ విద్రోహులకు లొంగకండి ! మన ప్రాచీన కీర్తిప్రతిష్ఠలు నిలపండి ! ఏసుక్రీస్తు మీద ఒట్టుపెడుతున్నాను. ముందు నా తల నరికి, తరవాత యీ ద్రోహుల్ని మట్టు పెట్టండి,'' అని అరిచాడు.

ఆ వెంటనే ఒక ఆంగ్లసైనికుడు పేల్చిన తుపాకీగుండు కెప్టెన్ థామస్ తల మీద తగిలింది. అతడితల పక్కకు ఒరిగిపోయింది. ఆంగ్లసైనికులు భయంక రంగా బొబ్బలిస్తూ భవానంద, ధీరానందులపైకి వచ్చిపడ్డారు. భవానందుడు సింహంలా ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని, 'వందేమాతరమ్' అంటూ దరదిశలు మర్మోగేలా ఒక పెద్ద కేకపెట్టి. తన కత్తితో ఇద్ద రాంగ్లుల తలలు నరికి, నలుగు రైదుగురిని గాయపరిచాడు. కాని, ఒక ఆంగ్లసైనికుడు విసిరిన కత్తివేటుకు అతడి ఎడమచెయ్యి తెగిపోయింది. అయినా భవానందుడు 'వందేమాతరం, హరే మురారే' అంటూ ఒంటిచేత్తోనే ఆంగ్లసైనికులతో పోరాడసాగాడు.

పరిస్థితి విషమిస్తుందని గుర్తించిన జీవానందుడు కొందరు సంతానులతో వచ్చి, ఆంగ్లసైనికులను ఎదుర్కొన్నాడు. అంతలో ఒక శత్రువు విసిరిన కత్తి భవానందుడి కుడిచేతినికూడా ఖండించివేసింది. 'వందేమాతరం' అంటూ అతడు కిందపడి పోయాడు.

రెండుచేతులూ తెగి నేల కొరిగిన భావానందుణ్ణి చూడగానే, ధీరానందుడి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. అతడు భవానందుడి పక్కగా నేలమీద మోకరిల్లి, "భవానంద్ ! నీ వీనాడు మరణిస్తావని సత్యానందస్వామి నాతో చెప్పారు. అంతేకాదు, మృత్యు సమయంలో నీతో వా రొకమాట చెప్పమన్నారుకూడా. ని న్నాయన పరలోకమున వైకుంఠప్రాప్తి కలిగేలా ఆశీర్వదించారు," అన్నాడు.

భవానందుడి పెదాలమీద చిరునవ్వు తాండవించింది. అతడు తలఎత్తి చుట్టూ కలయచూసి, "ఆంగ్ల సైనికు లందర్నీ జీవానందుడు తుదముట్టించాడు. విజయం సంతానులది. నా యీ మృత్యుసమయంలో సంతాను లందిరూ ఒక్కసారి, 'వందే మాతరమ్' అని పాడకోరుతున్నాను." అన్నాడు

జీవానంద, ధీరానందుల ఆజ్ఞ కాగానే మొత్తం సంతానసైన్య మంతా ముక్తకం ఠంతో 'వందే మాతరమ్' అంటూ పాడారు. భవానందుడుకూడా పాడేందుకు ప్రయ త్నించాడు. కాని, అప్పటికే అతడిప్రాణం కడబట్టుతున్నది. జీవనాడులు మందగి స్తున్నవి. అతడు లోలోపలే వందేమాతరమ్ అని పాడుకుంటూ, విష్ణు పదధ్యానం చేస్తూ ప్రాణాలు వదిలాడు.

యుద్ధం పరిసమాప్తమయింది. సంతానసైన్యం యీ భయంకర యుద్ధంలో ఆంగ్ల, ముస్లిం, తెలంగా సిపాయిలను చిత్తుగా ఓడించింది. జీవానందుడు యిదే అదనుగా రాజధానీ నగరంమీద దాడి చేసి, దాన్ని ఆక్రమించుకుందా మనుకున్నాడు. సత్యానందస్వామికూడా అందుకు అంగీకరించాడు. కాని, తీరా సైన్య సమీకరణకు ప్రయత్నిస్తే, అది అసాధ్య మని తేలిపోయింది. విజయోన్మత్తులైన సంతాన సైనికులు గుంపులు గుంపులుగా బయలుదేరి, డోళ్ళు, భేరీలు, సన్నాయి, కొమ్ము బూరల వాద్యాలమధ్య నాట్యం చేస్తూ అరణ్యమంతా అల్లకల్లోలం చేస్తున్నారు. కొందరు శత్రుగ్రామాలమీద పడి దోచుకునేందుకు పోయారు.

సత్యానందస్వామి, మహేంద్రసింహుణ్ణివెంటబెట్టుకుని మైదానం వదిలి అరణ్యంలో ప్రవేశించాడు. అక్కడతడు ఒక చెట్టుకింద కూచుని, మహేంద్రుడితో, "మహేంద్రా! సంతానులు విజయు లయ్యేవరకూ భార్యాబిడ్డల ముఖం చూడనని, నీవు చేసిన ప్రతిజ్ఞ నిలబెట్టుకున్నావు. ప్రస్తుతానికి మనం జయించాం. ఇక నీవు తిరిగి గృహస్థువు కావచ్చును," అన్నాడు.

మహేంద్రుడు అశ్రుపూరితనేత్రాలతో, సత్యానందుడికి నమస్కరించి, "స్వామీ నేనెలా గృహస్థును కాగలను? కుమార్తె బతికిఉందని తప్ప, ఎక్కడ వున్నదో నాకు తెలియదు. భార్య ఆత్మహత్య చేసుకున్నది," అన్నాడు.

"నీ భార్య కళ్యాణి సజీవురాలు. కుమార్తె సుకుమారికూడా క్షేమంగానే వున్నది" అంటూ, ఆ సమయంలో అటుకేసి వస్తున్న నవీనానందుణ్ణి చూసి, దగ్గరకు పిలిచి, "నవీనానంద్! మహేంద్రసింహుణ్ణి వెంటబెట్టుకుపోయి, ఆయనకు భార్యాబిడ్డల వృత్తాంతమంతా చెప్పి, వారందరూ తిరిగి కలుసుకునే ఏర్పాట్లు చెయ్యి," అన్నాడు.

మహేంద్రసింహుడు, నవీనానందుడి వెంట వెళ్ళిపోయాడు. సత్యానందస్వామి తన శిరస్సుతో భూమాతను తాకి, ధ్యాననిమగ్నుడయాడు. ఆ సమయంలో కాషాయాంబరధారి అయిన ఒక మహామహుడు అక్కడికి వచ్చి, సత్యానందుని శిరస్సు తాకి, "సత్యా! నేను వచ్చాను!" అన్నాడు.

సత్యానందస్వామి తల ఎత్తి ఆ కాషాయాంబరధారికేసి భక్తి ప్రపత్తులతో చూసి, పాదాలు స్పృశించి, "హే ప్రభో! ఈ రోజుకు నన్ను క్షమించండి. రాబోయే, మాఘపౌర్ణమినాడు, మీ ఆజ్ఞ నెరవేరుస్తాను," అన్నాడు.

# 14

ఉత్తర వంగదేశంలో ముస్లింల, ఆంగ్లేయుల పరిపాలన అంతమయ్యింది. కాని, యీ నిజాన్ని వారెవరూ అంగీకరించలేదు. ఎవరో బందిపోట్లు కొందరు హరినామ

స్మరిణ చేస్తూ, గ్రామాలను దోచుకుంటున్నారనీ, వాళ్ళను త్వరలోనే శిక్షించగలమనీ వారు చెప్పసాగారు.

కాని గవర్నర్ వారన్ హేస్టింగ్స్‌కు నిజ మేమిటో క్షుణ్ణంగా తెలుసు. ఆనందమఠం నాయకత్వాన ప్రబలమైన వైష్ణవసేన ఒకటి తయారైం దనీ, వాళ్ల ముఖాముఖి యుద్ధంలో ఆంగ్లేయుల నాయకత్వంకింద వున్న సేనను చిత్తుగా ఓడించా రనీ అత డెరుగును. ఈ కారణంగా, హేస్టింగ్స్ సమర్థుడైన మేజర్ ఎడ్వర్డ్స్ అనే వాడి నాయకత్వాన గొప్ప సేనను సంతానులపైకి పంపాడు.

ఈ మేజర్ ఎడ్వర్డ్స్, సంతానసైన్యాన్ని గురించిన ఆచూకీకోసం కొందరు వేగులవాళ్ళను నియమించాడు. వాళ్లు కొద్దిరోజుల్లోనే అతడి కవసరమైన సమాచార మంతా పోగుచేసుకువచ్చారు. పదచిహ్నగ్రామంలో వారి కొక కోటా, శస్త్రాగారం, ధనాగారం వున్నది. సంతానసైన్యంలో అక్కడ ఎక్కువభాగం కేంద్రీకరించబడి వున్నది.

ఎడ్వర్డ్స్ పదచిహ్న దుర్గాన్ని పట్టుకోవటం గురించి పథకాలు వేయసాగాడు. కాని, ఇంతలో అతడి కొక వింతసమాచారం తెలిసింది. తాను సైన్యంతో విడిసిన నదీతీరంలో, మాఘపౌర్ణమికి ఒక గొప్ప వుత్సవం జరుగుతుంది. దానికి వైష్ణవు లంతా వస్తారు. ఆవిధంగా సంతాను లందర్నీ అక్కడే పెద్ద యుద్ధ మేమీ లేకుండా సర్వనాశనం చేయవచ్చు.

సంతానులకు మేజర్ ఎడ్వర్డ్స్ వెంటవున్న సైన్యం యొక్క బలాబలాలను గురించి ఏమీతెలియదు. ఒక ఆంగ్లేయుడు కొందరు సైనికులతో నదీతీరాన డేరాలు వేసుకుని వున్నాడనిమాత్రం వాళ్ళల్లో కొంద రెరుగుదురు. అంతేకాని, ఎడ్వర్డ్స్ తమ నాశనానికే అక్కడ విడిసి వున్నాడని వా రెరుగరు.

మహేంద్రసింహుడు తన భార్యాబిడ్డలతో పదచిహ్న దుర్గంలో నివశిస్తున్నాడు. దుర్గరక్షణభారం అతడిదే. మాఘపౌర్ణమి ఉత్సవాలకోసం అతడు దుర్గరక్షణకు నియమించిన సైన్యంలో ఎక్కువ భాగాన్ని వెంటబెట్టుకుని నదీతీర్థ ప్రదేశానికి బయలుదేరాడు.

సరిగా ఉత్సవం జరిగేనాటి రాత్రి సాయంసంధ్యవేళ జీవానందుడికి, మేజర్ ఎడ్వర్డ్స్ పన్నాగంగురించి తెలియవచ్చింది. అందులో వున్న సత్య మేంటో తేల్చుకు నేందుకు జీవానందుడు కొందరు సంతానులను, నవీనానందుడి నాయకత్వం కింద వేసుకుపంపాడు. వాళ్ళు, ఎడ్వర్డ్స్ సైన్యం విడిసిన ప్రదేశాన్ని, ఆ పక్కనే వున్న

ఒక కొండగుట్టమీదినుంచి పరీక్షించి చూసి, అక్కడ జరుగుతున్న సైన్య సమీకరణంతా గమనించి, ఆ వార్త జీవానందుడికి చెప్పారు.

వెంటనె జీవానందుడు నమ్మకస్తులైన సంతానుల్లో కొందరిని, సంతానసైనికులందర్నీ పోగుచేసుకువచ్చేందుకు పంపాడు. వారికి సంతానసైనికుల్ని ఒకచోట చేర్చటం చాలా కష్టమైంది. విజయగర్వితులైన సంతానసైనికులు గ్రామాలమీదికి వెళ్ళి, "మేం బ్రజవాసులమైన గొల్లలం! గోపిక లెక్కడ!" అంటూ ఇళ్ళల్లో దూరి గలభా చేయసాగారు. కొందరు అక్కడ దొరికిన పెరుగూ పాలూ ఆరగించసాగారు. మరికొందరు హల్వాదుకాణాలమీద పడి, తిని, తాగి విష్ణుసంకీర్తన చేయసాగారు.

చీకటిపడింది. పిండారబోసినట్టు వెన్నెల కాస్తున్నది. జీవానందుడు కొద్దిమంది తన అనుచరులతో కొండగుట్టమీది కెక్కి, మేజర్ ఎడ్వర్డ్స్ ప్రయత్నా లెలా వున్నాయో చూడసాగాడు. ఆంగ్లేయుల గుడారాల్లో కలకలం బయలుదేరింది. కొందరు ఆశ్వికులు కొండగుట్టకేసి వచ్చి, చేతులు పైకెత్తి వూపుతూ ఏమో మాట్లాడుకోసాగారు. ఆ వెంటనే కొన్ని ఫిరంగులూ, కాల్బలమూ గుట్టదిగువకు వచ్చినై.

ఇదంతా గమనించిన జీవానందుడికి, ఆంగ్లేయులు కొండగుట్టను వశపరుచుకునేందుకు బయలుదేరారని అర్థమైంది. నదికి వెళ్ళే రాజమార్గం ఆగుట్ట దిగువగా వెళ్ళుతుంది. గుట్టను ఆక్రమించి. అక్కడ ఫిరంగులు పెడితే, ఆ మార్గాన్ని బంద్ చేయటమేగాక, చాలా దూరంలో వున్న శత్రువులమీదకూడా గురిగా కాల్పులు చేయవచ్చు.

జీవానందుడు పరుగుపరుగున కొండగుట్ట దిగివచ్చాడు. ఆసరికి గ్రామాలమీదికి వేటకుపోయిన సంతానసైనికుల్లో చాలామంది అక్కడికి వచ్చి చేరారు జీవానందుడు వారికి పరిస్థితి వివరించి, "గుట్టకావల ఆంగ్లసైన్యం వున్నది. ఎవరీ గుట్టను ముందాక్రమించుకుని, అక్కడ ఫిరంగులను నిలుపుతారో, వారిదే విజయం. వందేమాతరమ్! అనండి," అంటూ ప్రోత్సహించాడు.

సంతానసైన్యం ఒకేగొంతుతో 'వందేమాతరమ్' అంటూ నినదించింది. అదే సమయంలో, ఆంగ్లేయుల ఫిరంగులు నాలుగైదు 'ఢాం, ఢఢాం' అంటూ గుట్టమీదికి గుండ్లు పేల్చినై. 'హరేమురారే' అంటూ జీవానందుడు కత్తిదూసి, గుట్టమీదికి పరిగెత్తసాగాడు. అంతలో పదచిహ్నంనుంచి ఉత్సవానికి బయలుదేరిన మహేంద్రుడి సంతానసైన్యంకూడా అక్కడికి వచ్చిచేరింది. క్షణంలో మహేంద్రుడు పరిస్థి తేమిటో

తెలుసుకున్నాడు. అతడు సంతానులను యుద్ధానికి పురిగొల్పుతూ, జీవానందుడివెంట గుట్ట నెక్కసాగాడు.

ఇంతలో ఆంగ్లేయసైన్యం, హుర్రే, హుర్రే అని అరుస్తూ బాయొనెట్లతో గుట్టనుచుట్టివచ్చి సంతానసైన్యంమీద పడింది. సంతానులు విహ్వాలులై వెన్నుచూపి పరిగెత్తసాగారు. జీవానందుడుమాత్రం 'హరేమురారే' అని నినాదా లిస్తూ తన కెదురైన శత్రుసైనికులను కత్తికి బలిచేస్తూ, గుట్ట ఎక్కసాగాడు.

మహేంద్రసింహుడు పారిపోతున్న సంతానసైనికులతో, "సంతానులారా, ప్రాణభయంతో పారిపోయేముందు, ఒక్కసారి మహావీరుడైన జీవానందుడికేసి చూడండి :" అని కేక వేశాడు. శత్రువ్యూహంలో అభిమన్యుడిలా జొరబడి, శత్రువులను ఊచకోత కోస్తున్న జీవానందుణ్ణి, అతడిపక్కన నవీనానందుణ్ణి చూస్తూనే, సంతానులు తిరిగి ధైర్యాన్ని కూడగట్టుకుని, 'వందేమాతరమ్' అంటూ శత్రువులతో కలియబడ్డారు.

పోరు ఒకటిరెండు నిమిషాలు జరిగేసరికి, ఆంగ్ల ముస్లిం సేనలు, సంతానుల ధాటి కాగలేక, రణక్షేత్రంనుంచి తమ డేరాలకేసి పరిగెత్తసాగినై. మహేంద్రుడు సంతానసైన్యాన్ని ఉత్సాహపరుస్తూ, "కొండశిఖరం కేసి చూడండి : అక్కడ సత్యానందస్వామి జండా ఎగురుతున్నది. ఈ రోజునే ముర, నరక, కంసాది రాక్షస సంహారి అయిన శ్రీహరి ఉద్భవించాడు. శిఖరంమీద లక్ష సంతానసైన్యం వున్నది. నినదించండి : హరేమురారే మధుకైటభారే :" అన్నాడు.

మహేంద్రసింహుడు చెప్పినట్టు కొండశిఖరంమీద సత్యానందస్వామి జెండా గాలికి రెపరెపలాడుతున్నది; ఆంగ్లసైన్యం కొండశిఖరాన్ని పట్టుకునే ప్రయత్నం చేయటమేగాక, కొండను చుట్టివచ్చి సంతానులను ఎదిరించే సమయంలోనే, సత్యానందస్వామి ఇరువైఅయిదువేల సంతానసేనతో వచ్చి, ఉవ్వెత్తున లేచిన సముద్రతరంగంలాగా, ఆంగ్ల ముస్లిం సైన్యాలమీద విరుచుకుపడ్డాడు.

రెండు మహాపర్వతాల సంఘర్షణమధ్యపడి నలిగిపోయిన మదపుటేనుగులా, ఆంగ్ల ముస్లిం సేనలు, రెండువైపులనుంచి వచ్చి తాకిన సంతానసైన్యం మధ్య పడి నుగ్గునుగ్గయిపోయారు. జరిగిన సంగతి గవర్నర్ వారన్ హేస్టింగ్స్‌కు చెప్పేందుకు వాళ్ళల్లో ఒక్కడుకూడా మిగలలేదు.

* * * * *

పౌర్ణమిచంద్రుడు ఆకాశమధ్యంలో ప్రకాశిస్తున్నాడు రణక్షేత్రమంతా భీభత్సంగా వున్నది. చచ్చినవారు చావగా, గాయపడి చావుబతుకులమీద వున్న

యోధులు బాధతో మూలుగుతూ కేకలు పెడుతున్నారు. ఆ సమయంలో ఒక స్త్రీ. కాగడా ఒకటి చేతబట్టి, ఆ ప్రదేశమంతా ఎవరికోసమో వెతుకుతున్నది. ఆమె మరణించిన సైనికుల ముఖాలను తన కాగడా వెలుగులో పరీక్షించటమేగాక, అక్కడక్కడా పడివున్న శవాల గుట్టలనుకూడా కదిలించి, అందులో ఎవరికోసమో వెతుకుతున్నది.


ఆ స్త్రీ యీ విధంగా ఒకటి రెండు గంటల కాలం యుద్ధభూమి అంతా తిరిగి, నిస్పృహురాలై, కాగడాను ఒకచోట నేలమీద గుచ్చి, వెక్కి-వెక్కి ఏడ్వసాగింది. హఠాత్తుగా ఆమెకు, "దుఃఖించకు, లే," గంభీరస్వరం వినిపించింది. ఆమె కళ్ళెత్తి అన్నధ్వనివచ్చినదిక్కుకు చూసింది. లోగడ అరణ్యంలో సత్యానందస్వామికి దర్శనం యిచ్చిన కాషాయ వస్త్రధారియైన మహాపురుషుడు ఆమెను సమీపించాడు.

"నవీనానందా......శాంతీ! ఏడవకు, నీ భర్త జీవానందుడి శవాన్ని నే వెతికి యిస్తాను. నా వెంట రా," అంటూ ఆ మహాపురుషుడు బయలుదేరాడు.

శాంతి దుఃఖించటం మాని, ఆ తేజస్వివెంట నడిచింది. అతడు యుద్ధరంగం మధ్యను గుట్టగా పడివున్న శవాల కిందనుంచి జీవానందుడి శవాన్ని బయిటికి లాగి, "శాంతీ, చూడు యింకా ప్రాణ మేమయినా వున్నదేమో'" అన్నాడు,

శాంతి పొంగివచ్చే దుఃఖాన్ని దిగిమింగుకుని భర్త చేతులు పట్టుకుని నాడి పరీక్షించింది. తరువాత గుండెలమీద చేయి వేసి, ఏమాత్రమైనా గుండె కొట్టుకుంటున్నదేమో అనిచూసింది. అంతా వృథా. జీవానందుడెప్పుడో మరణించాడు.

"స్వామి,ఆయనెప్పుడో మరణించారు," అన్నది శాంతి.



"ఈసారి పరీక్షించిచూడు," అన్నాడు మహాపురుషుడు.

శాంతి నాడి పరీక్షించింది; అది ఆడుతున్నది గుండె పరీక్షించింది, అది కొట్టుకుంటున్నది. శాంతి దిగ్గున లేచి ఆ కాషాయవస్త్రధారి పాదాలు పట్టుకుంటూ," స్వామీ, నాకు పతిభిక్ష పెడుతున్నారా!" అన్నది.

మహాపురుషుడు చిరునవ్వునవ్వి, నీ భర్తను నువ్వు మోయగలవా! ఏదీ చూతాం. ఆ నదిదగ్గిరకు చేర్చు," అంటూ అతడు అరణ్యంకేసి వెళ్ళాడు. ఈలోపల శాంతి జీవానందుణ్ణి సునాయాసంగా ఎత్తి భుజాన వేసుకుని, నదీతీరం చేర్చి, అతడి గాయా లన్నీ కడిగింది. అంతలో ఆ కాషాయాంబరధారి ఏవో ఆకుపసర్ను తెచ్చి, జీవానందుడి గాయాలమీద పోశాడు. జీవానందుడు అప్పుడే నిద్రనుంచి మేల్కొన్న వాడిలా కళ్ళు తెరిచి, ''యుద్ధంలో జయం ఎవరిది?" అని ప్రశ్నించాడు.

''జయం మీదే! యుద్ధంలో మీరు మరణించారు. తరవాత యీ మహానీయుడి చికిత్సవల్ల బతికారు; వారికి నమస్కరించండి,'' అంటూ శాంతి పక్కకు తిరిగింది. అక్కడ ఆకాషాయాంబరధారి లేడు.


"ఏ దైవాంశ సంభూతుడైన మహాపురుషుడో మిమ్మల్ని బతికించి తన దారిన తాను వెళ్ళిపోయాడు," అన్నది శాంతి.

"నన్ను బతికించవలసిందికాదు. నేను వ్రతభంగం చేశాను. ఈ చావుతో నాకు ప్రాయశ్చిత్తం జరిగిపోయింది. కాని, మళ్ళీ సజీవుణ్ణి కావటం ద్వారా, మళ్ళీ ప్రాయశ్చిత్తంకోసం మరణించక తప్పదు," అన్నాడు జీవానందుడు ఉద్వేగంగా.

"యుద్ధరంగంలో మరణించటంద్వారా, మీరు వ్రతభంగానికి చేసుకోవలసిన ప్రాయశ్చిత్త మేదో చేసుకున్నారు. ఇది పునర్జన్మ. ఈ జన్మలో యింకా మీరు వ్రతదీక్షే తీసుకోలేదు. కనుక, దాన్ని భంగపరచటం అన్న మీమాంసే రాదు," అన్నది శాంతి.

జీవానందు డాలోచనలో పడ్డాడు. తన భార్య చెప్పిన దానిలో సత్యమున్న ట్లతనికి తోచింది. ''అయితే, మనం తిరిగి గృహస్థధర్మం స్వీకరిద్దా మనా నీ అభిప్రాయం?" అని ప్రశ్నించా డతడు అయిష్టంగా.

భర్త స్వరంలోని అయిష్టతా, నిరుత్సాహాలను గుర్తించిన శాంతి, ఏమీ తొణకకుండా, ''గృహస్థ ధర్మం స్వీకరించ మని నే ననటంలేదు. మనం బ్రహ్మచర్యం అవలంబిద్దాం. దేశ మంతా తిరిగి తీర్థయాత్రలు చేసి, హిమాలయాలకు పోయి, అక్కడో కుటీరం నిర్మించుకుని, శేషజీవితాన్ని భగవధ్యానంలో గడుపుదాం,'' అన్నది.



మారు మాటాడకుండా జీవానందుడు లేచి నిలబడ్డాడు. శాంతి భర్తచేతిని ఆసరాగా పట్టుకున్నది. ఇద్దరూ నిశ్శబ్దంగా ఆ వెన్నెలరాత్రిలో ఉత్తరపు దిక్కు-కేసి పయనించారు.

# 15

సంతానసైన్యం విజయం పొందగానే, సత్యానందస్వామి ఆనందమఠముకు పోయి విష్ణుమంటపంలో కూచుని ధ్యానమగ్నుడయాడు. ఆ సమయంలో కాషాయాంబరధారి యగు మహాపురుషు డక్కడకి వచ్చి, "సత్యానందా, నేడే మాఘ పూర్ణిమ!" అన్నాడు.

సత్యానందస్వామి కళ్లు తెరిచి, "అయితే, పదండి వస్తున్నాను. కాని, నా సందేహం ఒకటి తీర్చండి. నేను యుద్ధభూమిలో విజయం పొంది, సంతాన ధర్మాన్ని నిష్కంటకం చేసిన క్షణాన్నే తమరు నన్నెందుకు యీ త్యాగం చెయ్యమంటున్నారు?" అన్నాడు.

"నీవు తలపెట్టిన కార్యం సిద్ధించింది కనకా, ముస్లిం రాజ్యాధికారం విధ్వంసమై పోయింది కనకా, ఇక వ్యర్థ జీవహింసతో కలిగే లాభ మేమిటి?" అన్నాడు మహాపురుషుడు.

"మహమ్మదీయరాజ్యం బూడిదపాలైంది కాని, యింకా హిందూరాజ్యం స్థాపించబడలేదు. వంగదేశంలో యీనాటికీ ఆంగ్లేయులు ప్రబలులుగానే ఉన్నారు," అన్నాడు సత్యానందస్వామి.

''హిందూరాజ్యం ఇంతత్వరలో స్థాపితం కాదు," అన్నా డా మహాపురుషుడు.

"అయితే, మహమ్మదీయులే తిరిగి రాజు లగుదురా ?"

"వారు రాజులు కాలేరు. రాజులు కానున్నవారు ఆంగ్లేయులు."

ఆ మాటలు వింటూనే సత్యానందుడి నేత్రాల్లోనుంచి జలజలమంటూ అశ్రుబిందువులు రాలినై. రుద్ధమైపోయిన కంఠస్వరంతో అతడు, "రాజ్యం తిరిగి మరొకజాతి మ్లేచ్ఛులచేతిలో పడనున్న దన్నమాట. హా మాతా ! యుద్ధభూమిలోనే, నే నెందుకు మరణించలేదు," అంటూ దుఃఖించసాగాడు.

అప్పు డా మహాపురుషుడు, సత్యానందుడి భుజంమీద చేయి వేసి, "దుఃఖించకు, సత్యానంద్ ! నీవు దస్యుడిలా దేహబలంతో దారులు కొట్టి ధనం సంపాయించావు. దానితో ఆయుధాలు తయారు చేయించావు. పాపకార్యానికి పుణ్యఫలం కలగదు. ఆంగ్లేయులు రాజులు కానిదే, సంతాన ధర్మోద్ధరణ జరగదు. నిజమైన హిందూ ధర్మము జ్ఞానాత్మకముగాని, కర్మాత్మకముగాదు. అయినా, భౌతిక జ్ఞాన మేమిటో తెలియనివాడు, ఆధ్యాత్మిక జ్ఞానం సంపాయించలేడు. భౌతికజ్ఞానంలో ఆంగ్లేయులు గొప్ప పండితులు, లోకశిక్షాదక్షులు. అందుచేత మనం ఆంగ్లేయుల్ని రాజులుగా చేద్దాం. వాళ్ళ శిక్షణలో యీ దేశస్థులు భౌతిక విషయజ్ఞానపారంగతు లౌతారు. ఆ విధంగా హిందువులు గుణవంతులూ, బలవంతులూ అవుతారు. అప్పుడు నిజమైన సత్య మేదో, ధర్మ మేదో వారే గుర్తిస్తారు. ఈ లోపల ఆంగ్లేయుల పాలనలో ప్రజలు సుఖవంతు లవుతారు. కనుక వాళ్ళతో శత్రుత్వం మాను," అన్నాడు.

ఆంగ్లేయులు రాజు లవటం క్షేమ మని మీరు భావిస్తూంటే, మమ్మ ల్నెందుకు, యీ విద్రోహానికి పురికొల్పారు !'' అని ప్రశ్నించాడు సత్యానందుడు.

''ఆంగ్లేయులు ప్రస్తుతం వర్తకులుగా మాత్రమే వుంటున్నారు, వాళ్ళకు ధనార్జన మీద కాంక్ష తప్ప, దేశంమీద అధికారం చలాయించాలనే కాంక్షలేదు. ఈ సంతాన విద్రోహం కారణంగా, వాళ్ళు రాజ్యాధికారాన్ని వశపరుచుకునేందుకు ప్రయత్నిస్తారు. ఎందువల్లనంటే, రాజ్య శాసనాధికారం లేందే, ధన సంగ్రహణం సాధ్యం కాదు. సంతానులు నడిపిన విద్రోహం, యీ విధంగా ఆంగ్లేయుల్లో రాజ్యకాంక్ష కలిగిస్తుంది; తెలిసిందా ? యిక నడువు; పోదాం," అంటూ మహాపురుషుడు కదిలాడు.

సత్యానందస్వామి ముందు కడుగిడబోయినవాడల్లా ఆగి, ''స్వామీ, ఒక్క



మాట; నాలో యింకా మాతృభక్తి నశించలేదు. నే నే వ్రతదీక్ష తీసుకున్నానో, ఆదీక్షలో నేను అచంచలుడుగా నుండునట్లు ఆశీర్వదించండి," అన్నాడు.

''సత్యానందా. నీ మాతృభక్తి సఫలమయింది. ఇక దీక్ష విడువు నీ వ్రతం సఫలమై దేశంలో ఆంగ్లేయుల రాజ్యాధికారం స్థాపించబడింది," అన్నా డా మహాపురుషుడు.

సత్యానందుడు హృదయంలో ఉబికివచ్చే కోపాన్ని ఆపుకుంటూ, ''స్వామీ, క్షమించండి, శత్రురుధిరంతో తడిపి, నా మాతృభూమిని సస్యశాలినిగా చేయాలనే కాంక్ష, నాలో యింకా నశించలేదు,'' అన్నాడు.

ఈ మాటల కా మహాపురుషుడు చిరునవ్వు నవ్వి, ''శత్రువు లెవరు? ఆంగ్లేయులు మనకు మిత్రులైన రాజులు; పద, నీకు జ్ఞానప్రాప్తి కలిగిస్తాను, హిమాలయ శిఖరం మీద మాతృమందిరం వున్నది. అక్కడ నీకు నిజమైన మాతృమూర్తి దర్శన భాగ్యం కలిగేలా చేస్తాను," అన్నాడు.

సత్యానందస్వామి తలవంచుకున్నాడు. మహాపురుషుడు అతడి చేయి పట్టుకున్నాడు. అప్పు డా విష్ణుమందిరంలో వేయిదీపశిఖలు వెలుగొందినట్లు దశదిశలా కాంతి వెల్లివిరిసింది. ఇద్దరు మహాపురుషులు ఒకరి చేయి ఒకరు పట్టుకున్నారు. జ్ఞానము వచ్చి భక్తితో కరస్పర్శ చేసింది. ధర్మము వచ్చి కర్మను పట్టుకున్నది. త్యాగం ప్రతిష్ఠను పట్టి కుదిపింది. కళ్యాణి వచ్చి శాంతిని పరామర్శించింది. సత్యానందుడే శాంతి ఆ మహాపురుషుడే కళ్యాణి.

ప్రతిష్ఠ విసర్జనవెంట వెళ్ళిపోయింది.